ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 5
జిల్లా వార్తలు
బుధవారం 31, జనవరి 2024



తగ్గేదే లే

వైసీపీలో ముదిరిన ముసలం

వైసీపీలో ముసలం ముదిరింది. ఒంగోలు ఎంపీ స్థానాన్ని మాగుంటకు ఇవ్వకపోగా అందరూ వద్దన్న చెవిరెడ్డికి కేటాయించటమేగాక, పార్టీ బాధ్యతలు కూడా అప్పగిస్తూ సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో అసంతృప్తికి గురైన బాలినేని అలకబూనారు. సముదాయించేందుకు వచ్చిన ఆపార్టీ నేతలు సజ్జల, సాయిరెడ్డిలపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సీఎంను కలిసే ప్రసక్తే లేదు పొమ్మని తేల్చి చెప్పారు. మరోవైపు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోయినా ఎంపీగానైనా అవకాశం ఇవ్వాలని కోరినా కాదనడంతో దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి తన రాజకీయ భవితవ్యంపై అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. సీఎం తాజా నిర్ణయం అనంతరం మాగుంటతోపాటే ఆయన అనుచరులు పయనించాలని, అవసరమైతే వైసీపీకి గుడ్‌బై చెబుతామని ప్రకటించారు. మాగుంట టీడీపీలో చేరే ప్రయత్నాలు మంగళవారం సాయంత్రం నుంచి ముమ్మరమయ్యాయి. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సీఎంను కలిసేందుకు వెళ్లలేదు. కాగా బాలినేని వైసీపీలో ఉండాలా? లేక తప్పుకోవాలా? అన్న ఆలోచన చేస్తున్నట్లు కూడా సమాచారం.

- చెవిరెడ్డికి ఒంగోలు ఎంపీ టికెట్, పార్టీ బాధ్యతలు
- కుదరదు.. సీఎంను కలవను : బాలినేని
- సజ్జల, సాయిరెడ్డి మంతనాలు
- నేడు అనుచరులతో ఎమ్మెల్యే మద్దిశెట్టి ప్రత్యేక సమావేశం
- మేమంతా ఎంపీ బాటే అంటున్న ఆయన అనుచరులు
- వేగంగా పావులు కదుపుతున్న మాగుంట

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు ఎంపీ అభ్యర్థి ఎంపికపై సీఎం జగన్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య నెలకొన్న అభిప్రాయబేధాలు తారస్థాయికి చేరాయి. దీంతో అభ్యర్థుల ఎంపికలో అధికార వైసీపీలో ఆరంభమైన ముసలం ముదిరుపాకాన పడినట్లైంది. జిల్లాలో వైసీపీ అభ్యర్థుల ఎంపికలో కీలకంగా మారిన ఎంపీ అభ్యర్థి ఎంపికపై గత కొంతకాలంగా అధిష్ఠానం నిర్ణయానికి జిల్లా నాయకుల అభిప్రాయానికి మధ్య పొంతన కుదరని విషయం విదితమే. ఈ విషయంలో తుది నిర్ణయం తీసుకునేందుకు బాలినేనిని రమ్మని అధిష్ఠానం కబురుచేసింది. విజయవాడ చేరిన బాలినేనికి మంగళవారం ఉదయం ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా తిరుపతి జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరును ఖరారు చేసినట్లు సమాచారం ఇచ్చారు. ఆతర్వాత కొద్దిసేపటికే ప్రస్తుతం విజయసాయిరెడ్డి చేతిలో ఉన్న విభజన అనంతరం ప్రకాశం జిల్లా, నెల్లూరు జిల్లాలోని కందుకూరు, కావలి నియోజకవర్గాల పార్టీ బాధ్యతలను చెవిరెడ్డికి అప్పగిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పార్టీ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి జిల్లాలో బాలినేనితో పూర్తి సఖ్యతతో ఉన్నారన్న భావనతోనే ప్రకాశం జిల్లా వరకు బాధ్యతలను చెవిరెడ్డికి మార్చినట్లు కూడా ప్రచారం జరిగింది. ఆ విషయంలో బాలినేనితో విభేదిస్తున్న ఆయన బావ వైవీ కీలకపాత్ర పోషించినట్లు కూడా ప్రచారంలోకి వచ్చింది.

తీవ్ర అసంతృప్తిలో బాలినేని

తనతోపాటు ఒంగోలు లోక్‌సభ పరిధిలోని మెజారిటీ అసెంబ్లీ అభ్యర్థులు కోరినా మాగుంటకు టికెట్ ఇవ్వకుండా తాను వద్దన్న చెవిరెడ్డికే ఇవ్వడం, అందునా పార్టీ బాధ్యతలు కూడా కట్టబెట్టడంతో బాలినేని తీవ్ర అసంతృప్తికి గురైనట్లు తెలిసింది. ఆ తర్వాత బాలినేనిని సీఎంను కలవాలని కోరినా ఆయన ససేమిరా అన్నారు. దీంతో సజ్జల, సాయిరెడ్డి విజయవాడలో బాలినేని ఉన్న హోటల్‌కు వెళ్లి ఆయనతో మంతనాలు జరిపారు. ఆ సందర్భంగా కూడా బాలినేని తీవ్రస్వరంతో మాట్లాడినట్లు తెలిసింది. 'మాగుంటను కాదన్నారు. ఆయన కొడుకునూ కాదన్నారు. మధ్యలో జిల్లాలోని వారికే అవకాశం ఇస్తామని చెప్పారు. ఇప్పుడేమో తాము కాదన్న చెవిరెడ్డికే సీటిచ్చారు. ఆయనకు పార్టీ బాధ్యతలూ ఇస్తున్నారు. ఇక సీఎం చెప్పినా.. మీరు చెప్పినా ఆయన ఆధ్వర్యంలో మేము పనిచేయలేం. వెళ్లిపోండి' అంటూ సూటిగా చెప్పినట్లు తెలిసింది. బాలినేనిని సీఎం వద్దకు తీసుకెళ్లాలని వారు చేసిన ప్రయత్నం విఫలమైంది. వారి వెళ్లేటప్పుడు మీడియా ప్రతినిధులు వెళ్లి పలకరించగా వారిని సజ్జల కసురుకున్న తీరు బాలినేనితో మంతనాల తీవ్రతను తెలియజేస్తోంది.

మాగుంటపై అనుచరుల ఒత్తిడి

సీఎం నిర్ణయంతో వేచిచూసే ధోరణి నుంచి బయటకు రావాలని ఎంపీ మాగుంటపై ఆయన అనుచరులు ఒత్తిడి పెంచారు. చెవిరెడ్డికి పేరు ఖరారైందని తెలియగానే మాగుంట అనుచరులు ఎక్కడికక్కడ భేటీ అయ్యారు. అందిన సమాచారం మేరకు కొండపి, కనిగిరి, గిద్దలూరు, దర్శి, ఒంగోలు తదితర నియోజకవర్గాల్లో ఆయన అనుచరులు సమావేశమై మాగుంట నిర్ణయానికి కట్టుబడి ఉండాలని, అవసరమైతే వైసీపీకి గుడ్‌బై చెప్పాలని కూడా నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఇటీవల మాగుంట కుమారుడు రాఘవరెడ్డి ఆయా నియోజకవర్గాల్లో పర్యటించినప్పుడే వైసీపీలో ఉన్న నాయకులు ఆయన్ను కలిసి మాగుంట కుటుంబం ఎటుంటే అటు తాముంటామని తేల్చిచెప్పారు. కాగా మాగుంట ఇప్పటికే టీడీపీ ముఖ్యనాయకులతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. తాజా పరిణామాలతో ఆయన వేగంగా పావులు కదుపుతున్నట్లు కూడా తెలిసింది. విషయం తెలుసుకున్న ఒకరిద్దరు టీడీపీ రాష్ట్రస్థాయి నాయకులు కూడా మాగుంటకు టచ్‌లోకి వచ్చినట్లు సమాచారం. తద్వారా మాగుంట లేక ఆయన కుమారుడు లేక ఇద్దరూ టీడీపీ వైపు నుంచి పోటీచేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

చెవిరెడ్డితో కలిసి పనిచేయలేను

అనంతరం సజ్జల, సాయిరెడ్డిలు బాలినేని అభిప్రాయాలను, లోక్‌సభ పరిధిలోని పరిస్థితులను సీఎంకు వివరించినా ఆయన నుంచి వేరే ఆలోచన వ్యక్తం కాలేదని తెలిసింది. రాత్రి పొద్దుపోయే సమయానికి బాలినేనికి కూడా ఆ సమాచారం తెలిసింది. దీంతో బాలినేని చెవిరెడ్డి నాయకత్వంలో పనిచేసే కన్నా పోటీనుంచి తప్పుకొని కొంతకాలం విశ్రాంతి తీసుకోవడమే మేలన్న ఆలోచనకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. విషయం తెలుసుకుని బాలినేని కుమారుడు, అలాగే ఆయన వియ్యంకుడు ఇతర శ్రేయోభిలాషులు విజయవాడ వెళ్లి ఆయన్ను శాంతింపజేసే ప్రయత్నాలు చేస్తున్నారు.

నేడు అనుచరులతో మద్దిశెట్టి సమావేశం

సీఎం నిర్ణయం తాజాగా స్పష్టం కావడంతో దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తన రాజకీయ భవితవ్యంపై నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. దర్శి టికెట్ తనకు గిట్టని బూచేపల్లికి ఇచ్చినా ఆయన సీఎం వద్దకు వెళ్లి తనకు ప్రత్యామ్నాయ అవకాశం ఇవ్వాలని కోరారు. ఒంగోలు లేదా పర్చూరుల్లో పోటీచేయ మని సీఎం సూచించారు. అయితే ఎమ్మెల్యేగా దర్శి మినహా మరోచోట పోటీచేయనని, ఒంగోలు ఎంపీ సీటు ఇస్తే బరిలోకి దిగుతానని మద్దిశెట్టి కోరారు. ఆరంభం నుంచి జగన్ ఒంగోలు ఎంపీగా రెడ్డి సామాజికవర్గం వారినే పోటీకి దింపుతామని చెబుతూ వచ్చారు. మంగళవారం అదే విషయం స్పష్టం చేయటంతో మద్దిశెట్టి కూడా తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తన రాజకీయ భవితవ్యంపై నిర్ణయం తీసుకునేందుకు నియోజకవర్గంలోని అనుచరులతో భేటీ అవుతున్నారు. ఆ మేరకు బుధవారం దర్శిలోని ఆయన ఇంట్లో జరిగే సమావేశానికి రావాలని అనుచరులందరికీ సమాచారం ఇచ్చారు. దర్శిలో వైసీపీ అభ్యర్థి ఓటమి లక్ష్యంగా ఆయన నిర్ణయం తీసుకోబోతున్నట్లు అనుచరులకు సంకేతం కూడా వచ్చింది.



సీఎంను కలవని నాగార్జునరెడ్డి

మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరుకు, అక్కడి ఎమ్మెల్యే రాంబాబు లేక ఆయన కుమారుడు చైతన్యలను మార్కాపురానికి మార్చాలన్న వైసీపీ అధిష్ఠానం నిర్ణయం కూడా సఫలం కాలేదు. ఇటు కుందురు, అటు ఉడుముల కుటుంబాల రాజకీయ నేపథ్యం.. ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని మార్కాపురంను వీడకూడదని నాగార్జునరెడ్డి నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే ఆయన సోమ, మంగళవారా ల్లో సీఎంను కలిసేందుకు కూడా వెళ్లలేదని తెలుస్తోంది. ఇప్పటికే కందుకూరు, పర్చూరులాంటి చోట్ల అభ్యర్థుల ఎంపికపై కూడా మంతనాలు కొలిక్కిరాని దశలో రానున్న రోజుల్లో వైసీపీ అంతర్గత కలహాలు ముదిరిపాకానపడటం ఖాయంగా కనిపిస్తోంది.



రెగ్యులర్ పేరుతో మామూళ్లు

- ఒక్కొక్కరి నుంచి రూ.10వేల వరకు వసూలు
- పైస్థాయిలో ఇవ్వాలంటూ ఉద్యోగుల ఒత్తిడి
- వైద్యారోగ్య శాఖలో ఇదీ పరిస్థితి

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 30: వైద్యారోగ్యశాఖలో 2014కు ముందు నుంచి పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను కొందరు ఉద్యోగులు ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.10వేల వసూలుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అందుకు ఆయా అసోసియేషన్లపై ఒత్తిడి పెంచారు. వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న సుమారు 182 మంది ఉద్యోగులు ప్రస్తుతం రెగ్యులర్ అయ్యే అవకాశం ఉంది. అందుకు వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. 49 మంది ఏఎన్‌ఎంలు, 103మంది హెల్త్ అసిస్టెంట్లు, 21మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 11మంది ఫార్మసిస్టులు, ఒక పీఎంవోకు రెగ్యులర్‌కు అర్హత ఉంది. దీంతో వారందరి ప్రతిపాదనలను రూపొందించి ప్రభుత్వానికి పంపాల్సి ఉంది. ఇదే అదనుగా కొంతమంది.. రెగ్యులర్ అయ్యే సిబ్బంది నుంచి డబ్బులు వసూలుకు పన్నాగం పన్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.10వేలకుపైనే రాబట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అందుకు ఆయా అసోసియేషన్లపై ఒత్తిడి పెంచినట్లు సమాచారం. కొంతమంది ఉద్యోగులు మామూళ్లు ఇచ్చేందుకు నిరాకరించినట్లు తెలిసింది. అయినా వదిలిపెట్టకుండా అలాంటి వారి వద్ద కనీసం రూ.5వేలు ఇవ్వాలనే ప్రతిపాదనలు కూడా పెట్టినట్లు సమాచారం. రెగ్యులర్ చేసేందుకు పైస్థాయిలో కూడా కొంత ముట్టజెప్పాల్సి ఉందని, అందువల్ల తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. సుదీర్ఘకాలం వైద్యశాఖలో పనిచేసి ప్రస్తుతం రెగ్యులర్ అయ్యేందుకు అవకాశం వచ్చిన తరుణంలో తమను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఉన్నతాధికారులు ఎలాంటి మామూళ్లు ఇవ్వొద్దని బహిరంగంగా చెప్తున్నా కొంత మంది దళారులు అదేపనిగా డబ్బుల కోసం పట్టుపడుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఇటువంటి మామూళ్ల వసూలు వ్యవహారాన్ని అరికట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఆరుగురు తహసీల్దార్ల ఉద్యోగ విరమణకు ఓకే

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 30 : జిల్లాలో 2024 సంవత్సరంలో ఆరుగురు తహసీలార్ల ఉద్యోగ విరమణకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. 2024లో ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు చేరిన తహసీల్దార్లు, ఆ కేడర్‌లో ఉన్న సూపరింటెండెంట్ల ఉద్యోగ విరమణకు అనుమతి ఇచ్చారు. అయితే సర్వీసులో ఉన్నప్పుడు వచ్చిన క్రమశిక్షణ చర్యలు, విచారణలు ఎదుర్కోవాల్సిందేనని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వేటపాలెం తహసీల్దార్ యు.అశోక్‌వర్ధన్ ఈనెల 31న, యద్దనపూడి తహసీల్దార్‌గా పనిచేస్తూ సెలవులో ఉన్న బి.వెంకటరెడ్డి మార్చి 31న, తాళ్లూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న కేవీ ప్రసాద్, మర్రిపూడి తహసీల్దార్‌గా పనిచేస్తూ సస్పెండైన సిహెచ్.కృష్ణారావు, దోర్నాల తహసీల్దార్ ఎ.వేణుగోపాలరావు, కొనకనమిట్ల తహసీల్దార్ బీఆర్‌ఎల్‌వీ ప్రసాద్ జూన్ 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

విద్యార్థినుల అదృశ్యం.. గాలిస్తున్న పోలీసులు

రాచర్ల, జనవరి 30 : మండలంలోని పారం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు సోమవారం పాఠశాలకు వెళ్లి తిరిగి రాలేదు. 9వతరగతి చదువుతున్న మీనిగ చరిత, 8వతరగతి చదువుతున్న నారాయణమ్మ సోమవారం రాచర్లలోని ఉన్నత పాఠశాలకు వెళ్లారు. సాయంత్రం పాఠశాల విడిచిపెట్టిన తర్వాత ఇద్దరూ ఇంటికి రాలేదు. దీంతో వారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కృష్ణపావని కేసు నమోదు చేశారు. విద్యార్థుల ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఆమె తెలిపారు.

వేధింపులకు పరాకాష్ఠ

- వైసీపీ రౌడీలతో కలిసి మైనింగ్ అధికారుల తనిఖీలు
- టీడీపీ సానుభూతిపరుల క్వారీలు, ఫ్యాక్టరీలే లక్ష్యం
- కారుల్లో కర్రలు, కారప్పొడితో హల్‌చల్
- దీటుగా ఎదుర్కొని పోలీసులకు అప్పగించిన యజమానులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాజకీయంగా ప్రత్యర్థి పార్టీల నాయకులను, సానుభూతిపరులపై వేధింపులలో అధికార వైసీపీ ప్రభుత్వం అండగా సాగించే చర్యలు పరాకాష్ఠకు చేరాయి. అందుకు మంగళవారం పర్చూరు నియోజకవర్గం మార్టూరు, అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ మండలాల్లో టీడీపీ మద్దతుదారుల గ్రానైట్ క్వారీలను లక్ష్యంగా చేసుకుని మైనింగ్ అధికారులు సాగించిన దాడులు, వారికి అండగా వైసీపీ గూండాలు రంగంలోకి రావటం దర్పణం పడుతోంది. గత ఎన్నికల్లో అధికారంలోకి రాగానే జగన్ ప్రభుత్వం వేధింపు చర్యలకు శ్రీకారం పలికిన విషయం తెలిసిందే. జిల్లాలో తెలుగుదేశం పార్టీ వైపునున్న నాయకుల గ్రానైట్ క్వారీలను తొలుత లక్ష్యంగా ఎంచుకుంది. అనంతరం వైసీపీలో చేరిన చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, వారి అనుచరుల క్వారీలను వదిలేసి టీడీపీతోనే ఉన్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు క్వారీలపై దాడులు కొనసాగించారు. వారి క్వారీలు, ఫ్యాక్టరీలు మూతపడేలా చేశారు. నిన్నటికి నిన్న తాము నియమించిన ఇన్‌చార్జికి సహకరించటం లేదన్న కోపంతో వైసీపీలోనే ఉన్న అద్దంకి మాజీ ఎమ్మెల్యే గరటయ్య కుమారుడు, శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య క్వారీలపై దాడులు చేసి గ్రానైట్ ఉత్పత్తుల అమ్మకాలను నిలిపివేశారు. భారీ జరిమానా విధించేందుకు రంగం సిద్ధం చేశారు. తాజాగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై అక్రమ కేసులు బనాయించారు. పర్చూరులో ఓటమి తప్పదని భావించిన వైసీపీ అంతటితో ఆగకుండా మంగళవారం ఆ నియోజకవర్గానికి చెందిన టీడీపీ మద్దతు గ్రానైట్ వ్యాపారుల క్వారీలపై దాడులు చేపట్టారు. దాడులను కూడా వైసీపీ గూండాల ఆధ్వర్యంలో చేయటం గమనార్హం. దాడుల నిర్వహణకు వచ్చిన కృష్ణా జిల్లా మైనింగ్ ఏడీ ప్రతాపరెడ్డి వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన కారులో వచ్చారు. ఆ కారులో ఆయనతోపాటు వైసీపీ గూండాలు ఉన్నారు. అంతకుమించి కర్రలు, కారంపొడి ఉండటం విశేషం. విషయం తెలుసుకున్న గ్రానైట్ వ్యాపారులందరూ పార్టీరహితంగా ఒక్కటై దాడులను ఎదుర్కొనేందుకు రంగంలోకి వచ్చారు. వారిపై గూండాలు దౌర్జన్యం చేశారు. అంతలోనే ఎమ్మెల్యే ఏలూరి తన అనుచరులతో అక్కడికి చేరి వైసీపీ నేతల గూండాగిరిని అడ్డుకున్నారు. అంతేగాక ప్రైవేటు గూండాలతో రంగంలోకి వచ్చిన అధికారులను నిలదీసి ప్రశ్నించారు. ప్రైవేటు గూండాలను అక్కడికొచ్చిన జనం పట్టుకున్నారు. ఆ తర్వాత పోలీసులను పిలిపించి కారులో లభ్యమైన కర్రలు, కారం పొడిని, ఇతర మారణాయుధాలను, గూండాలను వారి వాహనాలలో వచ్చిన అధికారులను కూడా అప్పగించారు. దీంతో దౌర్జన్యంగా సాగించబోయిన దాడుల దందాకు తాత్కాలికంగా బ్రేక్ పడినా ఏదోవిధంగా టీడీపీ మద్దతుదారుల క్వారీలను మూసివేయించేందుకు వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించవచ్చునని భావిస్తున్నారు.



వేమవరం వద్ద ఏలూరి అనుచరుడి గ్రానైట్ ఫ్యాక్టరీలో తనిఖీలు చేస్తున్న అధికారులు

భువనేశ్వరికి ఘనస్వాగతం

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 30 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరికి ఒంగోలులో ఘనస్వాగతం లభించింది. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి ఆమె ఒంగోలు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు త్రోవగుంట వద్ద జాతీయ రహదారి నుంచి ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె ముక్తినూతలపాడు చేరుకున్నారు. చంద్రబాబును వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా జైలులో పెట్టడాన్ని తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందిన వెంకట్రావు కుటుంబసభ్యులతో మాట్లాడి ఓదార్చారు. పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారికి భరోసాగా ఉండేందుకు రూ.3లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ముక్తినూతలపాడు గ్రామస్థులు పెద్దసంఖ్యలో భువనేశ్వరి కోసం తరలివచ్చారు. ఆమెతో కరచాలనం చేసేందుకు, ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపారు. గ్రామంలోని వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. భువనేశ్వరి ప్రజలకు నమస్కరించి అభివాదం చేశారు. అనంతరం త్రోవగుంట సమీపంలోని బృందావనం ఫంక్షన్ హాలుకు చేరుకొని అక్కడ బస చేశారు.

ముక్తినూతలపాడులో వెంకట్రావు కుటుంబానికి పరామర్శ



వెంకట్రావు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి

ఏసీబీ వలలో వైద్యశాఖ అధికారులు

- రూ.1.40 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- మలేరియా విభాగంలోని ఇద్దరు అరెస్టు

ఒంగోలు(క్రైం), జనవరి 30: వైద్యశాఖ మలేరియా విభాగంలో పనిచేస్తున్న ఇరువురు లంచావతారులు ఏసీబీకి చిక్కారు. ఆ విభాగంలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్‌కు పీఆర్సీ అరియర్స్ బిల్లు చేసేందుకు రూ.1.40లక్షలు లంచం డిమాండ్ చేసి ఆ డబ్బులు తీసుకుంటూ ఒంగోలులో మలేరియా విభాగం జిల్లా అధికారి జ్ఞానశ్రీ, అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసరావు అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికిపోయారు. వివరాల్లోకి వెళితే.. దోర్నాలలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఇబ్రాయిల్‌కు 2015 నుంచి 2021 వరకు పీఆర్సీ అరియర్స్ రూ.16,86,103 ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అయితే ఆ బిల్లు చేసేందుకు జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ అందులో 25శాతం తనకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో హైకోర్టును ఆశ్రయించిన ఇబ్రాయిల్‌కు వెంటనే పీఆర్సీ బకాయి చెల్లించాలని ఆదేశాలిస్తూ తీర్పు వచ్చింది. ఈ మేరకు మలేరియా శాఖ ఆర్‌జేడీ, జిల్లా అధికారి జ్ఞానశ్రీని వివరణ కోరారు. అంతేకాకుండా వెంటనే ఇబ్రాయిల్‌కు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లును మంజూరుచేయాలని ఆదేశించారు. అయినప్పటికీ జ్ఞానశ్రీ మొండిపట్టు వీడలేదు. ఇబ్రాయిల్‌ను పిలిపించి మీకు వచ్చే నగదులో 25శాతం అంటే రూ.4లక్షలు ఇవ్వాలని తేల్చిచెప్పారు. అలాగైతేనే బిల్లు చేస్తామని తెలిపారు. అయితే తాను అంత ఇవ్వలేననడంతో రూ.1.40లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ మొత్తం కూడా ఇవ్వడం ఇష్టంలేని ఇబ్రాయిల్ నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.



పట్టుబడిన అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసరావు



మలేరియా అధికారి జ్ఞానశ్రీ

పట్టుబడింది ఇలా..

ఇబ్రాయిల్‌కు రావాల్సిన పీఆర్సీ బకాయి రూ.16,86,103 అతని ఖాతాలో జమైంది. ఆ తర్వాత తనకు ఇస్తానన్న డబ్బులు ఇవ్వాలని జ్ఞానశ్రీ డిమాండ్ చేయడం ప్రారంభించారు. దీంతో ముందుగా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసిన ఇబ్రాయిల్ వారి సూచన మేరకు మంగళవారం డబ్బులిస్తానని జ్ఞానశ్రీకి తెలిపారు. అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసరావును పంపిస్తున్నానని, అతనికి ఇవ్వమని ఆమె చెప్పారు. ఈ మేరకు ప్రకాశం భవన్ ఎదురుగా ఉన్న కోఆపరేటివ్ జనరల్ స్టోర్ వద్దకు రమ్మని ఇబ్రాయిల్‌కు చెప్పిన శ్రీనివాసరావు అక్కడ వేచి ఉన్నారు. ఇబ్రాయిల్ వెళ్లి నగదు ఇవ్వగా అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తన సిబ్బందితో వచ్చి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. జిల్లా అధికారి జ్ఞానశ్రీ నగదు తెమ్మని చెప్పగా తీసుకున్నానని శ్రీనివాసరావు వారికి తెలిపారు. ఎ.జ్ఞానశ్రీతోపాటు శ్రీనివాసరావులను అరెస్టు చేసి నెల్లూరు కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తెలిపారు.

ప్రాచీన శాసనం లభ్యం

ఎర్రగొండపాలెం, జనవరి 30 : మరో అరుదైన శిలా శాసనం వెలుగులోకి వచ్చింది. మండలంలోని బోయలపల్లి గ్రామం ఎగువచెరువు తూమువద్ద 12వ శతాబ్దపు దాన శాసనాన్ని చరిత్ర పరిశోధకులు శ్రీనివాసప్రసాద్ తన బృందంతో గుర్తించారు. కాకతీయుల కాలం నాటి శాసనంగా వారు పేర్కొన్నారు. ఈ ప్రాచీన శాసన చిత్రాలను సేకరించి ఆర్కియాలజీ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపించారు. ఆ శాసనంలోని వివరాలను వారు వెల్లడించారు. గంగయ సాహిణి అనే ఆయన కాకతీయ మహారాజు గణపతిదేవుని కాలంలో సామంతరాజుగా ఉన్నారు. ఆయన సామాన్యశకం 1172లో తన తల్లిదండ్రులు, గణపతిదేవుని పేరున మకర సంక్రాంతి కాలంలో త్రిపురాంతకేశ్వరస్వామి వారికి కొంత భూమి దానంగా ఇచ్చారు. దువ్వలి కంపణము అనే గ్రామంలోని రెడ్లపల్లి పొలం, బోయలపల్లి అనే గ్రామంలోని ఆదాయాన్ని ఆలయానికి దానం చేసినట్లు శాసనంలో ఉంది. ఇక గంగయ సాహిణి కాయస్థ వంశానికి చెందిన వారు. వీరి మేనళ్లుల్లు, అంబకాపతి కుమారులు జన్నిగదేవుడు, త్రిపురారిదేవుడు, అంబదేవుడు కూడా ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. గంగయసాహిణి కొచ్చెర్లకోట రాజధానిగా తన పరిపాలన సాగించాడు.



కూలిన కల్వర్టు గోడ

● మైనంపాడు రోడ్డులో ఆగిన రాకపోకలు


కూలిన కల్వర్టు గోడ

సంతనూతలపాడు, జనవరి 30: మైనంపాడు రోడ్డులో గుళ్లవాగువద్ద మంగళవారం కల్వర్టు రక్షణ గోడ కూలింది. దీంతో సంతనూతలపాడు-మైనంపాడు మధ్య రాకపోకలు స్తంభించాయి. ఈరోడ్డు ద్వారా మైనంపాడు, చలప్పాలెం, రుద్రవరం, లక్ష్మీపురం, గుర్వారెడ్డిపాలెం గ్రామాల ప్రజలు దాదాపు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టు గోడ కూలడంతో రోడ్డు కూడా కొంతభాగం కోసుకుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇటీవల పెద్ద వాహనం ఇదే కల్వర్టు మీదుగా వెళ్లడంతో దెబ్బతిని అధ్వానంగా తయారైంది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్ శౌరి బాధ్యతల స్వీకరణ

ఒంగోలు(క్రైం) జనవరి 30: ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గా పనిచేస్తున్న ఆవులయ్య మచిలీపట్నం బదిలీ కాగా, కృష్ణా జిల్లాలో ఈఎస్‌గా పనిచేస్తున్న టి.శౌరి ప్రకాశం జిల్లాకు వచ్చారు. ఈమేరకు బుధవారం స్థానిక ప్రకాశంభవన్‌లో గల ఎక్సైజ్ కార్యాలయంలో శౌరి బాధ్యతులు చేపట్టారు. అదేవిధంగా సెబ్ జిల్లా అధికారిగా పనిచేస్తున్న సుధీర్‌బాబు కర్నూలు ఎక్సైజ్ ఈఎస్‌గా బదిలీ కాగా, ఒంగోలుకు నెల్లూరులో పనిచేస్తున్న ఎస్.రవికుమార్ బదిలీ అయ్యారు.

త్యాగరాజ కృతులు భక్తిరస సిరులు


త్యాగరాజస్వామికి పూలమాల వేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు(కల్చరల్), జనవరి 30: నాదబ్రహ్మ, ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి వారి ప్రతి కృతి భక్తిరసంతో నిండి ఉండి మనసుకు ఎంతో ప్రశాంతత ఇస్తుందని ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. త్యాగరాజ స్వామి ఆరాధన సందర్భంగా మంగళవారం లలిత కళా అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక కేశవస్వామిపేట శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద గల త్యాగరాజ స్వామి విగ్రహానికి ఆయన పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధి కన్నా రాముని సన్నిధి మిన్న అంటూ త్యాగరాజస్వామి రామభక్తికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీరాముడిపై త్యాగయ్య రచించిన అనేక కృతులు ఎన్ని శతాబ్దాలు గడిచినా తెలుగువారి మనసుల్లో చిరస్మరణీయంగా ఉన్నాయన్నారు. శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు ప్రసంగిస్తూ శాస్త్రీయ సంగీతానికి త్యాగయ్య పితామహుడని, ఆయన మన జిల్లాకు చెందిన వారు కావటం అందరూ గర్వించదగిన విషయమన్నారు. అనంతరం విక్రమ్ శ్రీనివాసరావును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు మిడసల మల్లికార్జునరావు, నూకతోటి శరత్‌బాబు, కనమాల రాఘవులు, సింగంశెట్టి శివరామకృష్ణ, అనుముల మహేంద్ర కుమార్, బొమ్మరాజు భాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల నృత్య నీరాజనం


నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 30: ఒంగోలుకు చెందిన పలువురు చిన్నారులు షిర్డీ పుణ్యక్షేత్రంలో తమ నృత్య ప్రతిభను ప్రదర్శించి పలువురి ప్రశంసలందుకున్నారు. నగరానికి చెందిన శ్రీసాయి నాట్య కళాభారతికి చెందిన పలువురు చిన్నారులు షిర్డీ దేవస్థాన ఆడిటోరియంలో జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న సేవ్ ద కూచిపూడి కార్యక్రమంలో పాల్గొని పలు శాస్త్రీయ గీతాలకు చక్కని అభినయంతో కూడిన నృత్యాన్ని ప్రదర్శించి కరతాళధ్వనులందుకున్నారు. సరస్వతి రాయ్, ధనలక్ష్మి, షేక్ హిమాని, ఎస్.మౌనిక, స్పందన, నిత్యశ్రీ, భవ్య, దివ్య పవిత్ర, సాయి దివ్య, అమూల్య, అన్విక తదితరులు నృత్యప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు ఘంటసాల పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ ఒంగోలుకు చెందిన నృత్య శిక్షకురాలు సరస్వతి ఆధ్వర్యంలో చక్కటి శిక్షణ ఇచ్చారని కొనియాడారు. చిన్నారులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను బహూకరించారు.

చీమకుర్తి తొలి సీఐగా దుర్గాప్రసాద్


దుర్గాప్రసాద్

చీమకుర్తి, జనవరి30 : అప్‌గ్రేడేషన్ పొందిన తర్వాత చీమకుర్తి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా తొలి సీఐగా ఒ.దుర్గాప్రసాద్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం ఎస్‌బీ సీఐగా బాధ్యతలు నిర్వహిస్తూ చీమకుర్తికి బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఒంగోలు ఎంపీడీవో బదిలీ

ఒంగోలు(రూరల్), జనవరి30: ఒంగోలు ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న పి.అజితను వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్ర ఉన్నతాధికారులు మంగళవారం పీఎస్ నెల్లూరు జిల్లాకు బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఒంగోలు ఎంపీడీవోగా ఎవరిని నియమించలేదు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



బహుమతులను అందజేస్తున్న బేబీరాణి, హెచ్ఎం రామారావు

సంతనూతలపాడు, జనవరి 30: సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో వన్యప్రాణుల సంరక్షణ, జంతుహింస నిరోధకంపై పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బేబీరాణి మాట్లాడుతూ మానవులు ఏవిధంగా స్వేచ్ఛగా జీవిస్తున్నారో అదేవిధంగా పశువులు, పక్షులు జీవించాలన్నారు. పశువులను హింసిస్తే చట్టం ప్రకారం శిక్షలు పడతాయని తెలిపారు. వీధికుక్కలను సైతం హింసించరాదన్నారు. అనంతరం పశుసంరక్షణపై వ్యాసపరీక్షలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యులు ప్రతాప్‌రెడ్డి, హెచ్ఎం పి.రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడుగురు సీఐలకు స్థానచలనం

ఒంగోలు(క్రైం), జనవరి 30: గుంటూరు రేంజి పరిధిలో ఏడుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ జి.పాల్‌రాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లాలో నలుగురు, ఇతర జిల్లాలో ముగ్గురికి స్థాన చలనం కలిగింది. ప్రస్తుతం జిల్లా వీసీఆర్‌లో పనిచేస్తున్న ఒ.దుర్గాప్రసాద్ చీమకుర్తి ఎస్‌హెచ్‌వోగా, వీఆర్‌లో ఉన్న దాసరి వెంకటేశ్వరరావును కనిగిరి సర్కిల్‌కు బదిలీ చేశారు. గుంటూరు రేంజి వీఆర్‌లో ఉన్న కె.రాములనాయక్‌ను యర్రగొండపాలెం సర్కిల్‌కు బదిలీచేయగా అక్కడ ఉన్న కె.మారుతీకృష్ణను వీఆర్‌కు పంపించారు. ఇంకా రేంజి పరిధిలో ముగ్గురు ఇతర జిల్లాలో బదిలీలు చేశారు.

చర్చలకు పిలిచి బెదిరించటం తగదు!

సీఐటీయూ జిల్లా నాయకుడు కొండారెడ్డి ధ్వజం ● మంత్రి సురేష్‌ను కలిసి డిమాండ్లను వివరించిన సెర్ప్ జేఏసీ నేతలు



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సెర్ప్ ఉద్యోగులు

ఒంగోలు నగరం, జనవరి 30: తమ డిమాండ్ల పరిష్కారం కోసం గత ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్న సెర్ప్ ఉద్యోగులను ప్రభుత్వం చర్చల పేరుతో పిలిచి బెదిరించడం తగదని సీఐటీయూ జిల్లా నాయకుడు కొండారెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద జరుగుతున్న సెర్ప్ ఉద్యోగుల ధర్నా శిబిరంలో ఆయన ప్రసంగించారు. సెర్ప్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరటం కూడా ఈ ప్రభుత్వానికి నేరంగా కనిపిస్తున్నదని ఆరోపించారు. ఇచ్చిన హామీలను గుర్తు చేసి పరిష్కరించమని అడగటం కూడా తప్పుగా ప్రభుత్వం భావిస్తుందని చెప్పారు. ఏళ్ళతరబడి తక్కువ వేతనాలు తీసుకుంటూ రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్న సెర్ప్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ కోసం అడిగితే ప్రభుత్వం బెదిరింపులకు గురిచేస్తుందని మండిపడ్డారు. అన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోవటం లేదన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించమని కోరితే పేదరిక నిర్మూలనా సంస్థను మూసివేస్తామని, ఉద్యోగాలు ఊడిపోతాయని ప్రభుత్వం బెదిరించటం అన్యాయమన్నారు. సీఐటీయూ నాయకురాలు కల్పన మాట్లాడుతూ సెర్ప్ ఉద్యోగుల తరపున పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనేందుకు సీఐటీయూ సిద్ధంగా ఉందన్నారు. దేశంలోనే మన రాష్ట్రంలోనే పెద్ద ఎత్తున మహిళలకు రుణాలు అందజేస్తున్నారని, ఇందుకు సెర్ప్ ఉద్యోగుల కృషి కారణమన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ వేతనాలు తక్కువ ఇస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రికి జేఏసీ నాయకుల వినతి

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సెర్ప్ జేఏసీ నాయకులు మంగళవారం నగరంలో ఉన్న రాష్ట్ర పురపాలకపట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. అనంతరం జేఏసీ నాయకులు నారాయణ, గోపీనాథ్, కృష్ణ, కత్తి కళ్యాణ్, సుధాకర్, డేవిడ్, శ్రీకాంత్, వెంకట్రావు తదితరులు మంత్రినికి వినతిపత్రం అందజేశారు. సెర్ప్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఎంఎస్‌సీసీలకు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, పే స్కేలు, అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ సమ్మెకు దిగినట్లు మంత్రికి వివరించారు.

వైసీపీ అబద్ధపు హామీలపై అప్రమత్తం చేయాలి

● శ్రేణులు నిత్యం ప్రజల్లో ఉండాలి...
● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల


సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 30: వైసీపీ ప్రభుత్వం ప్రజల పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలు, అబద్ధపు హామీలను వివరించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ సూచించారు. మంగళవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో 48,49 డివిజన్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఎన్నికలు అతి సమీపంలో ఉన్నందున ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరు పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేయాలన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉండి, వైసీపీ అబద్ధపు ప్రచారాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలు తెలుగుదేశం పార్టీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తాను కూడా నియోజకవర్గంలో ప్రతి గ్రామం పర్యటిస్తానని తెలిపారు. ఒంగోలు నియోజకవర్గం అభివృద్ధి తెలుగుదేశం పార్టీ హయాంలోనే జరిగిందని, ఆ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అలాగే చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేయడమే అందరి లక్ష్యమన్నారు. సమావేశంలో ఆయా డివిజన్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త శిద్దా సుబ్బారావు మృతి

అంత్యక్రియల్లో పాల్గొన్న సోదరుడు శిద్దా రాఘవరావు


సుబ్బారావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న శిద్దా రాఘవరావు, సుబ్బారావు(ఫైల్)

చీమకుర్తి, జనవరి30 : మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సోదరుడు, చీమకుర్తి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శిద్దా సుబ్బారావు(82) సోమవారం అర్ధరాత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. శిద్దా సుబ్బారావు వాసవి గ్రానైట్స్ యజమాని. చీమకుర్తి పట్టణంలో ఆయన ప్రముఖ వ్యాపారవేత్తగా గుర్తింపు ఉంది. ఆయనకు ఇద్దరు కుమారులు శిద్దా సుధాకర్, హనుమంతరావులు వ్యాపారరంగంలో గుర్తింపు కలిగిఉన్నారు. మంగళవారం చీమకుర్తిలో సుబ్బారావు భౌతికకాయానికి అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. స్వగృహంలో ఉంచిన ఆయన భౌతికకాయానికి కుటుంబసభ్యులు, పలువురు గ్రానైట్ వ్యాపారులు, పట్టణానికి చెందిన వ్యాపారవేత్తలు, టీడీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన సోదరులు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా పాండురంగారావు, శిద్దా వెంకటకృష్ణారావు, శిద్దా నాగేశ్వరరావు, కుటుంబసభ్యులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, ఉన్నం సుబ్బారావు, కాట్రగడ్డ రమణయ్య, కందిమళ్ల గంగాధరరావులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

● 2 నుంచి పరీక్షలు ప్రారంభం
● ఆర్ఐవో సైమన్ విక్టర్

ఒంగోలు(విద్య), జనవరి 30: జిల్లాలో ఇంటర్మీడియట్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. ఒంగోలులోని ఏకేవీకే జూనియర్ కళాశాలలో మంగళవారం జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, సైన్స్ అధ్యాపకులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 2న ఉదయం పదిగంటల నుంచి 1 గంట వరకు నైతికత, మానవ విలువల పరీక్ష, 3న పర్యావరణ విద్యపై పరీక్ష ఉంటుందన్నారు. ఈ రెండు పరీక్షలను విద్యార్థులు తాము చదువుతున్న కళాశాలల్లోనే తప్పనిసరిగా రాయాల్సి ఉంటుందని, గతంలో విద్యార్థులు ఎవరైనా ఈ రెండు పరీక్షలకు గైర్హాజరైతే ఇప్పుడు రాయవచ్చని పేర్కొన్నారు. ఇంటర్ ఒకేషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 5నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 2,395 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,501 మంది హాజరవుతారని చెప్పారు.

11 నుంచి సైన్స్ ప్రాక్టికల్ పరీక్షలు

ఇంటర్ జనరల్ కోర్సుల్లో ఎంపీసీ, బైపీసీ చదువుతున్న సెకండియర్ విద్యార్థులకు ఫిబ్రవరి 11 నుంచి 20వరకు ప్రతిరోజు రెండు సెషన్లలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో తెలిపారు. 50మందికిపైగా సైన్స్ విద్యార్థులు ఉన్న కళాశాలల్లోనే పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారని, జిల్లాలో 93 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. 50మందిలోపు విద్యార్థులు ఉన్న కళాశాలల వారిని సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో సైన్స్ ప్రాక్టికల్ పరీక్షలకు మొత్తం 13,827మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు.

మార్చి 1 నుంచి థియరీ పరీక్షలు

ఇంటర్ జనరల్ విద్యార్థులకు మార్చి 1 నుంచి 20వరకు థియరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సైమన్‌విక్టర్ తెలిపారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని, 69 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు టాస్క్‌ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ప్రత్యేకాధికారిగా నియమితులైన ఇంటర్మీడియట్ అధికారి ఐ.శ్రీనివాసరావు, జిల్లా పరీక్షల కామన్ సభ్యులు కె.ఆంజనేయులు, కె.స్వరూపరాణి, జి.మనోహర్‌రెడ్డి పలు సూచనలు చేశారు.

గాంధీ చూపిన మార్గంలో అందరూ నడవాలి

● డీఆర్వో శ్రీలత


నివాళులర్పిస్తున్న అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 30 : జాతిపిత మహాత్మాగాంధీజీ చూపిన సత్యం, అహింస వంటి మార్గాల్లో ప్రతి ఒక్కరూ నడవాలని డీఆర్వో ఆర్.శ్రీలత అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఒంగోలు నగరం గాంధీరోడ్డులోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, సత్ప్రవర్తనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహసీల్దార్ మురళీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఒంగోలు(కల్చరల్): జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని మంగళవారం పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, సిబ్బంది, పాఠకులతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, కె.సంపూర్ణమ్మ, కె.కృష్ణవేణి, ఇమ్మా నుయేలు, పి.శ్రీనివాసులు, పి.పేరయ్య, నున్నా ఆంజనేయులు పాల్గొన్నారు.

స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లోను గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పలు ప్రజా సంఘాల నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు, భీమవరపు సుబ్బారావు, ఎస్ఏ.సలార్, తోరటి ఆనంద్, జి.రమేష్, సయ్యద్‌హనీఫ్, జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, గుంటనపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఒంగోలు కోఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ ఆవరణలోను గాంధీకి నివాళులర్పించారు.

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని ఆర్యవైశ్యమందిరం వద్ద, బస్టాండ్ వద్దనున్న పొట్టిశ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు వాసవీక్లబ్, మహిళాక్లబ్ ఆధ్వర్యంలో పూలమాలలతో నివాళులర్పించారు. సీపీఎం ఆధ్వర్యంలో బస్టాండ్ వద్దనున్న వారి విగ్రహాలకు నివాళులర్పించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 30 : ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వర్రె వెంకట్రావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు కర్ర దేవసహాయం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై ప్రభుత్వం నిరంకుశంగా ప్రవర్తిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారాబత్తిన జాలరామయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 5న విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్చూరి మాధవరావు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మద్దిరాల శరత్‌చంద్రబాబు, పాలేటి సువర్ణబాబు, జె.ప్రసాదరావు, ఏల్చూరి భాగ్యం, ఎద్దు రమేష్, పల్లె కృష్ణమూర్తి, కె.కొండలరాయుడు, చక్క కోటేశ్వరరావు, కృపాజయం, యాకోబు, నూకతోటి సుబ్బారావు, పల్లె తిరుపతిస్వామి, జీనవజ్యోతి, మిడసల కళ్యాణి, పాలేపోగు వెంకట్రావు, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

● టీడీపీ మండలాధ్యక్షుడు జయంత్‌బాబు

మద్దిపాడు, జనవరి 30: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో ఎన్నో అరాచకాలు జరుగుతున్నాయని, అలాంటి పాలనను ప్రజలు ఓటుతో సాగనంపాలని టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు కోరారు. మంగళవారం మద్దిపాడులోని టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయంత్‌బాబు మాట్లాడుతూ వైసీపీ నాయకులు భూదోపిడీలు, దౌర్జన్యాలతోపాటు ఇసుక, గ్రావెల్, మైనింగ్‌లో అక్రమాలకు పాల్పడుతూ ఉన్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ కార్యకర్తలు చంద్రబాబును సీఎం చేసే వరకు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఓట్ల వ్యవహారంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలతో మమేకమై సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో దేవబత్తిన ప్రసాద్, చింతల శ్రీనివాసరావు, మండవ గోపి, మురళి, పాటిబండ్ల అజయ్‌బాబు, రెబ్బవరపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

మద్దిపాడు, జనవరి 30: వెల్లంపల్లి శివారు పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో మంగళవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.17,348 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

24న పాటల పోటీలు

ఒంగోలు(కల్చరల్), జనవరి 30: రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన గాయకులతో ఒంగోలులో పాటల పోటీలు నిర్వహించనున్నట్లు సరిగమప స్వరాల పాటల పోటీల నిర్వాహకులు మర్రి కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 24వ తేదీ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో ఈ పోటీలు ఉంటాయన్నారు. 12 నుంచి 50 సంవత్సరాలలోపు వారు అర్హులని, అయితే ప్రొఫెషనల్ సింగర్స్‌కు మాత్రం ప్రవేశం లేదన్నారు. అదేవిధంగా ఒక సినిమా సోలో సాంగ్ కానీ, లలిత సంగీతం కానీ, అన్నమయ్య కీర్తన పాడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండవ బహుమతిగా రూ.8 వేలు, మూడవ బహుమతి రూ..5 వేలు, రూ.3 వేలు కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల గాయకులు ఫిబ్రవరి 22వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9603478178 సెల్ నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

3,4 తేదీల్లో రాష్ట్ర మహాసభలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 30 : అఖిల భారత రైతు-కూలీ సంఘం రాష్ట్ర పదో మహాసభలు వచ్చేనెల 3,4వ తేదీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా గురజాలలో జరుగుతాయని సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఒంగోలులోని సీపీఐ(న్యూడెమోక్రసి) కార్యాలయంలో మంగళవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, రైతు కూలీల హక్కుల కోసం పోరాడుతున్న సంఘం తమదేనని ఆయన తెలిపారు. ఈ మహాసభలకు రైతులు, రైతు కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చొప్పర జాలన్న, వి.రామ్మోహన్‌రెడ్డి, కోడూరి హనుమంతరావు, సుబ్బయ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

క్లినిక్స్‌ను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

● డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 30 : జిల్లాలోని క్లినికల్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు కింద వారం రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆన్ రిజిస్టర్ ఆస్పత్రుల క్లినికల్స్ కూడా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఆస్పత్రికానీ, ల్యాబ్స్, డయాగ్నోస్టిక్స్ సెంటర్స్ నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందువల్ల జిల్లాలోని క్లినిక్స్ తప్పనిసరిగా గడువులోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్పష్టం చేశారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 30: ఏపీసీటీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రచురించిన నూతన సంవత్సర డైరీని సెల్‌ట్యాక్స్ సర్కిల్-1 అధికారి దుంప ఝాన్సీ, సర్కిల్-2 అధికారి సోమసుందర ప్రసాద్ ఆవిష్కరించారు. ఒంగోలులోని సేల్స్ ట్యాక్స్ కార్యాలయంలో మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పి.మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డీసీటీవోలు సుబ్బారావు, ఏడుకొండలు, శ్రీనివాసరావు, సుధాకర్, ఏసీటీవోలు కొండలరావు, విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్లు కొప్పోలు సుధాకర్, సరోజిని, నరసింహారావు, దారా సుధాకర్‌రావు, పి.అంజయ్య, ప్రియాంక, తిమోతి, మణి, వనలత పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్యామిలీ ఫెస్ట్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 30: ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం ఫ్యామిలీ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ తల్లిదండ్రుల గొప్పతనం, వారిని గౌరవించడం మన సంప్రదాయమన్నారు. అనంతరం విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆర్.అనిల్, సమన్వయకర్త శ్రీనివాసరావు, డీన్ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏపీటీఎఫ్ ధర్నా

ఒంగోలు(విద్య), జనవరి 30: మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న స్థానిక ప్రకాశంభవన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జనార్దన్, డి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపల్ టీచర్ల సర్వీసు రూల్స్ వెంటనే అమలు చేయాలని, బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

నేటి నుంచి యూటీఎఫ్ రిలే దీక్షలు

ఒంగోలు(విద్య), జనవరి 30: ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు రిలే దీక్షలు చేపడుతున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓవీ.వీరారెడ్డి, డి.వీరాంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని రిలే నిరాహార దీక్షలకు విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : డీటీసీ

ఒంగోలు(క్రైం), జనవరి 30: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ (డీటీసీ) ఆర్.సుశీల పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక వెంగముక్కపాలెం రోడ్డులో గల రవాణాశాఖ కార్యాలయంలో రహదారి భద్రద మాసోత్సవాలలో భాగంగా బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ డ్రైవర్లు అందరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, 60 ఏళ్లు నిండిన వారు డ్రైవింగ్ చేసేందుకు అనర్హులని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా రహదారి నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆర్థిక సహాయం

ఒంగోలు(కల్చరల్), జనవరి 30 : నిరుపేద వృద్ధురాలికి సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. ఒంగోలు నగరం దత్తాత్రేయ కాలనీకి చెందిన మంగమ్మకు రూ.10,500లు నగదు, బియ్యం, కందిపప్పు వంటి నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్‌బాషా మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి నెలా ఆమెకు రూ.4 వేలు పింఛన్ సునీత అనే దాత సహకారంతో అందజేస్తామన్నారు. కార్యక్రమం లో మారెళ్ల సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొవిడ్‌తో మృతి చెందిన వైద్యులకు ఐఎంఏ నివాళి

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 30: కొవిడ్ మహమ్మారి సమయంలో వైద్య సేవలందిస్తూ మరణించిన పలువురు వైద్యులకు ఇండియన్‌మెడికల్ అసోసియేషన్ నివాళులర్పించింది. మంగళవారం ఒంగోలులోని ఐఎంఏ హాలులో కొవ్వొత్తులు వెలిగించి కొవిడ్ అమర వైద్యుల దినోత్సవం నిర్వహించారు. కొవిడ్ బారిన పడిన ఎందరో ప్రజల ప్రాణాలు కాపిడి, తమ ప్రాణాలను విడిచిన వైద్యుల సేవల స్ఫూర్తితో వైద్య రంగంలో ముందుకెళతామన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజేశ్వరరావు, విద్యాశంకర్, జయశేఖర్, వీరయ్యచౌదరి, జాలాది మణిబాబు, శ్రావణి, శీదేవి, కమలా, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

టోల్‌గేట్ వద్ద భారీగా పట్టుబడిన నగదు

రూ.కోటి వరకూ ఉంటుందని అంచనా

వివరాలు వెల్లడించని పోలీసులు

టంగుటూరు, జనవరి 30 : టంగుటూరు టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ సందర్భంగా పెద్దమొత్తంలో నగదు పట్టుబడింది. అయితే ఎంత మొత్తం అన్నది కానీ, వివరాలను కానీ పోలీసులు వెల్లడించలేదు. అందిన సమాచారం మేరకు.. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండంతో టంగుటూరు టోల్‌గేట్ వద్ద కొద్దిరోజుల నుంచి పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం చెన్నై నుంచి గుంటూరు వెళ్తున్న కారులో పెద్దమొత్తంలో నగదు దొరికినట్లు సమాచారం. సమాచారం తెలియగానే సింగరాయకొండ సీఐ రంగనాథ్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎస్సై అందుబాటులో లేకపోవడంతో ఆయన టోల్‌గేట్ వద్ద నుంచి నగదును పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. దాన్ని లెక్కించి వివరాలను పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఆమొత్తం సుమారు రూ.కోటి వరకూ ఉంటుందని తెలుస్తోంది. అయితే నగదు దొరికిన విషయం వాస్తమేనంటున్న పోలీసులు వివరాలను మాత్రం వెల్లడించలేదు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి చేయూత

విద్యుదాఘాతంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి సాయం

సింగరాయకొండ, జనవరి 30 : విద్యుదాఘాతంతో మృతి చెందిన పేద కార్యకర్త కుటుంబాన్ని టీడీపీ ఆదుకుంది. పార్టీ ప్రాథమిక సభ్యత్వం ఉండటంతో ఆయన కుటుంబానికి రూ.2లక్షలు అందించింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని బింగినపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మేడిద బాలకోటయ్య (42) ఐస్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఏడునెలల క్రితం విద్యుఘాతానికి గురై మృతి చెందాడు. దీంతో ఆయన భార్య, ముగ్గురు పిల్లలు, వయసు పైబడిన తల్లిదండ్రుల పరిస్థితి దయనీయంగా మారింది. స్థానిక టీడీపీ నాయకులు విషయాన్ని కొండపి శాసనసభ్యుడు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య దృష్టికి తీసుకెళ్లారు. మృతుడికి టీడీపీ సభ్యత్వం ఉండటంతో ఆవిషయాన్ని వెంటనే ఎమ్మెల్యే రాష్ట్రపార్టీ కార్యాలయానికి సమాచారం అందించారు. దీంతో మృతుడి భార్య బ్యాంకు ఖాతాకు టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి రూ.2లక్షల జమచేశారు.

పొగాకు రైతులు విధిగా టార్పాలిన్ పట్టలు వాడాలి



గ్రేడింగ్ చేసిన పొగాకును పరిశీలిస్తున్న అధికారులు, ఐటీసీ ప్రతినిధులు

టంగుటూరు, జనవరి 30 : పొగాకు రైతులు గ్రేడింగ్, ఇతర సమయాల్లో విధిగా టార్పాలిన్ పట్టలను వాడాలని స్థానిక వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు సూచించారు. పొగాకు రెలుపు, క్యూరింగ్, గ్రేడింగ్, టాపింగ్ తదితర అంశాలపై రైతులకు, బోర్డు సిబ్బందికి మంగళవారం మండలంలోని ఎం.నిడమలూరులో శిక్షణ ఏర్పాటు చేశారు. ముందుగా బోర్డు అధికారులు, ఐటీసీ శాస్త్రవేత్త డాక్టర్ వి.వెంకటేశ్వర్లు, ఐటీసీ ప్రతినిధి జి.వెంకట్రావు గ్రామంలోని పొగతోటలు, గ్రేడింగ్ పందిళ్లు, క్యూరింగ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు, శిక్షకులు మాట్లాడుతూ టార్పాలిన్ పట్టలు వాడడం వలన అన్యపదార్థాలు పొగాకులో కలసే అవకాశం ఉండదన్నారు. పూర్తిగా పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే తుంచి అల్లి బ్యారన్‌లో అమర్చాలన్నారు. పచ్చి ఆకులను ఎండ తగలకుండా జాగ్రత్తపరచాలన్నారు. పండినవి, పక్వానికి రాని వాటిని విడివిడిగా కర్రలకు అల్లుకోవాలని సూచించారు. సీనియర్ గ్రేడింగ్ అధికారి జి.సిద్దరాజు, పొగాకు బోర్డు క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

నేనున్నానని..

నేడు నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' పర్యటన

చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక ఆగిన గుండెలు

కె.ఉప్పలపాడులో అంజయ్య, టంగుటూరులో అరుణ్‌కుమార్ మృతి

నేడు వారి కుటుంబాలకు పరామర్శ, ఆర్థిక సాయం



టంగుటూరులో టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న దామచర్ల సత్య

కొండపి, జనవరి 30 : టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందిన వారి కుటుంబాలకు పార్టీ అండగా నిలుస్తోంది. వారిలో మనోధైర్యం నింపేందుకు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరుతో పర్యటనలు ప్రారంభించారు. అందులో భాగంగా మంగళవారం కె.ఉప్పలపాడు గ్రామానికి రానున్నారు. చంద్రబాబు అరెస్టుతో తీవ్రమనోవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందిన గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన జంగాల అంజయ్య (54) కుటుంబాన్ని ఆమె పరామర్శించనున్నారు. వారికి ఆర్థికసాయం అందించనున్నారు. ఈసందర్భంగా అంజయ్య భార్య అజంత 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. స్థానికంగా ఉన్న ప్రైవేటు స్కూల్‌లోనే కట్టుబడి, కూలి పనులు తన భర్త చేసేవాడని ఆమె తెలిపారు. చంద్రబాబు ఏతప్పూ చేయరని, ఆయన్ను జగన్ అక్రమంగా అరెస్ట్ చేయించి వేధిస్తున్నారని తనతో పదే పదే చెప్పేవారన్నారు. చంద్రబాబుకు బెయిల్ వస్తుందా? రాదా? అని రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ టీవీ చూస్తేనే ఉండేవారని చెప్పారు. గత ఏడాది సెప్టెంబరు 27వ తేదీ కూడా టీవీ చూస్తూ గుండెపోటుకు గురై మరణించాడని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. కాగా భువనేశ్వరి పరామర్శ కార్యక్రమం నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య మంగళవారం ఉదయం అంజయ్య భార్య అజంత, కొడుకు అన్వేష్‌కుమార్‌లతో మాట్లాడారు. భువనేశ్వరి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.



నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ముక్తినూతలపాడులో మృతుని కుటుంబ సభ్యుల పరామర్శకు వచ్చిన సందర్భంగా గ్రామస్థులకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి

టంగుటూరులో ఏర్పాట్లను పరిశీలించిన సత్య

టంగుటూరు : నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా భువనేశ్వరి బుధవారం టంగుటూరు రానున్నారు. ఆమె మధ్యాహ్నం 2.35గంటలకు ఇక్కడికి చేరుకుంటారు. చంద్రబాబు అరెస్ట్ సందర్భంగా తీవ్ర మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందిన పంచాయతీ పరిధిలోని రజకకాలనీకి చెందిన దుగ్గినేని అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. వారికి రూ.3లక్షల ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య మండలంలోని పార్టీ నేతలతో కలసి భువనేశ్వరి కార్యక్రమం ఉన్న ప్రాంతంలో మంగళవారం పర్యటించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, తెలుగు యువత మండల అధ్యక్షుడు అభిషేక్ తదితరులున్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా బుధవారం మధ్యాహ్నం 2.30గంటలకు టంగుటూరులోని శివాలయం వద్దకు చేరుకోవాలని పార్టీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్ కోరారు. ఎవ్వరూ నేరుగా బాధితుడి గృహం వద్దకు వెళ్లవద్దని సూచించారు.

మంత్రి కోసం పడిగాపులు

ఎండలోనే విద్యార్థినుల ఎదురుచూపులు

మూడున్నర గంటలు ఆలస్యంగా కార్యక్రమం

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



ఎండలో గంటల తరబడి నిల్చుని నీరసం వచ్చి చెట్టు నీడకు చేరుకున్న విద్యార్థినులు

కొండపి, జనవరి 30 : స్టడీ మెటీరియల్ పంపిణీ పేరుతో మంగళవారం కొండపిలో మంత్రి సురేష్ చేపట్టిన కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు నరకం చూశారు. 3.30 గంటలపాటు పడిగాపులు కాశారు. మూత్ర విసర్జనకు కూడా అవకాశం లేక అల్లాడిపోయారు. కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక కామేపల్లి రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం కావాల్సి ఉంది. దీంతో ఆ సమయానికి మూడు మండలాల నుంచి దాదాపు 900 మంది విద్యార్థులు, 40 మంది ఉపాధ్యాయులు, ఆరుగురు ఎంఈవోలు అక్కడికి చేరుకున్నారు. అయితే మధ్యాహ్నం 1.30 గంటల వరకూ మంత్రి రాలేదు. అప్పటి వరకూ ఆయన కోసం విద్యార్థులు ఎదురు చూడాల్సి వచ్చింది. మంత్రి సురేష్ రాగానే పూలు చల్లేందుకు కల్యాణమండపం ముఖద్వారం వద్ద దాదాపు 30మందిని ఎండలోనే నిల్చోబెట్టారు. వారు అర్ధగంటసేపు ఉండి ఎండ తీవ్రతకు తట్టుకోలేక పక్కకు వెళ్లిపోయారు. దీంతో మరో 30 మందిని తిరిగి ఎండలో ఉపాధ్యాయులు నిల్చోబెట్టారు. అలా 100 మందిని మార్చారు. ఎట్టకేలకు మధ్యాహ్నం 1.30 గంటలకు మంత్రి రావడంతో విద్యార్థినులు ఊపిరి పీల్చుకున్నారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మంత్రి సురేష్

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

స్టడీ మెటీరియల్ పంపిణీకి ముందు మాట్లాడిన మంత్రి సురేష్ పరీక్షలను ఒత్తిడి లేకుండా రాసి అత్యధిక మార్కులు సాధించాలని కోరారు. అదేవిధంగా విద్యారంగ అభివృద్ధికి కృషి చేసిన జగన్‌కు విద్యార్థులంతా తమ ఇళ్లలోని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు చెప్పి ఓట్లేయించాలని కోరారు. అనంతరం కొందరు విద్యార్థులకు ఆయన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మిగిలిన వారికి తర్వాత అందజేస్తారని చెప్పారు. కార్యక్రమానికి ముందుగా మహాత్మా గాంధీ, సరస్వతీదేవి చిత్ర పటాలకు నాయకులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో డీఈవో సుబ్బారావు, జడ్పీటీసీ సభ్యులు మారెడ్డి అరుణకుమారి, బెజవాడ వెంకటేశ్వర్లు, చినకండ్లగుంట సర్పంచ్ షేక్ వన్నూరు, వైసీపీ మండల అధ్యక్షుడు ఆరికట్ల కోట్లింగయ్య, జేఏసీ మండల కన్వీనర్ గొట్టిపాటి మురళి, వైసీపీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ మునీర్ బాషా, ఎస్సీసెల్ మండల నాయకుడు గర్నెపూడి రమేష్ పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత టీడీపీదే

ఎమ్మెల్యే స్వామి



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

మర్రిపూడి, జనవరి 30 : బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మర్రిపూడిలో మంగళవారం రాత్రి జరిగిన జయహో బీసీ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 35శాతం రిజర్వేషన్లు టీడీపీ కల్పిస్తే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 24శాతానికి తగ్గించి అన్యాయం చేసిందని విమర్శించారు. వైసీపీ పాలనలో 75మంది బీసీలను అంతమొందించారని, 2,540మందిపై అక్రమ కేసులు బనాయించి వేధించారని ఆరోపించారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించిన ఘనత వైసీపీకే దక్కిందని ధ్వజమెత్తారు. కొండపి నియోజకవర్గాన్ని స్థానికుడినైన తాను ఎనలేని అభివృద్ధి చేశానన్నారు. ఎర్రగొండపాలెంలో ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న మంత్రి సురేష్ కొండపికి వలసవచ్చి అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయించడంలో విఫలమైన ఆయన చెత్తమంత్రిగా నిలిచిపోయారని విమర్శించారు. తాను గత టీడీపీ హయాంలో కూచిపూడి నుంచి పొదిలి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.39కోట్లు మంజూరు చేయిస్తే పనులు పూర్తి చేయించలేని అసమర్థులు వైసీపీ నాయకులని మండిపడ్డారు. అంతకుముందు స్థానిక విద్యుత్ ఉపకేంద్రం నుంచి బస్టాండు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు నందిగం బ్రహ్మయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నరసింహారావు, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు నరసారెడ్డి, బీసీసెల్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, నాయకులు లకులు, బాబు, బాలనరసయ్య, మోహన్‌రావు, గురుబ్రహ్మయ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మైనింగ్ మాఫియా

- కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొట్టారు
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, జనవరి 30: ఐదేళ్లుగా రాష్ట్రంలో మైనింగ్ మాఫియాను నడుపుతూ కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొట్టిన ఏపీ స్టేట్ డీఎంజీ డి.వెంకటరెడ్డిపై కేసు నమోదు చేయాలని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు డిమాండు చేశారు. మంగళవారం ఉదయం మార్టూరులో తెలుగుదేశం పార్టీ నాయకుడు కామినేని జనార్దన్‌కు చెందిన అనంత గ్రానైట్ పరిశ్రమలో నెల్లూరు, కృష్ణాజిల్లా విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రానైట్ పరిశ్రమలో విజిలెన్స్ అధికారులతో మాట్లాడిన అనంతరం ఏలూరి సాంబశివరావు విలేకరులతో మాట్లాడారు. అధికారులను అడ్డం పెట్టుకొని, ప్రైవేటు వ్యక్తులతో గ్రానైట్ పరిశ్రమల యజమానులను ప్రత్యక్షంగా, పరోక్షంగా బెదిరించి మామూళ్లు వసూలు చేసిన డీఎంజీపై విచారణ చేపట్టాలన్నారు. మైనింగ్ విజిలెన్స్ అధికారులతో గ్రానైట్ పరిశ్రమలపై తనిఖీలు పేరుతో యజమానులను బ్లాక్ మెయిలింగ్ చేసి కోట్లాది రూపాయలు వసూలు చేశారని విమర్శించారు. మార్టూరు, బల్లికురవ, చీమకుర్తి, ప్రకాశం జిల్లాలో పేరుగాంచిన గ్రానైట్ పరిశ్రమను నిర్వీర్యం చేసి ఎంతోమందికి ఉపాధిని కల్పించిన గ్రానైట్ పరిశ్రమను అధికార పార్టీనాయకులు తమ స్వార్థానికి ఉపయోగించుకొని కోట్లాది రూపాయలు వసూలు చేశారన్నారు. మార్టూరు ప్రాంతంలో పందిళ్లపల్లికి చెందిన 50 మంది యువకులు రోజూ గ్రానైట్ వసూళ్ల చేపడుతున్నారని చెప్పారు. గ్రానైట్ పరిశ్రమను బతికించుకోకుంటే ఆ రంగం పూర్తిగా మూతపడుతుందన్నారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, అధికారులు వైసీపీ నేతలకు తలొగ్గి తప్పుడు పనులు చేస్తే తగిన గుణపాఠం చెప్పే సమయం త్వరలోనే ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి హెచ్చరించారు.

గ్రానైట్ ఫ్యాక్టరీలో విజిలెన్స్ తనిఖీలు



హరగాయత్రి గ్రానైట్ ఫ్యాక్టరీలో తనిఖీ చేస్తున్న అధికారులు

బల్లికురవ, జనవరి 30 : మండలంలోని వేమవరం వద్ద ఉన్న హరగాయత్రి గ్రానైట్ ఫ్యాక్టరీలో మంగళవారం మచిలీపట్నం నుంచి వచ్చిన మైనింగ్ విజిలెన్స్ ఏడీ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. టీడీపీకి చెందిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అనుచరుని గ్రానైట్ ఫ్యాక్టరీ అయినందున తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది. గ్రానైట్ ఫ్యాక్టరీలో స్టాకు నిల్వలు, కొలతలు తీశారు. తనిఖీలు ఎందుకు చేస్తున్నారన్న విషయం వెల్లడించేందుకు అధికారులు నిరాకరించటం అనుమానాలకు తావిస్తోంది. మరోమారు తనిఖీలకు వస్తామని చెప్పి అధికారులు వెనుదిరిగారు. విజిలెన్స్ అధికారుల తనిఖీలతో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులలో ఆందోళన నెలకొంది. టీడీపీ వర్గీయులను లక్ష్యంగా చేసుకుని విజిలెన్స్ అధికారుల చేత వైసీపీ నేతలు దాడులు చేయిస్తున్నారని పలువురు గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు ఆరోపిస్తున్నారు. అన్నింటినీ తనిఖీ చేయకుండా కేవలం టీడీపీ సానుభూతిపరుల ఫ్యాక్టరీలనే టార్గెట్‌గా దాడులు చేయటం వెనుక వేధింపులకు గురిచేయటమేనని పలువురు చెబుతున్నారు.

అనిల్ లేని లోటు పూడ్చలేనిది

పొందూరు (టంగుటూరు) జనవరి 30 : పొందూరు ఉపసర్పంచ్ కాట్రగడ్డ అనిల్ లేని లోటు టీడీపీకి పూడ్చలేనిదని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. అనిల్ ప్రథమ వర్థంతి ఆయన స్వగ్రామమైన పొందూరులో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సత్య మాట్లాడుతూ అనిల్ నిబద్ధత, నిజాయితీ కలిగిన నాయకుడన్నారు. గ్రామంలో పార్టీ పటిష్టతకు ఎంతగానో శ్రమించారన్నారు. ఆయన అకాల మరణం పార్టీ శ్రేణులను కలచివేసిందన్నారు. ముందుగా సత్యతోపాటు టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ గ్రామ అధ్యక్షుడు మేరువ ఆనంద్, సీనియర్ నాయకుడు కారుమంచి ప్రభాకర్ తదితరులు అనిల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సంతమాగులూరు, జనవరి 30: మండలంలోని ఏల్చూరు పంచాయతీ రామిరెడ్డిపాలెంలో అక్రమంగా విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మద్యం బాటిళ్లను సంతమాగులూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా రామిరెడ్డిపాలెంలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న అక్రమ మద్యంపై పోలీసులు నిఘా పెట్టారు. మంగళవారం తనిఖీలు నిర్వహించి 248 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

జమ్ములపాలెంలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న హరిబాబు, సురేందర్‌రెడ్డి

జమ్ములపాలెం(టంగుటూరు) జనవరి 30 : రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు మండలంలోని జమ్ములపాలెం జడ్పీ హైస్కూల్ ఆవరణలో మంగళవారం అట్టహాసంగా మొదలయ్యాయి. గ్రామానికి చెందిన బెజవాడ హరిబాబు, రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సురేందర్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఇంత చిన్న గ్రామంలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉన్నదన్నారు. భవిష్యత్‌లో జమ్ములపాలెంలో నిర్వహించే క్రీడలకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీడీ అశోక్, పలువురు క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

గాంధీకి నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొండపి, జనవరి 30 : మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక కామేపల్లి రోడ్డు కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆపార్టీ మండల కార్యదర్శి కేజీ మస్తాన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణే మహాత్మా గాంధీకి నిజమైన నివాళి అన్నారు. పెండ్యాల పాండురంగారావు, సిహెచ్.కృష్ణ, సీఐటీయూ నాయకులు గడ్డం వందనం, వై.కోటేశ్వరరావు, పూర్ణయ్య, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

గిరిజనులకు అన్నదానం

సింగరాయకొండ, జనవరి 30 : మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ తాతయ్యకాలనీలోని గిరిజనులకు మంగళవారం సింగరాయకొండకు చెందిన కేశవరపు శ్రీనివాసులరెడ్డి అమెరికాలో ఉంటున్న తన అల్లుడు ఉగ్గుమూడి జస్వంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదానం చేశారు. గిరిజన చిన్నారుల మధ్య కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవ సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు, లింగారెడ్డి సతీష్‌రెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

రైతు కూలీ సంఘం మహాసభలకు తరలిరండి

సింగరాయకొండ, జనవరి 30 : గుంటూరు జిల్లా గురజాలలో వచ్చేనెల 3,4 తేదీల్లో నిర్వహించే అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలకు రైతులు, కూలీలు భారీగా తరలిరావాలని సంఘ జిల్లా కార్యదర్శి ఎన్.నాగరాజు కోరారు. అనంతరం మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కోడూరి నాంచార్లు, నాయకులు జగన్నాథం, బ్రహ్మయ్య, కె.నాగయ్య పాల్గొన్నారు.

కుష్ఠుపై అవగాహన



అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

సింగరాయకొండ, జనవరి 30 : కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30 తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకూ మండలంలో అవగాహన కల్పిస్తామని తెలిపారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులు, వీపు, ఎదపై బొడిపెలు, కనుబొమ్మలు, రెప్పల వెంట్రుకల రాలిపోవడం, అరిచేతులు, కాళ్లలో స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పీహెచ్‌సీకి రావాలని సూచించారు. బహుళ ఔషధ చికిత్స ద్వారా వ్యాధిని నయం చేసుకోవచ్చని తెలిపారు. వైద్యులు దీరేంద్ర, శ్రీధర్, వంశీధర్, లీనా రేఫెల్, ఆరోగ్యపర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌అలీ, వెంకటేశ్వర్లు, సాంబశివరావు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రంలో బీసీల సంక్షేమం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి ● కొత్తూరులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పర్యటించిన ఎరిక్షన్‌బాబు



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి

కొమరోలు, జనవరి 30 : రాష్ట్రంలో బీసీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటిచర్ల గ్రామ పంచాయతీలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో జయహో బీసీ కార్యక్రమాన్ని గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో బడుగు, బలహీన, వెనుకపడ్డ వర్గాల ప్రజలు దోపిడీకి గురవుతున్నారన్నారు. వారిని అన్ని విధాలా ఆదుకున్న పార్టీ టీడీపీనే అన్నారు. నాడు టీడీపీ హయాంలో పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడితే నేడు జగన్‌రెడ్డి బీసీలపై దాడులు చేయడమేపనిగా పెట్టుకున్నారన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఆరచక పాలన చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలోగానీ, రాష్ట్రంలో గాని అభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడిని మరోసారి ముఖ్యమంత్రిగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బుడత మధుసుధన్‌యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, మార్తాల సుబ్బారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు బిజ్జాల తిరుమలరెడ్డి, సీనియర్ నాయకులు బిజ్జం వెంకట్రామిరెడ్డి, నాయకులు వై ఝాన్సీ మాజీ ఎంపీటీసీ సభ్యులు బోనేని జయలక్ష్మి, పందరబోయిన భూపాల్ యాదవ్, బాలరాజు, రామ్మోహన్, ఆవులయ్య, బాలకృష్ణ, బొమ్మిని శ్రీను, దూదేకుల రంతూ, బీసీ సాధికార జిల్లా నాయకులు అనపా వీరశేఖర్, మాజీ సర్పంచులు షేక్ హసిని, అబ్దుల్ ఖాదర్, పి గోపాలక్రిష్ణయ్య యాదవ్, నాయకులు, కార్యాకర్తలు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

పెద్ద దోర్నాల : టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిపై దాఖలు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో సుప్రీం కోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని కొత్తూరులో 'బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను కలిసి మాట్లాడారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తూనే వైసీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టిన ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ప్రధానంగా నిత్యావసర సరుకుల ధరలు, ఆర్టీసీ బస్సు చార్జీలు, గ్యాస్, విద్యుత్‌చార్జీలు తడిసి మోపెడయ్యాయన్నారు. గతంలో మేలు ఒనగూరే పథకాలకు మంగళం పలికిన తీరు వివరించారు. తిరిగి టీడీపీ అధికారంలోకి రాగానే వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు అందించడం, మార్కాపురం జిల్లాగా ప్రకటించడంతో పాటు రద్దయిన పథకాలను పునరుద్ధరిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున రెడ్డి, శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, చంటి, ఎలకపాటి చంచయ్య, బట్టు సుధాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, రఫీ, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల : టీడీపీ రూపొందించిన మేనిఫెస్టోను ప్రజలందరికీ తెలియజేసి విజయానికి తోడ్పడాలని టీడీపీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షులు షేక్ మాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో పోలింగ్ బూత్ స్థాయి, క్లస్టర్ల బాధ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. అందుకుగానూ ప్రతి కార్యకర్త సైనికునిలా పని చేయాలన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూపొందించిన మేనిఫెస్టో ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంతగా నష్టపోయిందీ చెప్పాలన్నారు. టీడీపీ, జనసేన సమన్వయంతో రాక్షసపాలనకు చరమగీతం పలకాలన్నారు. కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అందరినీ కలుపుకుని ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీని సాధించేందుకు కంకణబద్ధులై ఉండాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏర్వ మల్లికార్జునరెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు దొడ్డా శేషాద్రి, టీఎస్‌టీయూసీ ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య, మండల వాణిజ్య విభాగం అధ్యక్షులు దేసు నాగేంద్రబాబు, ఎస్సీసెల్ జిల్లా నాయకులు చంటి, సీనియర్ నాయకులు బట్టు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

టెన్నిస్‌లో క్రీడాకారుల ప్రతిభ



ప్రతిభ చూపిన క్రీడాకారులతో టెన్నిస్ క్లబ్ ప్రతినిధులు

గిద్దలూరు, జనవరి 30 : రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో యూత్ స్పోర్ట్స్ రిక్రియేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడలో రాష్ట్రస్థాయి టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. వివిధ జిల్లాలకు చెందిన 1073 మంది టెన్నిస్ క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. 50 మంది ఉత్తమ ప్రతిభ కనపరిచారు. ఈ 50 మందిలో గిద్దలూరుకు చెందిన ఏడుగురు క్రీడాకారులు ఉన్నారు. వీరిలో భావనదేవి, కౌసర్, యశోదదేవి, చంద్రమౌళి, నాగ్, సాహెల్, కుర్షీద్ ఉన్నారు. రాష్ట్రస్థాయిలో గిద్దలూరు ప్రాంతానికి చెందిన ఏడుగురు క్రీడాకారులు ప్రతిభ కనపరచడంతో వీరిని స్థానిక టెన్నిస్ స్టేడియంలో లాన్‌టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జి.కె.మోహన్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రంగారెడ్డి, క్లబ్ కోశాధికారి త్రిమూర్తిరెడ్డి, విశ్వభారతి పాఠశాల కరస్పాండెంట్ రంగస్వామిరెడ్డి తదితరులు అభినందించి సన్మానించారు. ఈ బాలబాలికలకు నిత్యం శిక్షణ ఇస్తున్న చేరెడ్డి మురళిమోహన్‌రెడ్డిని అభినందించి సన్మానించారు.

గాంధీజీ సిద్ధాంతాలను పాటించాలి



రేకుల షెడ్‌ను ప్రారంభిస్తున్న శ్రీకాంత్

రాచర్ల, జనవరి 30 : మహాత్మగాంధీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందని వాసవిక్లబ్ రీజనల్ మాజీ చైర్మన్ ఎం.శ్రీకాంత్ అన్నారు. మండలంలోని ఆకవీడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని మహాత్మ గాంధీ, పొట్టిశ్రీరాములు విగ్రహాలకు రేకుల షెడ్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రరెడ్డి మాట్లాడుతూ వాసవిక్లబ్ నుంచి పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్నారని, విద్యార్థులు కూడా సేవా భావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటలతో ఆరోగ్యం



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 30: విద్యార్థులకు ఆటలతో ఆరోగ్యం సమకూరుతుందని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడా ప్రాధికారసంస్థ ఆధ్వర్యంలో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో నిర్వహించిన పలు పోటీలలో నియోజకవర్గ స్థాయిలో గెలిచిన విజేతలకు మంగళవారం ఎమ్మెల్యే బహుమతులు అందించారు. కార్యక్రమంలో చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు ఇస్మాయిల్, అంజమ్మ, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, డీఈ సుభానీ, మేనేజర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక



ఖాదర్ వలి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 30: స్థానిక నేతాజీ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన దూదేకుల ఖాదర్‌వలి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ సలహాదారు కాశీరెడ్డి మాట్లాడుతూ ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ విడుదల చేసిన మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఫేజ్-2 ఫలితాలలో ఖాదర్ వలి ఎంపికయ్యాడన్నారు.

కుష్ఠువ్యాధిని తరిమి కొడదాం



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

కొనకనమిట్ల, జనవరి 30 : కుష్ఠువ్యాధిని తరిమి కొడదామని గొట్లగట్టు వైద్యాధికారి పృధ్విరాజ్ అన్నారు. మండలంలోని నారికట్ల గ్రామంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు ఎవరికైనా చర్మం పై మచ్చలు ఏర్పడిన, చర్మం స్పర్శ కోల్పోయినా వెంటనే దగ్గరలోని వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. అనంతరం సిబ్బంది గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో నారాయణరెడ్డి, సిహెచ్‌వో, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, అంగన్‌వాడి సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

ఎర్రగొండపాలెం, జనవరి 30 : ఎర్రగొండపాలెం ఏరియా గ్రామీణ వైద్యుల సంఘం ఎన్నిక మంగళవారం ఏకగ్రీవమైంది. గౌరవాధ్యక్షులుగా షేక్ వలిసాహెబ్, అధ్యక్షులు పల్లెపోగు జాషువా, ప్రధానకార్యదర్శిగా, వి.మల్లికార్జునరావు, కోశాధికారిగా పఠాన్ ఇస్మాయిల్ ఖాన్, ఉపాధ్యక్షులు కే.చిన్నబాబు, ఎం.వెంకటేశ్వర్లు, ఈర్లకోటి, సహాయ కార్యదర్శులుగా బి.కాటంరాజు, గురవయ్య బాలకోటి, సహ కోశాధికారిగా ఎస్.వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా టి సత్యనారాయణ, మరికొందరు కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు.

అనారోగ్యంతో విద్యుత్ లైన్‌మెన్ మృతి



కొమరోలు, జనవరి 30: మండలంలోని కొమరోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రూరల్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న గుడిపాటి శిఖామణి మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. గతంలో ఆదే రూరల్‌లో విద్యుత్ ప్రమాదానికి గురయ్యారు. దీంతో కొన్ని రోజులు అనారోగ్యం పాలయ్యాడు. మృతి చెందిన శిఖామణిని మండల విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది వారి కుటుంబానికి ప్రగాఢసానుభూతిని తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత

పొదిలి, డిసెంబరు 30 : తెలంగాణ నుంచి తరలిస్తున్న మద్యం సీసాలను ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం పట్టుకున్నారు. జిల్లా జాయింట్ డైరెక్టర్ కె నాగేశ్వరరావు, స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆదేశాల మేరకు జిల్లా సూపరిండెంట్ స్పెషల్ బ్యూరో సుధీర్‌బాబు పర్యవేక్షణలో పొదిలి ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. విషయం తెలుసుకొని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. హైదరాబాద్ నుండి వస్తున్న ఆర్టీసీ, ప్రైవేట్ ట్రావెల్స్‌ను తనిఖీ చేయగా వివిధరకాల ఆరు ఫుల్‌బాటిళ్ళు దొరికినట్లు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఇద్దరు వ్యక్తుల నుండి మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ హనీమ్, కానిస్టేబుల్ చలపతి, వెంకట్రావు, కోటేశ్వరరావు, గురవయ్య, పున్నమ్మలు పాల్గొన్నారు.

డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 30: వాహనాల డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రవాణా శాఖాధికారి అమర్‌నాయక్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం రవాణా శాఖాధికారి కార్యాలయంలో ఆటో డ్రైవర్లు ప్రైవేట్ పాఠశాలల బస్సుల డ్రైవర్లకు శిక్షణ, వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్, ప్రసాద్‌లు డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేశారు. పలు రహదారి జాగ్రత్తలు వివరించారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఎంవీఐ అధికారి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై నిఘా ఉండాలి

● టీడీపీ బూత్ ఇన్‌చార్జుల శిక్షణ కార్యక్రమం



సమావేశంలో పాల్గొన్న బూత్ ఇన్‌చార్జులు

ఎర్రగొండపాలెం, జనవరి 30 : ఎన్నికలు జరిగే సమయం దగ్గర పడుతున్నందున గ్రామాల్లో టీడీపీ తరఫున నియమితులైన బూత్ ఇన్‌చార్జులు ఓటర్ల జాబితాపై నిఘా ఉంచాలని, ఇంటిగ్రేటెడ్ ట్రైనర్లు రామయ్య అన్నారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన బూత్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్ల ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితాలో మనం చేర్పించిన ఓటర్లు నమోదు అయ్యింది లేనిది పరిశీలించుకోవాలన్నారు. కొత్త ఓటర్లు ఏమైనా చేర్చారా..? మన గ్రామం వారేనా..?, ఇతరులను చేర్చారా అనే పరిశీలించుకోవాలన్నారు.. వీటితో బాబు ష్యూరిటి భవిష్యత్‌కు టీడీపీ గ్యారెంటీ కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేయాలన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించాలని కోరారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు చైతన్యవంతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ ట్రైనర్ నాగరాజు, టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాదు, టీడీపీ మండల నాయకులు, క్లస్టర్ కన్వీనర్లు, బూత్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇంచార్జులకు శిక్షణ

త్రిపురాంతకం, జనవరి 30: టీడీపీ ఆధ్వర్యంలో మండలంలోని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక వాసవీ అన్నసత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ.. ఆయా ఇన్‌చార్జులు ఓటర్ల వెరిఫికేషన్‌తోపాటు పార్టీ కార్యక్రమాలను నిరంతరం ప్రజలకు చేరువ చేయాలన్నారు.

నిర్వాసితులకు నష్టపరిహారం అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న వెంకట్రామిరెడ్డి

మార్కాపురం రూరల్ జనవరి 30: వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని కాంగ్రెస్ పార్టీ రైతు సంఘం డివిజన్ నాయకులు గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో 10 రోజుల్లో ముఖ్యమంత్రి ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేస్తున్నారంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో నిర్వాసితులకు అన్యాయం చేయకుండా ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బొగ్గు రామిరెడ్డి పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలకు కుర్చీలు బహూకరణ

దొనకొండ, జనవరి 30 : మండలంలోని తెల్లబాడు జడ్పీ ఉన్నత పాఠశాల కు దొనకొండకు చెందిన ఎంఎం గోల్డ్‌షాప్ అధినేత మాడిశెట్టి రమేష్ 25 ఎస్‌మార్క్ కుర్చీలను మంగళవారం బహూకరించారు. పాఠశాలలో ఉపాధ్యాయులకు, ఆఫీస్ అవసరాల నిమిత్తం కుర్చీలను అందించినట్లు దాత రమేష్ తెలిపారు. దాత రమేష్‌కు హెచ్ఎం ఎం.నీతమ్మ కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

జగనన్న.. కాలనీల దుస్థితి చూడు

వర్షాలు తగ్గినా నేటికీ తటాకంలా కాలనీ



కాలనీలో నిలిచిన నీరు



అధ్వానంగా ఉన్న వీధి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 30: ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన జగనన్న కాలనీలలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. పట్టణంలోని నాగులవరం రోడ్డులోని జగనన్న గృహాలు నిర్మించుకునేందుకు 481 మందికి పట్టాలు ఇచ్చారు. కానీ రోడ్లు, కాలువలు నిర్మించలేదు. గతంలో కురిసిన వర్షాలకు తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు అత్యంత అధ్వానంగా మారింది. వీటిలో నడవాలన్నా, వాహ నాలు రావాలన్నా, నరకప్రాయంగా మారింది. ఈ కాలనీకి కేటాయించిన భూమి చౌడు నేల కావడంతో, చినుకు పడితే చాలు కాలనీ చెరువులా మారిపోతోంది. నెల క్రితం కురిసిన వర్షాలకు నేటి వరకు పునాదుల్లో నీరు నిలిచి ఉందంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటువంటి పరిస్థితుల్లో లబ్దిదారులు గృహాలు నిర్మించుకో వటానికి వెనకడుగు వేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లు, కాలువలు నిర్మించాల్సి ఉంది.

అవాస్తవాలను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు

ఓ పత్రికలో కథనంపై టీడీపీ నేతల ఖండన



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 30: మార్కాపురం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే టికెట్ వ్యవహారంపై ఓ నీలి పత్రికలో వచ్చిన అవాస్తవాలపై ప్రజలు అసహించు కుంటున్నారని టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఒక అధికార పార్టీ పత్రికలో 'కందుల ఇంట టికెట్ల మంట' అంటూ అవాస్తవాలు ప్రచురించారన్నారు. అన్నదమ్ముల మధ్య, మిత్రపక్షమైన జనసేన మధ్య చిచ్చులు పెట్టేందుకు చుస్తున్నారన్నారు. ఉచితంగా పంచుకునే ఈ పత్రిక దిగజారుడు తనానికి ఇదే నిదర్శనమన్నారు. అన్నదమ్ముల మధ్య విభేదాలు సృష్టించే దుష్ట పన్నాగాలు మానుకోవాలన్నారు. ప్రజలే వీరికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఎప్పటికీ తమ నాయకుడు కందుల నారాయణరెడ్డే అని అన్నారు. ఆయన మార్కాపురం నుంచే పోటీ చేస్తారని తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు రానున్న ఎన్నికలలో అభ్యర్థిగా ప్రకటిస్తారన్నారు. మార్కాపురం జిల్లా రావాలన్నా, అభివృద్ధి సాధించాలన్నా టీడీపీతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో సైకో పాలనకు స్వస్తి చెప్పి సైకిల్‌కు పట్టం కట్టాలన్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేశారని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందన్నారు. దీనికి తోడు స్థానిక ఎమ్మెల్యే 'థ్యాంక్స్ సీఎం సార్' అని చెప్ప డం హాస్యాస్పదం అన్నారు. అఖిలపక్షాన్ని తీసుకెళ్లి వెలిగొండ ప్రాజెక్టు సందర్శిద్దామన్నారు. వెలిగొండ పూర్తయితే వైసీపీ వారిని సన్మానిస్తామన్నారు. లేదంటే ఇక్కడ ఉన్న వైసీపీ ఎమ్మె ల్యేలు పశ్చిమ ప్రకాశంలోని 7, 8 నియోజక వర్గాల్లో నామినేషన్ వేయరాదన్నారు. గతంలో వీరంతా వెలిగొండ పూర్తి చేసే ఎన్నికలలో నిలబడతామని చెప్పారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు తాళ్లపల్లి సత్యనారాయణ, కనిగిరి బాలవెంకటరమణ, షేక్ మౌలాలి, కొప్పు ల శ్రీనివాసులు, మొఘల్ షాకీర్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు రైల్వే సామగ్రి దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

రాచర్ల, జనవరి 30 : రైల్వే సామగ్రిని అక్రమంగా అమ్ముకుంటున్న ముఠాను ఎట్టకేలకు రైల్వే పోలీసులు పట్టుకున్నారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. రాచర్ల మండలంలోని సోమి దేవిపల్లి, యడవల్లి రైల్వేస్టేషన్ల పరిధితోపాటు అంబవరం రైల్వే బ్రిడ్జి వద్ద రైల్వేట్రాక్ పక్కన ఉన్న సామాన్లను కొన్ని నెలలుగా ఒక ముఠా దొంగిలించి అమ్ముకుంటోంది. ఇటీవల రైల్వే డబ్లింగ్ పనుల కారణంగా రైల్వేట్రాక్ ఇరువైపుల భారీ ఎత్తున రైల్వే సామాన్లను పనుల కోసం తరలించారు. ఇదే అదునుగా భావించి గిద్దలూరుకు చెందిన కొంగలవీడు వెళ్లే రహదారి పక్కన ఉన్న 9 మంది ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో మహిళలు కూడా ఉన్నారు. అర్ధరాత్రి సమయంలో ఆటో తీసుకుని వీరంతా రైల్వేట్రాక్‌ల వద్దకు వెళ్లేవారు. రైల్వే విద్యుత్ తీగలు, కప్లింగ్‌లు, ఇనుప సామాన్లను దొంగిలించి గిద్దలూరులోని ఒక ఇనుపసామాను కొట్టులో అమ్మేవారు. ఇనుము దుకాణం యజమాని కూడా వీరికి పూర్తిగా సహకరిస్తుండడంతో వ్యాపారం గత రెండు నెలలుగా బాగానే కొనసాగుతోంది. రైల్వే సామాగ్రి తక్కువగా కనపడుతుండడంతో రైల్వేశాఖ అధికారులు గుంటూరు క్రైం బ్రాంచి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుంటూరు ఆర్‌పీఎఫ్ క్రైమ్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ షేక్‌ఖాదర్‌భాషా ఆధ్వర్యంలో ఒక టీంను ఏర్పాటు చేసి వారం రోజులపాటు గిద్దలూరులోనే ఉండి రైల్వే సామాగ్రి చోరీపై ఆరా తీశారు. దీంతో 9 మంది దొంగలను, ఇనుప షాపు ఓనర్‌ను పట్టుకొని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చోరీ విషయం బయటపెట్టారు. వారి వద్ద నుంచి సామాగ్రిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రైల్వేశాఖ అధికారులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ అసలు సూత్రదారి రఫీ

రాత్రిపూట ట్రాక్టర్లతో, ఆటోలతో రైల్వే ట్రాక్ పక్కన ఉన్న సామాగ్రిని దోచుకోవడంలో షేక్ రఫీ పాత్ర కొన్ని సంవత్సరాలుగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం పాలకవీడు పంచాయతీ పరిధిలోని అనుమలవీడు గ్రామానికి చెందిన షేక్ రఫీ ఇనుప కొట్టు సామాగ్రిని పెట్టుకొని అమ్మకాలు చేస్తుంటాడు. గతంలో కూడా రఫీని రైల్వే పోలీసులు రైల్వేసామాగ్రి చోరీపై రెండు పర్యాయాలు కేసులు నమోదు చేశారు. గతంలో సోమిదేవిపల్లి, యడవల్లి, జే.క్రిష్టాపురం గ్రామాలలో రైల్వేస్టేషన్ నిర్మాణ పనులలో భాగంగా రైల్వేట్రాక్ పనులు జరిగాయి. వాటి కోసం రైల్వేశాఖ అధికారులు పెద్దఎత్తున ఇనుప సామాగ్రిని తరలించారు. రఫీ టన్నుల కొద్ది రైల్వే సామాన్లు దొంగిలించి సొమ్ము చేసుకున్నాడు. గతంలో పోలీసు సిబ్బంది రఫీకి సహకరించడంతో రైల్వే స్మగ్లర్‌గా మారాడు. దాని తరువాత పెద్దఎత్తున అమ్మకాలు కూడా చేశాడు. ఇటీవల గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ పనులు రఫీకి కలిసివచ్చింది. దీంతో మళ్లీ రైల్వేసామాన్లను దొంగిలించడం, దొంగిలించిన వారికి సహకరించడంతో మరోసారి రఫీ పేరు బయటకు వచ్చింది. దీనితో రైల్వే పోలీసులు రఫీపై దృష్టి సారించారు. మంగళవారం రఫీని అదుపులోకి తీసుకుని విచారించడంతో అక్రమ రవాణా బయటపడింది.

జాతిపితకు ఘన నివాళి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 30: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోని మహాత్ముని విగ్రహానికి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, చైర్మన్ బాలమురళీకృష్ణలు నివాళ్లు అర్పించారు. వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. కమలా, సాయి బాలాజీ, వాసవీ పాఠశాలలు, బీసీ భవన్‌లో మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. జార్జ్, కిట్స్, ఏ1 గ్లోబల్, వీహెచ్‌ఆర్ విద్యాసంస్థల్లో మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. మహాత్ముడికి నివాళులు అర్పించారు.

గిద్దలూరు : జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి వివిధ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశానికి స్వాతంత్రం తెచ్చేందుకు అహింసవాదంతో గాంధీజీ బ్రిటీష్ పాలకులను వారి దేశానికి పంపించిన వైనం గురించి పలువురు వివరించారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షులు రాములు, వాసవి క్లబ్ ప్రతినిధులు బాదం వెంకటేశ్వర్లు, సూరె చెంచయ్య రమణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు వాడకట్టు లక్ష్మీనారాయణ, రాచపూటి నరసింహారావు, సూరెవంశావలి అధ్యక్షులు సూరె నాగేశ్వరరావు, గౌరవ సలహాదారులు సూరె సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు సూరెవంశావలి సభ్యులు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. బీజేపీ జిల్లా అధి కార ప్రతినిధి డాక్టర్ జె.వి.నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, పట్టణశాఖ అధ్యక్షులు ఉదయ్‌శంకర్, తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు.



గిద్దలూరులో నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

త్రిపురాంతకం : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం వద్ద మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాము లు విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్ ప్రతినిధులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమాలలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు చీతిరాల హనుమంతరావు, గుండా సుబ్బారావు, కాసుల ప్రసాద్, గ్రందిశిల సునీల్, సుబ్రహ్మణ్యం, పూర్ణనాగేశ్వరరావు, హనుమంతరావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.





మార్కాపురంలో నివాళి అర్పిస్తున్న నాగార్జునరెడ్డి, త్రిపురాంతకంలో నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

కంభం : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని సందర్భంగా కంభం ఆర్యవైశ్య ప్రముఖులు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గాంధీ స్వాతంత్రం కోసం అహింస అనే ఆయుధంతో బ్రిటీష్ వారితో పోరాడారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షులు నాదెళ్ళ శ్రీనివాసులు, బీజేపీ నాయకులు బాదం మనోహర్, రావూరి రంగరమేష్, తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : జాతిపిత మహాత్మాగాంధీజీ వర్ధంతిని సీఐటీయూ, మానవతా స్వచ్ఛందసేవ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన వర్ధంతి సందర్భంగా అమ్మవారిశాల, పాత పంచాయతీ కార్యాలయం వద్దఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. దేశంలో హిందూ, ముస్లీం, క్రిస్టియన్ అనే తారతమ్యం లేకుండా సోదరభావాన్ని పెంపొందించడమే గాంధీజీని నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛందసేవ సంస సభ్యులు, సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

క్లాప్ మిత్ర కార్మికుల ధర్నా

దర్శి, జనవరి 30 : పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ క్లాప్ మిత్ర పారిశుధ్య కార్మికులు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి టీ రంగారావు మాట్లాడుతూ 10 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలైన కార్మికుల జీతాలు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పాలకులు నిర్లక్షవైఖరి అవలంబిస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఎంపీడీవో హనుమంతరావు, ఈవోఆర్డీ గుత్తా శోభన్‌బాబుకు వినతిపత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, సీహెచ్.బాలయ్య, ఆలూరి ఇజ్రాయేలు, సీహెచ్ గంగయ్య, తిరుపతమ్మ, వెంటస్వామి, ప్రసాదు, కె బాబూరావు, మంగమ్మ, కోటమ్మ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు జగన్‌కు చెంపపెట్టు

మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 30 : అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్‌ఆర్) కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు సీఎం జగన్‌రెడ్డికి చెంపపెట్టు లాంటిదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ చంద్రబాబుపై అక్రమంగా జగన్‌రెడ్డి పెట్టిన తప్పుడు కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో సుప్రీం కోర్టులో జగన్‌కు ఎదురు దెబ్బ తగిలిందన్నారు. చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని వైసీపీ ప్రభుత్వం వేసిన పిటీషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేయడంపట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అధినేత చంద్రబాబును కావాలనే ఇబ్బంది పెట్టాలని చూస్తున్న జగన్‌కు ప్రతి విషయంలోనూ కోర్టులు మొట్టికాయలు పెడుతున్నా జగన్ వైఖరిలో ఎలాంటి మార్పు రాకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వానికి దిగిపోయే రోజులు దగ్గర పడ్డాయన్నారు. జగన్ ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర ప్రజలు చంద్రబాబు వైపే ఉన్నారన్నారు. రోజు రోజుకు ప్రజాదరణ పెరిగి, వైసీపీ అసమర్థ పాలనతో విసుగెత్తిన ప్రజానీకంతో పాటు వైసీపీకి చెందిన కుటుంబాలు, నాయకులు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారన్నారు. అందుకు కనిగిరి నియోజకవర్గంలో గత 10 రోజులుగా విపరీతంగా వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారన్నారు. వైసీపీపై అసంతృప్తితో బడా వైపీపీ నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పార్టీని వీడుతున్నా జగన్‌కు గానీ, వైసీపీలో ఇంకా కొనసాగుతున్న ఆయా నాయకులకు గానీ పశ్చాత్తాపం లేకుండా పోతుందని ఎద్దేవా చేశారు. జగన్ తన ఆధిపత్యాన్ని కాపాడుకోవటానికి ఎమ్మెల్యేల ను, ఎమ్మెల్సీలను, మంత్రులను పావులుగా వాడుకుంటున్నారని విమర్శించారు. పార్టీపైనా, వైసీపీ నాయకులు, ఎమ్మెల్యేలపైనా ప్రజల్లో వ్యతిరేకత ఉందన్న కారణంగా వారికి సీటు నుంచి మరో సీటుకు మార్చుతూ వారికి మానసిక క్షోభకు గురి చేస్తున్నారన్నారు. తనకు కేటాయించిన తిరుపతి పార్లమెంట్‌ను సత్యవేడు ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే కోనేటీ ఆదిమూలం తిరస్కరించారని ఉగ్ర పేర్కొన్నారు. నరసరావుపేట వైసీపీ ఎంపీ లావు కృష్ణదేవరాయలు లోక్‌సభకు, వైసీపీకి రాజీనామా చేసినట్లు ఉగ్ర చెప్పారు. ఇంకో పక్క మంగళగిరి నుంచి ఆళ్ల రామకృష్ణారెడ్డి రాజీనామా చేశరన్నారు. గడచేకొద్దీ తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ ఒక్కడే ఉంటారని ఎద్దేవా చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్ పథకాల అమలుతో పాటు కనిగిరికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి అమలు చేసేందుకు చంద్రబాబు పూర్తిగా భరోసా ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. తనను వచ్చే ఎన్నికల్లో కనిగిరి ప్రాంత ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే కనిగిరికి రావాల్సిన నిధులు, అభివృద్ధి ఫలాలు సాధించుకు వస్తానన్నారు. ఈ సమావేశంలో టీడీపీ కనిగిరి క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, టీడీపీ మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లుయాదవ్, సానికొమ్ము తిరుపతిరెడ్డి, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, వేమూరి రామయ్య, పువ్వాడి వెంకటేశ్వర్లు, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, భేరి పుల్లారెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, కొండా కృష్ణారెడ్డి, సైకం మాల కొండారెడ్డి, సిద్దాటపు వెంకటరెడ్డి, గారపాటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర

నేడు భువనేశ్వరి పరామర్శ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న బ్రహ్మంచౌదరి

తాళ్లూరు, జనవరి 30 : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నేడు మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ గుంటిగంగ వృద్ధాశ్రమంలో టీడీపీ కార్యకర్త కుటుంబానికి భరోసా ఇచ్చేందుకు వస్తున్నారు. 'నిజంగెలవాలి యాత్ర' కార్యక్రమ ఏర్పాట్లను దర్శి నియోజవర్గ టీడీపీ పరిశీలకుడు నాదెండ్ల బ్రహ్మం చౌదరి, టీడీపీ నాయకులు మంగళవారం పరిశీలించారు. మార్కాపురం గ్రామానికి చెందిన టీడీపీ వీరాభిమాని జంపాల నరసింహారావు చంద్రబాబు అరెస్టుతో కలత చెంది మృతి చెందారు. అతనికి సం తానం లేదు. ఆయన భార్య ప్రసన్నలక్ష్మి ఒంటరిగా ఉండలేక గుంటిగంగ ఆవ రణలోని తేజ వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. ప్రసన్నలక్ష్మికి భరోసా ఇచ్చేందుకు భువనేశ్వరి బుధవారం రానున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, దర్శి, ముండ్లమూరు మండలాల టీడీపీ అధ్యక్షులు సీహెచ్.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శులు శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, వల్లభనేని సుబ్బయ్య, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, ముస్లిం మైనారిటీ కార్యదర్శి షేక్ కాలేషావలి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు రాచకొండ వెంకట్రావు, కైపు నాగార్జునరెడ్డి, టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షులు రామలక్ష్మయ్య, పుట్టా నరసింహారావు, నుసుం ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

సింగనపాలెంకు రాక..

ముండ్లమూరు : మండలంలోని సింగనపాలెంకు బుధవారం ఉదయం 11 గంటలకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి వస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనస్తాపానికి గురై బత్తిన హనుమంతరావు మృతి చెందారు. ఆ కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించేందుకు వస్తున్నట్లు తెలిపా రు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ వెంకాయమ్మ

మరోసారి సేవ చేసే అవకాశం కల్పించండి

జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ముండ్లమూరు, జనవరి 30 : దర్శి నియోజకవర్గంలో మరోసారి బూచేపల్లి కుటుంబం నుంచి నా బిడ్డ శివ ప్రసాద్‌రెడ్డి పోటీ చేస్తున్నారని, మీ అందరికీ సేవ చేసే అవకాశం కల్పించాలని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ముండ్లమూరులోని జడ్పీ పాఠశాలలో ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఎంపీపీ సుంకర సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వయం సహాయక సభ్యురాళ్లు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి చైర్‌పర్సన్ వెంకాయమ్మ మాట్లాడారు. వైసీపీ ఇన్‌చార్జి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాలంటే వైసీపీని గెలిపించాలన్నారు. అనంతరం 1004 పొదుపు సంఘాలకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వెంకాయమ్మను, శివ ప్రసాద్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుం కర సునీత, బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు టీ రత్నరాజు, ఏరియా కో-ఆర్డినేటర్ వసుంధరాదేవి, ఎంపీడీవో శంకరరావు, ఈవోఆర్డీ శ్రీదేవి, వైస్ ఎంపీపీలు బంకా నాగిరెడ్డి, వేముల జానకి రామయ్య, మండల వైసీపీ మాజీ కన్వీనర్ సూదిదేవర అంజయ్య, సర్పంచ్‌లు జమ్ముల గురవయ్య, జనమాల నాగేంద్రం పిచ్చయ్య, కందిమళ్ల గీతాంజలి, ఎంపీటీసీ సభ్యుడు గుణపాటి వెంకటేశ్వరరెడ్డి, తేలుకుట్ల బ్రహ్మం, మాజీ సర్పంచ్‌లు చింతా శ్రీనివాస రెడ్డి, అన్నపురెడ్డి భిక్షాలరెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షు డు మేకల వెంకటేశ్వరరెడ్డి, మేదరమెట్ల కోదండరామయ్య, నిడమానూరి చెంచయ్య, గోరంట్ల రాంబాబు, గోపనబోయిన వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరం

దర్శి, జనవరి 30 : రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల ఆవరణలో మం గళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జడ్పీ చైర్ పర్సన్‌బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానంతో ఇతరులకు ప్రాణదానం చేసినంత పుణ్యమని పేర్కొన్నారు. రక్త నిల్వలు పెంపొందించేందుకు శి బిరాలను ఏర్పాటు చేయడం ఆనందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఆయన సతీమణి బూచేపల్లి నందిని, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతి రెడ్డి రోటరీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో 52 మంది రక్తదానం చేశారు.


గురుబ్రహ్మం పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కాశిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు

అశ్రునయనాలతో గురుబ్రహ్మంకు అంతిమ వీడ్కోలు

- పార్థివదేహానికి మాజీ మంత్రి కాశిరెడ్డి, డాక్టర్ ఉగ్ర నివాళి
- అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రముఖులు, ప్రజలు

కనిగిరి, జనవరి 30 : మానవతావాది, దయాశీలి ప్రముఖ వైద్యులు డాక్టర్ గురుబ్రహ్మం దివికేగారు. పట్టణంలోని ఎంఎస్ఆర్ రోడ్డులోని సుగుణావతమ్మ సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ గురుబ్రహ్మం స్వగృహంలో ఉంచిన ఆయన పార్థివదేహాన్ని ప్రముఖులతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు సందర్శించి ఆయనకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురుబ్రహ్మం నివాసం నుంచి ఆయన పార్థివదేహానికి అంత్యక్రియలు కోసం గార్లపేట రోడ్డులోని స్వర్గధామానికి తరలించారు. డాక్టర్ గురుబ్రహ్మం పార్థీదేహాన్ని చూసిన జనం కంటతడిపెట్టారు. మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి గురుబ్రహ్మం పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని కాశిరెడ్డి గుర్తు చేసుకున్నారు. మంచి మనిషి, సేవా తత్పరుడు భౌతికంగా లేడన్న వార్త జీర్ణించుకోలేక పోతున్నా అన్నారు. డాక్టర్ ఉగ్ర మంగళవారం వేకువజామునే గురుబ్రహ్మం నివాసంలో ఉంచిన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. గురుబ్రహ్మంతో ఉన్న సాన్నిహిత్యాన్ని ఉగ్ర గుర్తు చేసుకున్నారు. ఎంతో మంది పేదలకు ఉచితంగా వైద్య సేవలందించేవారన్నారు. ఆయన కుటుంబం ప్రజా సేవలో తరించిందన్నారు. గురుబ్రహ్మం తనయుడు ప్రముఖ న్యాయవాది వాసును ఉగ్ర ఓదార్చారు. గురుబ్రహ్మం సతీమణి డాక్టర్ సుగుణావతమ్మను పరామర్శించారు. గురుబ్రహ్మం వీడ్కోలు యాత్రలో ప్రజలతో కలసి డాక్టర్ ఉగ్ర నడిచి అంత్యక్రియ సంస్కారాల్లో చివరి వరకు ఉన్నారు. అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ గఫార్, డాక్టర్ ధనుంజయుడు, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజు, ఎంపీపీ ప్రకాశం, వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్‌లతో పాటు, టీడీపీ నాయకులు భేరిపుల్లారెడ్డి, రాచమల్ల శ్రీనివాసులు రెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఆర్యవైశ్య ప్రముఖులు దేవకి సుబ్రమణ్యం, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని డాక్టర్ గురుబ్రహ్మం అంతిమసంస్కార కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య

దర్శి జనవరి 30 : పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాల ని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేయాలన్నారు. ఈ సందర్భంగా 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు జి స్టీవెన్, తలారి కోటయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

బీసీ సదస్సును జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామల కాశిరెడ్డి

వెలిగండ్ల, జనవరి 30 : వెలిగండ్లలో బుధవారం జరిగే బీసీ సదస్సును జయప్రదం చేయాలని నియోజకవర్గ టీడీపీ నాయకుడు శ్యామల కాశిరెడ్డి కోరారు. మంగళవారం వెలిగండ్ల టీడీపీ కార్యలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కాలనీలో జరిగే సదస్సుకు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. జగన్‌రెడ్డి పాలనలో బీసీలకు తీరనిఅన్యాం జరిగిందన్నారు. ఎప్పటికీ బీసీలకు అండగా ఉండేది టీడీపీయేనని అన్నారు. బీసీవర్గాలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మౌలాలీ, క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, రైతు అధ్యక్షుడు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, జిల్లా ఎస్సీసెల్ అధికా ర ప్రతినిధి సలోమన్‌రాజు, కర్నాటి భాస్కర్‌రెడ్డి, తెలుగు రైతు అధ్యక్షుడు మీనిగ కాశయ్య, ఒంగోలు శ్రీను, చంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులను ఏర్పాటు చేయాలి

ముండ్లమూరు, జనవరి 30 : త్వరలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో వసతుల ఏర్పాటుపై దర్శి నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు మంగళవారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని వేములబండ, చింతలపూడి, పెద ఉల్లగ ల్లు, కెల్లంపల్లి, పసుపుగల్లు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ ఉ న్న సిబ్బందితో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో కరెంట్, తాగు నీరు సౌకర్యంతో పా టు కిటికీల తలుపులు పరిశీలించారు. ఓటు హక్కును వినియోగించుకొని వచ్చే వ్య క్తికి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని వీఆర్‌వోలను ఆదేశించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, వీఆర్‌వోలు కోటయ్య, రమణ, సుశీలరాణి, పెద్దన్న పాల్గొన్నారు.

మద్దిరాల ఎడ్లకు ప్రథమ బహుమతి


పోటీలో తలపడుతున్న ఎడ్ల జత

కురిచేడు, జనవరి 30 : కురిచేడు మండలం పొట్లపాడు గ్రామంలో గుత్తికొండ రామయోగి స్వామి 113 వ తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఒంగోలు జాతి గిత్తల రాష్ట్ర స్థాయి బల ప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మంగళవారం న్యూ కేటగిరీ విభాగంలో పోటీలు నిర్వహించారు. మొత్తం 10 ఎడ్ల జతలు పోటీలలో పాల్గొన్నాయి. అట్టహాసంగా ఎడ్ల బలప్రదర్శన జరిగింది. ప్రజలు పెద్ద ఎత్తున పోటీలను తిలకించారు. వారికి చీమకుర్తికి చెందిన గ్రానైట్ వ్యాపారి నుసుం గోవిందరెడ్డి భోజన సదుపాయం కల్పించారు. ప్రథమ బహుమతిని నాగులుప్పలపాడు మండలం మద్దిరాల, ముప్పాళ్ల గ్రామానికి చెం దిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్ల జత 4436.10 అడుగులు లాగి కైవసం చేసుకున్నాయి. వారికి రూ.50వేలు చీమకుర్తికి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి అందజేశారు. ద్వితీయ బహుమతిని హైదరాబాద్‌కు చెందిన మేకా ప్రతీక్ ఎడ్ల జత 4382 అడుగులు లాగి కైవసం చేసుకున్నాయి. వారికి కురిచేడుకు చెందిన ఆవుల వెంకట రెడ్డి రూ.40 వేలను అందజేశారు. ముండ్లమూరు మండలం గంగన్నపాలెం గ్రామానికి చెందిన ఉమ్మారెడ్డి శ్రీవల్లి ఎడ్ల జత 3900 అడుగులు లాగి తృతీయ బహుమతిని గెలుచుకున్నాయి. వారికి నుసుం గోవింద రెడ్డి రూ.30వేల బహుమతిని అందజేశారు. ఉత్సాహభరితంగా సాగిన ఎడ్ల బలప్రదర్శన ఆహుతులను ఆకట్టుకున్నది.

ఉత్తమ సేవా అవార్డ్ గ్రహీతలకు సన్మానం

తాళ్లూరు, జనవరి 26 : గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డులను అందుకున్న స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ బి.ప్రమీల (ఉత్తమ ఉద్యోగి), ఫార్మసిస్ట్ జి.రమేష్ (బెస్ట్‌ఫార్మసిస్ట్)ను మంగళవారం ఘనంగా సత్కరించారు. వారి సేవలను వైద్యులు, సిబ్బంది కొనియాడారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్కే ఖాదర్ మస్తాన్‌బీ, రాజేష్, ఎంఎల్ పీహెచ్‌వోలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





అమర్‌నాథ్ కుటుంబానికి ఆర్థిక సాయం

గతేడాది వైసీపీ కార్యకర్త చేతిలో సజీవ దహనమైన చెరుకుపల్లికి చెందిన బాలుడు అమర్నాథ్‌గౌడ్ కుటుంబసభ్యులను భువనేశ్వరి నిజం గెలవాలి యాత్రలో భాగంగా మంగళవారం పరామర్శించారు. బాలుడి సోదరి హేమశ్రీకి ఎన్నారై స్వచ్ఛంద సంస్థ జొన్నలగడ్డ వీరయ్యచౌదరి, జొన్నలగడ్డ వేణు, దివ్య మద్దునూరి మిత్రబృందం సమకూర్చిన రూ.4 లక్షల 50 వేల చెక్కును, యూఎస్‌ఏకు చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ సేకరించిన రూ.3 లక్షల 58 వేల చెక్కును అందజేశారు. కళాశాలలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చదువుకుంటున్న హేమశ్రీని అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో హేమశ్రీ కన్నీటి పర్యంతమవగా దగ్గరకు తీసుకుని కలత చెందాల్సిన అవసరం లేదని, ఉన్నతస్థాయి ఉద్యోగం వచ్చే వరకు కుటుంబానికి అండగా ఉంటామని భువనేశ్వరి భరోసా ఇచ్చారు.

చదువుకు అండగా..

గతేడాది సెప్టెంబరు 10న చంద్రబాబు అరెస్టు వార్తలను టీవీలో చూస్తూ గుండెపోటుతో యద్దనపూడి గ్రామానికి చెందిన టెక్కం నాగేశ్వరరావు మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్ద కుమార్తె వివాహం అవ్వగా, చిన్న కుమార్తె డిగ్రీ పూర్తి చేశారు. సివిల్స్‌కు వెళ్లాలన్న తన కోరికను తండ్రి మరణించడంతో విరమించుకోగా, ప్రస్తుతం భువనేశ్వరి ఆమె చదువుకు భరోసా ఇచ్చారు. అనంతరం ఆ కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థికసాయం అందజేశారు.



యద్దనపూడిలో టెక్కం నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థికసాయం చెక్కు అందిస్తున్న భువనేశ్వరి

మొవ్వ సింగారావు కుటుంబానికి..

చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి గురైన పర్చూరు మండలం చిననందిపాడు గ్రామానికి చెందిన మొవ్వ సింగారావు గతేడాది అక్టోబరు 12న మరణించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన సంపాదన మీదే ఆధారపడి ఆ కుటుంబం బతుకుతోంది. ఈ క్రమంలో భువనేశ్వరి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి రూ.3 లక్షలు అందజేశారు.

కష్టాలు వింటూ.. కన్నీళ్లు తుడుస్తూ..

కుటుంబ సభ్యుడ్ని కోల్పోయిన మీరు ఎంత బాధలో ఉన్నారో తెలుసు. అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం.. టీడీపీ కార్యకర్తలంతా మా కుటుంబ సభ్యులే.. ఏ కష్టమొచ్చిన పార్టీ అండగా ఉంటుంది.. ఏ సమయంలో అయినా మా దగ్గరికి రావచ్చు.. అంటూ చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ధైర్యం చెప్పారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో గతంలో మృతి చెందిన బాధిత కుటుంబాల కష్టాలు వింటూ.. వారి కన్నీళ్లు తుడిచారు. కుటుంబసభ్యుడ్ని కోల్పోయి నీరింకిన కళ్లతో ఉన్న బాధిత కుటుం బాలకు నిజం గెలవాలి యాత్ర ద్వారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. రేపల్లె, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో భువనేశ్వరి పర్యటన మంగళవారం జరిగింది. బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబాలకు భువనేశ్వరి ఆర్థిక సాయం అందజేశారు. చంద్రబాబు అరెస్టుతో జిల్లాలో చనిపోయిన ముగ్గురూ నిరుపేదలే కావడం, కుటుంబ భారం మోసే వారే తనువుచాలించడంపై ఆమె చలించిపోయారు.

- అధైర్యపడొద్దు అండగా ఉంటామని భరోసా
- నిజం గెలవాలి యాత్రలో భువనేశ్వరి పరామర్శ
- రేపల్లె, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో పర్యటన



చెరుకుపల్లిలో తోట వెంకటేశ్వరరావు భార్య విజయలక్ష్మికి చెక్కును అందిస్తున్న భువనేశ్వరి, ప్రక్కన ఎమ్మెల్యే అనగాని

రేపల్లె, చెరుకుపల్లి / బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక ప్రాణాలొదిలిన మూడు కుటుంబాలను మంగళవారం భువనేశ్వరి పరామర్శించారు. వారికి ధైర్యాన్ని నింపడంతో పాటు ఆర్థికంగా సాయం అందించడానికి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి జిల్లాలో పర్యటించారు. చెరుకుపల్లిలో ఒకరు, పర్చూరు నియోజకవర్గం చిననందిపాడు, యద్దనపూడి గ్రామాల్లో ఒక్కొక్కరు గుండెపోటుతో గతేడాది మృతి చెందగా వారి కుటుంబాలకు భువనేశ్వరి ఆత్మీయ పరామర్శ మనోధైర్యాన్ని ఇచ్చింది. ఆయా గ్రామాల్లో పర్యటించిన ఆమె బాధిత కుటుంబాలను పరామర్శించి మృతుల చిత్రపటాల వద్ద నివాళులు అర్పించి, వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. చంద్రబాబుపై ఉన్న అభిమానంతో ఆయన అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటు వచ్చి మరణించారని వారి కుటుంబసభ్యులు భువనేశ్వరి ఎదుట కన్నీటి పర్యంతమవగా అండగా ఉంటానని వారి భుజం తట్టి ధైర్యం చెప్పారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా చెరుకుపల్లిలో తోట వెంకటేశ్వరరావు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. అనంతరం రూ.3 లక్షల చెక్కును వెంకటేశ్వరరావు భార్య విజయలక్ష్మికి అందజేశారు. భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్న వెంకటేశ్వరరావు కుమారులు సురేష్, రాజేష్ ఎలాంటి ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

నిజం గెలవాలి యాత్ర సాగిందిలా..

గన్నవరం విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో నిజం గెలవాలి యాత్ర సాగింది. భువనేశ్వరికి జిల్లా ప్రారంభంలో కార్యకర్తలు ఆహ్వానం పలికారు. చిలుమూరు కర కట్టపై ఉన్న ఆంజనేయస్వామికి భువనేశ్వరి ప్రత్యేక పూజలు చేశారు. కొల్లిపర మండలం పిడపర్తిపాలెం మహిళలు భువనేశ్వరి వాహన శ్రేణికి ఘనంగా స్వాగతం పలికారు. భువనేశ్వరికి హారతులు ఇచ్చి శాలువాతో సన్మానించారు. అనంతరం



కొల్లూరులో భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న మాజీ మంత్రి ఆనందబాబు

చెరుకుపల్లిలోని బాధిత కుటుంబం ఇంటి వద్దకు చేరుకుని వారిని పరామర్శించారు. వెల్లటూరులో మహిళలు అభ్యర్థన మేరకు వాహనం నుంచి బయటకు వచ్చి భువనేశ్వరి అభివాదం చేశారు. దారి పొడవునా మహిళలు ఆమెను చూసేందుకు బారులు తీరారు. చెరుకుపల్లిలో అయితే అపూర్వ స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో భువనేశ్వరి వెంట మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్ బాపట్ల, చీరాల ఇన్‌చార్జులు వేగేశన నరేంద్రవర్మ, ఎంఎం కొండయ్య, టీడీపీ చెరుకుపల్లి మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఉప్పాల సాంబశివరావు, పూషడపు కుమారస్వామి, తాతా ఏడుకొండలు, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



చెరుకుపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి, ఎమ్మెల్యే అనగాని

చేయూత ఏరివేత



- లబ్ధిదారుల తగ్గింపునకు అడ్డదారులు
- కరెంటు బిల్లుల పేరుతో అడ్డగోలుగా కోతలు
- 300 యూనిట్లు దాటించేందుకు పిల్లిమొగ్గలు
- సెప్టెంబరు నుంచి ఇదిగో.. అదిగో అంటున్న ప్రభుత్వం

మంగళగిరికి చెందిన ఓ మహిళకు వలంటీర్ ఫోన్ చేసి మీకు చేయూత ఆగిపోయిందండీ అని చెప్పిం ది. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటడమే కారణ మని చెప్పింది. ఏమిటా అని సచివాలయంలో అడిగితే ఆమె హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో రెండు మీటర్లు చూపిస్తున్నాయని చెప్పారు. ఆ రెండు మీటర్లు కలుపుకున్నా ఆమె కరెంటు బిల్లు 290 యూనిట్లు దాటలేదు. కానీ ప్రభుత్వం మాత్రం 310 యూనిట్లు వచ్చిందని చెప్పి ఆమెకు చేయూత ఆపేశారు. ఏమిటా అని లోతుగా పరిశీలిస్తే ఒక ఏడాదిలో 300 యూనిట్లు దాటిని నెలల సగటు తీసుకుని ఆమె చేయూత ఆపేశారని తేలింది.

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను అంతకంతకూ నీరుగార్చడం ధ్యేయంగా ప్రభుత్వం ఏటికేడు మార్పులు, నిబంధనలను కఠినతరం చేస్తోంది. ముందు ఏదో ఒక సాకుతో లబ్ధిదారులను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇదేదో ఒక పథకానికి పరిమితం అంటే కాదు. అన్ని పథకాల పరిస్థితి ఇలానే ఉంది. ఈ కోవలోకి చేయూత చేరింది. ఏదో ఒకలా లబ్ధిదారులను తొలగిస్తే ఆ తర్వాత వారి ఖర్మం అన్నట్లుగా ప్రభుత్వ తీరు ఉందన్న విమర్శలున్నా పాలకులు లెక్క చేయడంలేదు. ఇప్పటికే సంక్షేమ పథకాలకు సవాలక్ష నిబంధనలు పెట్టి లబ్ధిదారులను ఎక్కడికక్కడ దిగ్గోసినా ప్రభుత్వానికి తృప్తి కలిగినట్లుగా లేదు. తప్పుడు పద్ధతుల్లో ఆ నిబంధనలను అన్వయించి లబ్ధిదారులను భారీగా తగ్గించేపనిలో తలమునకలై ఉంది.

● నిబంధనలు ఇలా.. అమలు ఇలా..

చేయూత అమలుకు ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టింది. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటరాదు. నాలుగు చక్రాల వాహనం ఉండరాదు. ఐటీ చెల్లింపులు చేసి ఉండకూడదు. ఇంట్లో ప్రభుత్వ పింఛను తీసుకునేవారు ఉండకూడదు. ఇంటి స్థలం, పొలం నిర్దీత విస్తీర్ణాన్ని మించి ఉండకూడదు అంటూ ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టింది. వాటిని అమలు చేసిన కారణంగా గత మూడు దఫాల్లోనే చాలామంది చేయూత పథకానికి అనర్హులుగా మారిపోయారు. ఈసారి లబ్ధిదారులను ఏరివేసేందుకు అవకాశం దొరకలేదు. దీంతో అడ్డదారుల్లో నిబంధనలను అన్వయించి లబ్ధిదారులను మోసం చేస్తోంది. ఆరునెలల విద్యుత్ వినియోగ సగటు 300 యూనిట్లు దాటరాదన్న నిబంధనను తప్పుడు దారిలో అన్వయిస్తోంది. ప్రస్తుతం ఉన్న ఆరు నెలల సగటు కాకుండా, మొత్తం విద్యుత్ వినియోగంలో అత్యధికంగా విద్యుత్ వినియోగించిన నెలలు ఎంచుకుని ఆ సగటును చూపించి లబ్ధిదారులను తొలగిస్తోంది. గతంలో ఏనాడో కారు కొని ఉండి అది ఇప్పుడు అమ్ముకుని ఉన్నా, కారు లేదన్న విషయాన్ని పక్కకు పెట్టి లబ్ధిదారులను తొలగిస్తున్నారు. ఐటీ విషయంలో కూడా ఇదే జరుగుతోంది. గృహరుణం కోసం గతంలో ఏనాడో చెల్లించిన ఐటీ చెల్లింపులు, ఐటీ కట్టినవారు రేషన్ కార్డులో ఉన్నారనే కారణంతో చాలా మందికి చేయూత ఆపేశారు. చేయూత లబ్ధి పొందే మహిళ సోదరుడు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడనో, తండ్రి విశ్రాంత ఉద్యోగ పింఛను తీసుకుంటున్నాడనో, ఐటీ చెల్లించాడనో పెళ్లై వేరే కుటుంబంలోకి వెళ్లిపోయిన మహిళలకు కూడా పింఛను తొలగిస్తున్న ఘటనలు అనేకం ఉన్నాయి.



ఫిబ్రవరి వచ్చినా ఊసేలేని పథకం

ఆది నుంచి చేయూత పథకాన్ని ప్రభుత్వం జాప్యం చేస్తూనే వస్తోంది. 2019 జూన్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూత పేరుతో హడావుడి చేసింది. అయితే 2020 ఆగస్టు 12 వరకూ ఆ పథకం ఊసే ఎత్తలేదు. అధికారం చేపట్టిన 14 నెలల వరకూ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించలేదు. 2021 జూన్‌లో రెండో దఫా చేయూత నగదు అందించిన ప్రభుత్వం 2022 సెప్టెంబరు 23 వరకూ మూడో దఫా చేయూత అందించలేదు. అంటే 2021 తర్వాత మరో 16 నెలలకుగానీ లబ్ధిదారులకు చేయూత దక్కలేదు. కాగా కిందటేడాది సెప్టెంబరు నుంచి చేయూత ఇదిగో.. అదిగో అంటున్న ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆ ఊసే ఎత్తలేదు. అక్టోబరులో ఇస్తారన్న చేయూత, జనవరిలో కూడా ఇవ్వలేదు. తాజాగా ఫిబ్రవరి అంటున్నారు. అదైనా అమలవుతుందో లేదో తెలియని పరిస్థితి. ఎన్నికల కోడ్ సమీపిస్తోన్న నేపథ్యంలో ప్రభుత్వమే కావాలని జాప్యం చేస్తోందా అన్న అనుమానాలు లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు.

ఒక సారి ఆగిపోతే ఇక అంతే..

ప్రభుత్వం ఏదో ఒక మెలిక పెట్టి ఒకసారి పథకానికి అనర్హులుగా చేస్తే ఇక వారికి పథకం అందడం దాదాపు అసాధ్యమే! తమ వద్ద ఆధారాలు ఉన్నా, ఎంపిక విధానంలో లోపమున్నా లబ్ధిదారులు చేయగలిగిందేమీ లేదు. కావాలంటే సచివాలయానికి వెళ్లి ఆధారాలతో ఒక అభ్యర్థన పెట్టుకోవచ్చు. కానీ దాన్ని పరిశీలించి పరిష్కరించే అధికారం, అవకాశం ఏ ఒక్కరికీ లేదు. క్షేత్ర స్థాయిలో ఉండే గ్రామ, వార్డు సంక్షేమ అధికారి మొదలు, ఎంపీడీవో, డీఆర్‌డీఏ పీడీ వరకూ ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో అనర్హత బారిన పడిన లబ్ధిదారుల గోడు వినేవారే లేకుండా పోయారు.

స్మార్ట్ టౌన్‌షిప్‌లు కలేనా?

- భూసేకరణకు నిధులు ఇవ్వని ప్రభుత్వం
- లేఅవుట్‌లు ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితం
- నవులూరు మినహా పట్టణాల్లో గజం కూడా సేకరించింది లేదు
- మిథ్యగానే మధ్యతరగతికి స్థలాలు

నవులూరు వద్ద స్మార్ట్ సిటీ నమూనా చిత్రం



పట్టణాలు, శివారు ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అల్పాదాయ వర్గాల వారు స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకోవడం కలగానే మిగులుతోంది. ఈ నేపథ్యంలో మిడిల్ ఇన్‌కం గ్రూప్(ఎంఐజీ) జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ పథకాన్ని ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశ పెట్టింది. ఇందులో ప్రభుత్వమే భూమి కొనుగోలు చేస్తుంది. అసైన్డ్ భూమి ఉంటే సేకరిస్తుంది. లేఅవుట్ రూపొందిస్తుంది. ఇరవై ఏళ్లు క్రితం ఐడీఎస్ఎంటీ పేరుతో ఇలాంటిది అమలైంది. పాత పథకాన్నే తిరిగి ప్రభుత్వం ప్రవేశ పెట్టినప్పటికి నేటివరకు పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అమలు చేయడాన్ని విస్మరించింది. మధ్యతరగతికి స్థలాలు మిథ్యగానే మిగిలిపోయాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మధ్యతరగతికి స్థలాల పంపిణీ ముందడుగు పడటంలేదు. పట్టణాల వారీగా అధికారులు ప్రభుత్వానికి భూమిని సేకరించడానికి ప్రతిపాదనలు పంపారు. ఇంతవరకు కొన్ని పట్టణాల్లో గజం స్థలం కూడా సేకరించలేదు. రాజధాని ప్రాంతంలో మినహా మరెక్కడా స్థలాలు లేవు. భూమిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ఈ లేఅవుట్లు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ద్వారా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అథారిటీల వారీగా స్థలాలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నేటివరకు నిధుల విడుదలకు అతీగతి లేదు. దీంతో భూసేకరణ నిలిచిపోయింది.

మూడేళ్ల కిందటే ఆదేశాలు..

ప్రభుత్వం ఎంఐజీ వారికి స్థలాలివ్వాలని 2020 సంవత్సరంలో అధికారులకు ఆదేశాలిచ్చింది. అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మునిసిపాల్టీల పరిధి లో స్థలసేకరణ చేపట్టాల్సి ఉండగా ఇంతవరకు ఒక్కచోట కూడా కొలిక్కిరాలేదు. రెవెన్యూ సహకారం తో స్థలాలను సేకరించి లేఅవుట్‌లు ఆమోదం తీసుకొనే బాధ్యతలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు అప్పగించింది. సంబంధిత అధికారులు స్థలసేకరణ అంశాన్ని రెవెన్యూ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందనలేదు. నిబంధనల ప్రకారం పట్టణానికి అయిదు కిలోమీటర్ల లోపునే భూమిని సేకరించాల్సి ఉంది. అదీ కూడా ఎకరం రూ.కోటిన్నర లోపు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ విధంగా పట్టణాలకు చుట్టుపక్కల భూమి లభ్యం కావడంలేదు. అత్యధిక ధరతో కొనుగోలు చేస్తే ఆ భారం లబ్ధిదారులపై పడుతోంది.

మునిసిపాలిటీల వారీగా డిమాండ్...

అన్ని పట్టణాల పరిధిలో పది ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం సేకరించాల్సి ఉంది. 150, 200, 240 గజాలుగా ప్లాట్లను విభజిస్తారు. లేఅవుట్‌లో రహదారులు, కాలువలు, విద్యుత్తు సౌకర్యం కల్పిస్తుంది. రిజర్వ్ స్థలంలో ప్రజావసరాల కోసం బడి, గుడి వంటివి నిర్మిస్తుంది. అనంతరం దరఖాస్తులు స్వీకరిస్తుంది. తక్కువ వేతనంతో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఎవరైనా ఇందుకు అర్హులే. లేఅవుట్ ఆమోదం అనంతరం దరఖాస్తుదారులను ఎంపిక చేయాల్సి ఉంది. మూడు జిల్లాల పరిధిలో స్థలాల డిమాండ్‌ను సంబంధిత అధికారులు గుర్తించారు. ఈ మేరకు మునిసిపాల్టీల వారీగా ప్లాట్ల డిమాండ్‌ను నిర్ధారించారు. దాదాపు 28,416 ప్లాట్లు అవసరం ఉందని గుర్తించారు. నరసరావుపేట మునిసిపాల్టీలో 1864 ప్లాట్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సదరు అధికారులు సిద్ధం చేశారు. అలాగే చిలకలూరిపేట 651 ప్లాట్లు, మాచర్ల 108, సత్తెనపల్లి 346, వినుకొండ 608, పిడుగురాళ్ల 482, దాచేపల్లి 56, గురజాల 21, బాపట్ల 3171, గుంటూరు 9614, మంగళగిరి 1344, పొన్నూరు 531, రెపల్లే 1066, తాడేపల్లి 2065, తెనాలి 2962, అద్దంకి 1104, చీరాల 2095 ప్లాట్లు అవసరం ఉందని నిర్ధారించారు. ఈ మేరకు అర్బన్ అథారిటీలు భూమి సేకరణకు ప్రతిపాదనలు రూపొందించాయి. రాజధాని పరిధిలో మంగళగిరి నియోజకవర్గం నవులూరులో గజం రూ.17,499గా నిర్ణయించి దరఖాస్తులను స్వీకరించారు. ఇక్కడ మినహా మరెక్కడా అమలు జరగలేదు. ఈ ప్రక్రియ దాదాపు అటకెక్కినట్లే. పథకం అమలు లక్ష్యం ఘనంగా ఉన్నా ఆచరణ మాత్రం శూన్యమని చెప్పవచ్చు.

ఆచితూచి అడుగులు

- చీరాల, పర్చూరుల్లో ఆ నేత ద్విపాత్రాభినయం
- అక్రమార్జనకు గండిపడకుండా.. అధిష్ఠానం ఆగ్రహానికి గురికాకుండా...

చీరాల, జనవరి 30: వైసీపీకి చెందిన ఆ నేత చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో ద్విపాత్రాభినయం చేస్తున్నారు. రాజకీయంగా భిన్న ప్రకటనలు చేయటంతో పార్టీ అధిష్ఠానం దృష్టి ఆ నేతపై పడటంతో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. అక్రమ సంపాదనకు గండిపడకుండా ఒకవైపు, అధిష్ఠానం ఆగ్రహానికి గురికాకుండా మరోవైపు నియోజకవర్గాల్లో ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. ఎన్నికలనోటిఫికేషన్ వెలువడే దాకా సంయమనం పాటిస్తే ఆ తర్వాత తనదారి తాను చూసుకున్నా ఇబ్బంది ఉండదనే ఆలోచన చేస్తున్నట్లు వినికిడి.

చీరాలలో బస్సుయాత్ర నుంచి..

ఇటీవల చీరాలలో వైసీపీ బస్సుయాత్ర జరిగిన రోజు నుంచి ఆ నేత పార్టీ పెద్దలను పలుమార్లు కలిశారు. తొలిసారి కలిసిన తర్వాత ముఖ్య అనుచరులతో అంతరంగిక సమావేశం నిర్వహించారు. తాను చీరాల నుంచే పోటీ చేస్తానని అందులో స్పష్టం చేశారు. చీరాల అభ్యర్థి కరణం వెంకటేష్ అని బస్సు యాత్రలో నేతలు ప్రకటించారు. దీంతో ఆ నేత అదేరోజు పార్టీ పెద్దల ముందు తన పంచాయితీ పెట్టారు. గత ఒప్పందాలను అమలు చేయాలని లేదంటే తన నిర్ణయం తాను తీసుకుంటానని చెప్పినట్లు అనుచరగణం ప్రచారం చేసింది.

భరత్ ఎంట్రీతో పునరాలోచన

కాగా ఆ నేత నిర్వహించిన అంతరంగిక సమావేశ సారాంశం తెలుసుకున్న సీఎం జగన్ ఆదేశాల మేరకు గతంలో పర్చూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన గొట్టిపాటి భరత్‌కు సీఎంవో నుంచి వర్తమానం వెళ్లింది. భరత్ సీఎం జగన్‌ను కలిశారు. దీంతో ఆ నేత పునరాలోచనలో పడ్డారు. వెంటనే విజయసాయిరెడ్డిని కలసి తాను పర్చూరు నుంచే పోటీ చేస్తానని, అయితే తనకు మొదట్లో చెప్పిన మాటలను పరిగణనలోకి తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. తన సూచనలను పరిగణనలోకి తీసుకోకుంటే పార్టీ మారే ఆలోచనలో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. పార్టీ మారే ఆలోచన ముందస్తుగా తెరపైకి వస్తే పర్చూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు పరంపరగా వస్తున్న అక్రమార్జనకు గండి పడుతుంది. దాంతో పాటు అధిష్ఠానం ఆగ్రహానికి కూడా గురికావాల్సి వస్తుంది.

త్యాగజీవి.. మహాత్మాగాంధీ

కలెక్టర్ పి.రంజిత్‌బాషా నివాళి

బాపట్ల, జనవరి 30: స్వేచ్ఛా వాయువులతో జాతి అభివృద్ధి చెందాలని మహాత్మాగాంధీ చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరు మననం చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్ ఇతర అధికారులతో కలిసి మహాత్ముడి చిత్రపటానికి కలెక్టర్ పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ అహింసావాద మార్గంలో ఏదైనా సాధించగలమని చాటిచెప్పిన గొప్ప వ్యక్తి మహాత్మాగాంధీ అన్నారు. స్వాతంత్ర్యం కొరకు ప్రజలందరినీ చైతన్య పర్చడంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో పి.వెంకటరమణ, ఆర్డీవో గంధం రవీందర్, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, ఏవో కె.గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్

తగ్గేదేలే!

వైసీపీలో ముసలం ముదురుపాకాన పడింది

చెవిరెడ్డికి ఎంపీ టికెట్, పార్టీ బాధ్యతలు

కుదరదు, సీఎంను కలవను : బాలినేని

సజ్జల, సాయిరెడ్డి మంతనాలు

నేడు అనుచరులతో ఎమ్మెల్యే మద్దిశెట్టి ప్రత్యేక సమావేశం

మేమంతా ఎంపీ బాటే అంటున్న ఆయన అనుచరులు

వేగంగా పావులు కదుపుతున్న మాగుంట

వైసీపీలో ముసలం ముదిరింది. ఒంగోలు ఎంపీ స్థానాన్ని బాలినేని కోరినట్లు మాగుంటకు కేటాయించకపోగా, అందరూ వద్దంటున్న చెవిరెడ్డికి కేటాయించటమేగాక పార్టీ బాధ్యతలు కూడా అప్పగిస్తూ సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో బాలినేని తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఆయన్ను సముదాయించేందుకు వచ్చిన ఆ పార్టీ నేతలు సజ్జల, సాయిరెడ్డిలపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సీఎంను కలిసే పనే లేదు పొమ్మని తేల్చిచెప్పారు. మరోవైపు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోయినా, అడిగిన ఎంపీ టికెట్ కూడా కాదనడంతో దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి తన రాజకీయ భవితవ్యంపై అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇక, సీఎం తాజా నిర్ణయం అనంతరం మాగుంటతో పాటే ఆయన అనుచరులు పయనించాలని, అవసరమైతే వైసీపీకి గుడ్‌బై చెబుతామని వారు కూడా ప్రకటించారు. మాగుంట టీడీపీలో చేరే ప్రయత్నాలు మంగళవారం సాయంత్రం నుంచి ముమ్మరమయ్యాయి. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మంగళవారం కూడా సీఎంను కలిసేందుకు వెళ్లలేదు. కాగా బాలినేని వైసీపీలో ఉండాలా లేక తప్పుకోవాలా అన్న ఆలోచనకు చేరినట్లు కూడా సమాచారం.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు ఎంపీ అభ్యర్థి ఎంపికపై సీఎం జగన్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిల మధ్య నెలకొన్న అభిప్రాయ బేధాలు తారస్థాయికి చేరాయి. దీంతో అభ్యర్థుల ఎంపికలో అధికార వైసీపీలో ఆరంభమైన ముసలం ముదిరిపాకాన పడినట్లైంది. జిల్లాలో వైసీపీ అభ్యర్థుల ఎంపికలో కీలకంగా మారిన ఎంపీ అభ్యర్థి ఎంపికపై గత కొంతకాలంగా అధిష్ఠానం నిర్ణయానికి జిల్లా నాయకుల నిర్ణయానికి మధ్య పొంతన కుదరని విషయం తెలిసిందే. ఈ విషయంలో తుది నిర్ణయం తీసుకునేందుకు బాలినేనిని రమ్మని అధిష్ఠానం కబురుచేసింది. విజయవాడ చేరిన బాలినేనికి మంగళవారం ఉదయం ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా తిరుపతి జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పేరును ఖరారు చేసినట్లు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత కొద్దిసేపటికే ప్రస్తుతం విజయసాయిరెడ్డి చేతిలో ఉన్న కొత్త ప్రకాశం జిల్లా, నెల్లూరు జిల్లాలోని కందుకూరు, కావలి నియోజకవర్గాల పార్టీ బాధ్యతలను చెవిరెడ్డికి అప్పగిస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం పార్టీ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి జిల్లాలో బాలినేనితో పూర్తి సఖ్యతతో ఉన్నాడన్న భావనతోనే ప్రకాశం జిల్లా వరకు బాధ్యతలను చెవిరెడ్డికి మార్చినట్లు కూడా ప్రచారం జరిగింది. అందులో బాలినేనితో విభేదిస్తున్న ఆయన బావ వైవీ కీలకపాత్ర పోషించినట్లు కూడా ప్రచారంలోకి వచ్చింది.

నేడు అనుచరులతో మద్దిశెట్టి సమావేశం

సీఎం నిర్ణయం తాజాగా స్పష్టం కావటంతో దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తన రాజకీయ భవితవ్యంపై నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. దర్శి టికెట్ తనకు గిట్టని బూచేపల్లికి ఇచ్చినా ఆయన సీఎం వద్దకు వెళ్లి తనకు ప్రత్యామ్నాయ అవకాశం ఇవ్వాలని కోరారు. ఒంగోలు లేదా పర్చూరుల్లో పోటీచేయమని సీఎం సూచించారు. అయితే ఎమ్మెల్యేగా దర్శి మినహా మరోచోట పోటీచేయనని, ఒంగోలు ఎంపీ సీటు ఇవ్వమని మద్దిశెట్టి కోరారు. ఆరంభం నుంచి జగన్ ఒంగోలు ఎంపీగా రెడ్డి సామాజికవర్గం వారినే పోటీకి దింపుతామని చెబుతూ వచ్చారు. మంగళవారం అదే విషయం స్పష్టం చేయటంతో మద్దిశెట్టి కూడా తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తన రాజకీయ భవితవ్యంపై నిర్ణయం తీసుకునేందుకు నియోజకవర్గంలోని అనుచరులతో భేటీ అవుతున్నారు. ఆ మేరకు బుధవారం దర్శిలోని ఆయన ఇంట్లో జరిగే సమావేశానికి రావాలని ఆయన అనుచరులందరికీ సమాచారం ఇచ్చారు. దర్శిలో వైసీపీ అభ్యర్థి ఓటమి లక్ష్యంగా ఆయన నిర్ణయం తీసుకోబోతున్నట్లు అనుచరులకు సంకేతం కూడా వచ్చింది.

మాగుంటపై అనుచరుల ఒత్తిడి

సీఎం నిర్ణయంతో వేచిచూసే ధోరణి నుంచి బయటకు రావాలని ఎంపీ మాగుంటపై ఆయన అనుచరులు ఒత్తిడి పెంచారు. చెవిరెడ్డికి పేరు ఖరారైందని తెలియగానే ఆయన అనుచరులు ఎక్కడికక్కడ భేటీ అయ్యారు. అందిన సమాచారం మేరకు కొండపి, కనిగిరి, గిద్దలూరు, దర్శి, ఒంగోలు తదితర నియోజకవర్గాల్లో ఆయన అనుచరులు భేటీ అయి మాగుంట నిర్ణయానికి కట్టుబడి ఉండాలని, అవసరమైతే వైసీపీకి గుడ్‌బై చెప్పాలని కూడా నిర్ణయించుకుంటున్నట్లు తెలిసింది. ఇటీవల రాఘవరెడ్డి ఆయా నియోజకవర్గాల్లో పర్యటించినప్పుడే వైసీపీలో ఉన్న నాయకులు ఆయనను కలిసి మాగుంట కుటుంబం ఎటుంటే అటు తాముంటామని తేల్చిచెప్పారు. కాగా మాగుంట ఇప్పటికే టీడీపీ ముఖ్యనాయకులతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. తాజా పరిణామాలతో ఆయన వేగంగా పావులు కదుపుతున్నట్లు కూడా తెలిసింది. విషయం తెలుసుకున్న ఒకరిద్దరు టీడీపీ రాష్ట్రస్థాయి నాయకులు కూడా మాగుంటకు టచ్‌లోకి వచ్చినట్లు సమాచారం. తద్వారా మాగుంట లేక ఆయన కుమారుడు లేక ఇద్దరు టీడీపీ వైపు నుంచి పోటీచేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఇదిలా ఉండగా మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరుకు, అక్కడి ఎమ్మెల్యే రాంబాబు లేక ఆయన కుమారుడు చైతన్యలను మార్కాపురానికి మార్చాలన్న వైసీపీ అధిష్ఠానం నిర్ణయం కూడా సఫలం కాలేదు. ఇటు కుందురు అటు ఉడుముల కుటుంబాల రాజకీయ నేపథ్యం ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని మార్కాపురంను వీడకూడదని నాగార్జునరెడ్డి నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే ఆయన సోమ, మంగళవారాల్లో సీఎంను కలిసేందుకు కూడా వెళ్లలేదని తెలుస్తోంది. ఇప్పటికే కందుకూరు, పర్చూరులాంటి చోట్ల అభ్యర్థుల ఎంపికపై కూడా మంతనాలు కొలిక్కిరాని దశలో రానున్న రోజుల్లో వైసీపీ అంతర్గత కలహాలు ముదిరిపాకానపడటం ఖాయంగా కనిపిస్తోంది.



తాడేపల్లి వద్ద బాలినేని కారు

తీవ్ర అసంతృప్తిలో బాలినేని

తనతో పాటు ఒంగోలు లోక్‌సభ పరిధిలోని మెజారిటీ అసెంబ్లీ అభ్యర్థులు కోరినా మాగుంటకు టికెట్ ఇవ్వకపోవటం, తాను వద్దన్నా చెవిరెడ్డికే టికెట్ ఇవ్వటం అందునా పార్టీ బాధ్యతలు కూడా ఇవ్వటంతో బాలినేని తీవ్ర అసంతృప్తికి గురైనట్లు తెలిసింది. ఆ తర్వాత బాలినేనిని సీఎంను కలవాలని కోరినా ఆయన ససేమిరా అన్నారు. దీంతో సజ్జల, సాయిరెడ్డిలు విజయవాడలో బాలినేని ఉన్న హోటల్‌కు వెళ్లి ఆయనతో మంతనాలు జరిపారు. ఆ సందర్భంగా కూడా బాలినేని తీవ్రస్వరంతో మాట్లాడినట్లు తెలిసింది. మాగుంటను కాదన్నారు, ఆయన కొడుకునూ కాదన్నారు మధ్యలో జిల్లాలోని వారికే అవకాశం ఇస్తామని చెప్పారు. ఇప్పుడేమో తాము కాదన్న చెవిరెడ్డికే సీటిచ్చారు. ఆయనకు పార్టీ బాధ్యతలూ ఇస్తున్నారు. ఇక సీఎం చెప్పినా మీరు చెప్పినా ఆయన ఆధ్వర్యంలో మేము పనిచేయలేము వెళ్లిపోండంటూ సూటిగా చెప్పినట్లు తెలిసింది. బాలినేనిని సీఎం వద్దకు తీసుకెళ్లాలని వారు చేసిన ప్రయత్నం విఫలమైంది. వారు వెళ్లేటప్పుడు మీడియా ప్రతినిధులు వెళ్లి పలకరించగా వారిని సజ్జల కసురుకున్న తీరు బాలినేనితో మంతనాల తీవ్రతను తెలియజేస్తోంది.

నేను పనిచేయలేను

అనంతరం సజ్జల, సాయిరెడ్డిలు బాలినేని అభిప్రాయాలను, లోక్‌సభ పరిధిలోని పరిస్థితులను సీఎంకు వివరించినా ఆయన నుంచి వేరే ఆలోచన వ్యక్తం కాలేదని తెలిసింది. రాత్రి పొద్దుపోయే సమయానికి బాలినేనికి కూడా ఆ సమాచారం తెలిసింది. దీంతో బాలినేని చెవిరెడ్డి నాయకత్వంలో పనిచేసే కన్నా పోటీనుంచి తప్పుకొని కొంతకాలం విశ్రాంతి తీసుకోవటమే మేలన్న ఆలోచనకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. విషయం తెలుసుకుని బాలినేని కుమారుడు అలాగే ఆయన వియ్యంకుడు, ఇతర శ్రేయోభిలాషులు విజయవాడ వెళ్లి ఆయనను శాంతింపజేసే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

2 నుంచి పరీక్షలు ప్రారంభం : ఆర్‌ఐవో సైమన్ విక్టర్

ఒంగోలు(విద్య), జనవరి 30 : జిల్లాలో ఇంటర్మీడియేట్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆర్‌ఐఓ ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. స్థానిక ఏకేవీకే జూనియర్ కళాశాలలో మంగళవారం జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, సైన్స్ అధ్యాపకులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 2న ఉదయం పదిగంటల నుంచి 1 గంట వరకు నైతికత, మానవ విలువల పరీక్ష, 3న పర్యావరణ విద్యపై పరీక్ష ఉంటుందన్నారు. ఈ రెండు పరీక్షలను విద్యార్థులు తాము చదువుతున్న కళాశాలల్లోనే తప్పనిసరిగా రాయాల్సి ఉంటుందని, గత విద్యార్థులు ఎవరైనా ఈ రెండు పరీక్షలకు గైర్హాజరైతే ఇప్పుడు రాయవచ్చని పేర్కొన్నారు. ఇంటర్ ఒకేషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 5నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 2,395 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,501 మంది హాజరవుతారని చెప్పారు.

11 నుంచి సైన్స్ ప్రాక్టికల్ పరీక్షలు

ఇంటర్ జనరల్ కోర్సుల్లో ఎంపీసీ, బైపీసీ చదువుతున్న సెకండియర్ విద్యార్థులకు ఫిబ్రవరి 11 నుంచి 20వరకు ప్రతిరోజు రెండు సెషన్లలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐఓ తెలిపారు. 50మందికిపైగా సైన్స్ విద్యార్థులు ఉన్న కళాశాలల్లోనే పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారని, జిల్లాలో 93 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. 50మందిలోపు విద్యార్థులు ఉన్న కళాశాలల వారిని సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో సైన్స్ ప్రాక్టికల్ పరీక్షలకు మొత్తం 13,827మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు.

మార్చి 1 నుంచి థియరీ పరీక్షలు

ఇంటర్ జనరల్ విద్యార్థులకు మార్చి 1 నుంచి 20వరకు థియరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సైమన్ విక్టర్ తెలిపారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని, 69 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు టాస్క్‌ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ప్రత్యేకాధికారిగా నియమితులైన ఇంటర్మీడియెట్ అధికారి ఐ.శ్రీనివాసరావు, జిల్లా పరీక్షల బోర్డు కామన్ సభ్యులు కె.ఆంజనేయులు, కె.స్వరూపరాణి, జి.మనోహర్‌రెడ్డిలు పలు సూచనలు చేశారు.

వెలుగులోకి ప్రాచీన శాసనం

కాయస్థ గంగయ సాహిణి శాసనం లభ్యం



గంగయ సాహిణి శాసనం

ఎర్రగొండపాలెం, జనవరి 30 : మండలంలోని బోయలపల్లి ఎగువ చెరువు తూము వద్ద 12వ శతాబ్దపు కాయస్థ గంగయ సాహిణి ప్రాచీన శాసనం లభ్యమైంది. కాకతీయుల కాలం నాటి శాసనంగా చరిత్ర పరిశోధకులు దీన్ని గుర్తించారు. బోయలపల్లి శివాలయం వెనుకవైపు ఉన్న ఎగువచెరువు అలుగు వద్ద ఆదివారం నాడు చారిత్రక పరిశోధకులు శ్రీనివాసప్రసాద్ తమ బృందంతో ఈ ప్రాచీన శాసన చిత్రాలను సేకరించి ఆర్కియాలజి డైరెక్టరు మునిరత్నంరెడ్డికి పంపించారు. ఆ శాసనంలోని వివరాల ప్రకారం.. 'శ్రీ మన్మండలేశ్వర, బాహత్తరి అనే దేశాధిపతి, కదన ప్రచండ గణపతిదేవ మహారాజుగారి సామంతరాజు మంత్రి గండపెండారు, గంగయసాహిణి గారు ప్రతి శ.క సంవత్సరం(1172 నుంచి 1250)నాడు తనకు తన తల్లిదండ్రులకు, గణపతిదేవ మహారాజు(1199 - 1262) పుణ్యంగా మకరసంక్రాంతి కాలాన త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరస్వామికి అంగరంగ వైభోగాలకు, నైవేద్యం కోసం దువ్వలి కంపనంలోని రెడ్లపల్లి పొలం, బోయలపల్లి అనే ఊరు సకల ఆదాయ సహితంగా దానం చేశారు' అని లిఖించి ఉంది. గంగయసాహిణి(1239- 1262) కాకతీయ సామంతరాజు కాయస్థ వంశానికి చెందిన వాడిగా తెలుస్తోంది. వీరి మేనళ్లులు అంబక్షాపతి, కుమారులైన జన్నిగదేవుడు, త్రిపురారిదేవుడు, అంబదేవుడు కూడా ఈ ప్రాంతాన్ని పాలించారని శాసనం ద్వారా తెలుస్తోంది. గంగయ సా హిణి కొచ్చర్లకోట రాజధానిగా తమ పరిపాలన సాగించారు. ఇదే మం డలం అయ్యంబొట్లపల్లి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఇటీవల గంగయ సాహిణి శాసనం లభించింది. దీనిని బట్టి గంగయ సాహిణి ఆనాడు ఈ ప్రాంతంలో ఎక్కువ ప్రాభవం కలిగి ఉండి ఉంటాడని తెలుస్తోంది. ఈ శాసనం గుర్తింపులో గ్రామ వీఆర్వో బాలగురవయ్య, కె.జయరాజు, వీఆర్వో గోపిశెట్టి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆరుగురు తహసీల్దార్ల ఉద్యోగ విరమణకు ఆమోదం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 30 : జిల్లాలో 2024 సంవత్సరంలో ఆరుగురు తహసీలార్ల ఉద్యోగ విరమణకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. 2024లో ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు చేరిన తహసీల్దార్లు, తహసీల్దార్ కేడర్ సూపరిటెండెంట్లు ఉద్యోగ విరమణకు అనుమతి ఇచ్చారు. అయితే సర్వీసులో ఉన్నప్పుడు వచ్చిన క్రమశిక్షణ చర్యలు, విచారణలు ఎదుర్కోవాల్సిందేనని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వేటపాలెం తహసీల్దార్ యు.అశోక్‌వర్ధన్ ఈనెల 31న, యద్దనపూడి తహసీల్దార్‌గా పనిచేస్తూ సెలవులో ఉన్న బి.వెంకటరెడ్డి మార్చి 31న, తాళ్ళూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న కేవీ.ప్రసాద్, మర్రిపూడి తహసీల్దార్‌గా పనిచేస్తూ సస్పెండైన సీహెచ్.కృష్ణారావు, దోర్నాల తహసీల్దార్ ఎ.వేణుగోపాలరావు, కొనకనమిట్ల తహసీల్దార్ బీఆర్ఎల్‌వి.ప్రసాద్‌లు జూన్ 30న రిటైర్డ్ కానున్నారు.

వేధింపులకు పరాకాష్ఠ

వైసీపీ రౌడీలతో కలిసి మైనింగ్ అధికారుల తనిఖీలు

టీడీపీ సానుభూతిపరుల క్వారీలు, ఫ్యాక్టరీలే లక్ష్యం

కారుల్లో కర్రలు, కారప్పొడితో హల్‌చల్

దీటుగా ఎదుర్కొని పోలీసులకు అప్పజెప్పిన ఎమ్మెల్యే ఏలూరి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాజకీయంగా ప్రత్యర్థి పార్టీల నాయకులను, సానుభూతిపరులపై వేధింపులలో అధికార వైసీపీ ప్రభుత్వం అండగా సాగించే చర్యలు పరాకాష్ఠకు చేరాయి. అందుకు మంగళవారం పర్చూరు నియోజకవర్గం మార్టూరు, బల్లికురవ మండలాల్లో టీడీపీ మద్దతుదారుల గ్రానైట్ క్వారీలను లక్ష్యంగా చేసుకుని మైనింగ్ అధికారులు సాగించిన దాడులు, వారికి అండగా వైసీపీ గూండాలు రంగంలోకి రావటం దర్పణం పడుతోంది. గత ఎన్నికల్లో అధికారంలోకి రాగానే జగన్ ప్రభుత్వం వేధింపుల చర్యలకు శ్రీకారం పలికిన విషయం తెలిసిందే. జిల్లాలో తెలుగుదేశం పార్టీ వైపునున్న నాయకుల గ్రానైట్ క్వారీలను తొలుత లక్ష్యంగా ఎంచుకుంది. అనంతరం వైసీపీలో చేరిన చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, వారి అనుచరుల క్వారీలను వదిలేసి టీడీపీతోనే ఉన్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు క్వారీలపై దాడులు కొనసాగించారు. వారి క్వారీలు, ఫ్యాక్టరీలు మూతపడేలా చేశారు. నిన్నటికి నిన్న తాము నియమించిన ఇన్‌చార్జికి సహకరించటం లేదన్న కోపంతో వైసీపీలోనే ఉన్న అద్దంకి మాజీ ఎమ్మెల్యే గరటయ్య కుమారుడు, శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య క్వారీలపై దాడులు చేసి గ్రానైట్ ఉత్పత్తుల అమ్మకాలను నిలిపివేశారు. భారీ జరిమానా వేసేందుకు రంగం సిద్ధం చేశారు. తాజాగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై అక్రమ కేసులు బనాయించారు. పర్చూరులో ఓటమి తప్పదని భావించిన వైసీపీ అంతటితో ఆగకుండా మంగళవారం ఆ నియోజకవర్గానికి చెందిన టీడీపీ మద్దతు గ్రానైట్ వ్యాపారుల క్వారీలపై దాడులు చేపట్టారు. దాడులను కూడా వైసీపీ గూండాల ఆధ్వర్యంలో చేయటం విశేషం. దాడుల నిర్వహణకు వచ్చిన కృష్ణా జిల్లా మైనింగ్ ఏడీ ప్రతాపరెడ్డి వైసీపీ నాయకులు ఏర్పాటుచేసిన కారులో వచ్చారు. ఆ కారులో ఆయనతోపాటు వైసీపీ గూండాలు ఉన్నారు. అంతకుమించి కర్రలు, కారంపొడి ఉండటం విశేషం. విషయం తెలుసుకున్న గ్రానైట్ వ్యాపారులందరూ పార్టీరహితంగా ఒక్కటై దాడులను ఎదుర్కొనేందుకు రంగంలోకి వచ్చారు. వారిపై గూండాలు దౌర్జన్యం చేశారు. అంతలోనే ఎమ్మెల్యే ఏలూరి తన అనుచరులతో అక్కడికి చేరి వైసీపీ నేతల గూండాగిరిని అడ్డుకున్నారు. అంతేగాక ప్రైవేటు గూండాలతో రంగంలోకి వచ్చిన అధికారులను నిలదీసి ప్రశ్నించారు. ప్రైవేటు గూండాలను అక్కడికొచ్చిన జనం పట్టుకున్నారు. ఆ తర్వాత పోలీసులను పిలిపించి కారులో లభ్యమైన కర్రలు, కారం పొడిని, ఇతర మారణాయుధాలను, గూండాలను వారి వాహనాలలో వచ్చిన అధికారులను కూడా అప్పగించారు. దీంతో దౌర్జన్యంగా సాగించబోయిన దాడుల దందాకు తాత్కాలికంగా బ్రేక్ పడినా ఏదోవిధంగా టీడీపీ మద్దతుదారుల క్వారీలను మూసివేయించేందుకు వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించవచ్చునని భావిస్తున్నారు. తదనుగుణంగా న్యాయపోరాటానికి టీడీపీ నేతలు సిద్ధమవుతున్నారు.

ఏసీబీకి చిక్కిన వైద్యశాఖ అధికారులు

రూ.1.40 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

మలేరియా విభాగంలోని ఇరువురు అరెస్టు : డీఎస్పీ



ఏసీబీకి దొరికిన శ్రీనివాసరావు



మలేరియా జిల్లా అధికారి జ్ఞానశ్రీ

ఒంగోలు(క్రైం), జనవరి 30: వైద్యశాఖలోని మలేరియా విభాగంలో పనిచేస్తున్న ఇరువురు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఆ విభాగంలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్‌కు ప్రభుత్వం నుంచి వచ్చిన అరియర్స్ బిల్లు చేసేందుకు రూ.1.40లక్షలు లంచం డిమాండ్ చేసి ఆ డబ్బులు తీసుకుంటూ ఒంగోలులో మలేరియా విభాగం జిల్లా అధికారి జ్ఞానశ్రీ, అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసరావు అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికిపోయారు. వివరాల్లోకి వెళితే.. దోర్నాలలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఇబ్రాయిల్‌కు 2015 నుంచి 2021 వరకు పీఆర్సీ అరియర్స్ రూ.16,86,103 ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అయితే ఆ మొత్తం బిల్లు ఇచ్చేందుకు జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ అందులో 25శాతం తనకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో హైకోర్టును ఆశ్రయించిన ఇబ్రాయిల్‌కు వెంటనే పీఆర్‌సీ బకాయి చెల్లించాలని ఆదేశాలిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ మేరకు మలేరియా శాఖ ఆర్‌జేడీ, జిల్లా అధికారి జ్ఞానశ్రీని వివరణ కోరారు. అంతేకాకుండా వెంటనే ఇబ్రాయిల్‌కు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లును మంజూరుచేయాలని ఆదేశించారు. అయినప్పటికి జ్ఞానశ్రీ మొండిపట్టు విడవలేదు. ఇబ్రాయిల్‌ను పిలిపించి మీకు వచ్చే నగదులో 25శాతం అంటే రూ.4లక్షలు ఇవ్వాలని తేల్చిచెప్పారు. అలాగైతేనే బిల్లు చేస్తామని తెలిపారు. అయితే తాను అంత ఇవ్వలేనని రూ.1.40 లక్షలె ఇస్తానని ఇబ్రాయిల్ చెప్పారు. దీంతో అందుకు జ్ఞానశ్రీ ఒప్పుకున్నారు. కాగా కోర్టు ఆదేశాలు ఇచ్చినా తనకు రావాల్సిన అరియర్స్ ఇవ్వడానికి లంచం డిమాండ్ చేయడం ఏమిటని ఇబ్రాయిల్ నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

పట్టుబడింది ఇలా..

ఇబ్రాయిల్‌కు రావాల్సిన పీఆర్‌సీ బకాయి రూ.16,86,103 అతని ఖాతాలో జమైంది. ఆ తర్వాత తనకు ఇస్తానన్నా డబ్బులు ఇవ్వాలని జ్ఞానశ్రీ డిమాండ్ చేయడం ప్రారంభించింది. దీంతో ముందుగా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసిన ఇబ్రాయిల్ బుధవారం డబ్బులిస్తానని జ్ఞానశ్రీకి ఫోన్ చేశారు. దీంతో అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసరావును పంపిస్తున్నానని, అతనికి ఇవ్వమని ఆమె తెలిపారు. ఈ మేరకు ప్రకాశం భవన్ ఎదురుగా ఉన్న కోఆపరేటివ్ జనరల్ స్టోర్ వద్దకు రమ్మని ఇబ్రాయిల్‌కు చెప్పిన శ్రీనివాసరావు అక్కడ వేచి ఉన్నారు. ఇబ్రాయిల్ వెళ్లి నగదు ఇస్తుండగా అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తన సిబ్బందితో వచ్చి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. జిల్లా అధికారి జ్ఞానశ్రీ నగదు తెమ్మని చెప్పగా తీసుకున్నానని శ్రీనివాసరావు వారికి తెలిపారు. దీంతో ఏ.జ్ఞానశ్రీ, శ్రీనివాసరావులను అరెస్టు చేసి నెల్లూరు కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తెలిపారు.

రెగ్యులర్ పేరుతో మామూళ్లు

ఒక్కొక్కరి నుంచి రూ.10వేల వరకు వసూలు

పై స్థాయిలో ఇవ్వాలని ఉద్యోగులు ఒత్తిడి

వైద్యారోగ్య శాఖలో ఇదీ వ్యవహారం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 30: వైద్యారోగ్యశాఖలో 2014కు ముందు నుంచి పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేసేందుకు చర్యలు తీసుకోవడంతో కొందరు ఉద్యోగులు దీనిని ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. శాఖలో పనిచేస్తున్న సుమారు 182 మంది ఉద్యోగులు ప్రస్తుతం రెగ్యులర్ అయ్యే అవకాశం ఉంది. అందుకు వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. దీంతో రెగ్యులర్ ప్రతిపాదనల్లో ఉన్న వారిని మభ్యపెట్టి మామూళ్ల వసూలు చేసే ప్రక్రియకు కొందరు కీలక ఉద్యోగులు శ్రీకారం చుట్టారు. 49 మంది ఏఎన్ఎంలు, 103మంది హెల్త్ అసిస్టెంట్లు, 21మంది ల్యాబ్ టెక్నిషియన్లు, 11మంది ఫార్మాసిస్టులు, ఒకరు పీఎంఓఓ రెగ్యులర్‌కు అర్హత ఉంది. దీంతో వారందరి ప్రతిపాదనలను రూపొందించి ప్రభుత్వానికి పంపాల్సి ఉంది. ఇదే అదనుగా కొంత మంది దళారులు రంగప్రవేశం చేసి రెగ్యులరయ్యే సిబ్బంది నుంచి డబ్బులు వసూలు చేసేందుకు పన్నాగం పన్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.10వేలకుపైనే రాబట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అందుకు ఆయా అసోసియేషన్లపై వత్తిడి పెంచినట్లు సమాచారం. కొంత మంది ఉద్యోగులు మామూళ్లు ఇచ్చేందుకు నిరాకరించినట్లు సమాచారం, అయినా వదిలిపెట్టకుండా అలాంటి వారి వద్ద కనీసం రూ.5వేలు ఇవ్వాలనే ప్రతిపాదనలు కూడా పెట్టినట్లు తెలిసింది. రెగ్యులర్ చేసేందుకు పైస్థాయిలో కూడా కొంత ముట్టజెప్పాల్సి ఉందని, తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని వత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. సుదీర్ఘ కాలం పాటు వైద్యశాఖలో పనిచేసి ప్రస్తుతం రెగ్యులర్ అయ్యేందుకు అవకాశం వచ్చిన తరుణంలో తమను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు ఉన్నతాధికారులు ఎలాంటి మాముళ్లు ఇవ్వొద్దని బహిరంగంగా చెప్తున్నా కొంత మంది అదేపనిగా డబ్బుల కోసం పట్టుపడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని మాముళ్ల వసూలు వ్యవహారాన్ని అరికట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

మంత్రి కోసం పడిగాపులు

ఎండలోనే విద్యార్థినుల ఎదురుచూపులు

మూడున్నర గంటలు ఆలస్యంగా కార్యక్రమం

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



ఎండలో గంటల తరబడి నిల్చుని నీరసం వచ్చి చెట్టు నీడకు చేరుకున్న విద్యార్థినులు

కొండపి, జనవరి 30 : స్టడీ మెటీరియల్ పంపిణీ పేరుతో మంగళవారం కొండపిలో మంత్రి సురేష్ చేపట్టిన కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు నరకం చూశారు. 3.30 గంటలపాటు పడిగాపులు కాశారు. మూత్ర విసర్జనకు కూడా అవకాశం లేక అల్లాడిపోయారు. కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక కామేపల్లి రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం కావాల్సి ఉంది. దీంతో ఆ సమయానికి మూడు మండలాల నుంచి దాదాపు 900 మంది విద్యార్థులు, 40 మంది ఉపాధ్యాయులు, ఆరుగురు ఎంఈవోలు అక్కడికి చేరుకున్నారు. అయితే మధ్యాహ్నం 1.30 గంటల వరకూ మంత్రి రాలేదు. అప్పటి వరకూ ఆయన కోసం విద్యార్థులు ఎదురు చూడాల్సి వచ్చింది. మంత్రి సురేష్ రాగానే పూలు చల్లేందుకు కల్యాణమండపం ముఖద్వారం వద్ద దాదాపు 30మందిని ఎండలోనే నిల్చోబెట్టారు. వారు అర్ధగంటసేపు ఉండి ఎండ తీవ్రతకు తట్టుకోలేక పక్కకు వెళ్లిపోయారు. దీంతో మరో 30 మందిని తిరిగి ఎండలో ఉపాధ్యాయులు నిల్చోబెట్టారు. అలా 100 మందిని మార్చారు. ఎట్టకేలకు మధ్యాహ్నం 1.30 గంటలకు మంత్రి రావడంతో విద్యార్థినులు ఊపిరి పీల్చుకున్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

స్టడీ మెటీరియల్ పంపిణీకి ముందు మాట్లాడిన మంత్రి సురేష్ పరీక్షలను ఒత్తిడి లేకుండా రాసి అత్యధిక మార్కులు సాధించాలని కోరారు. అదేవిధంగా విద్యారంగ అభివృద్ధికి కృషి చేసిన జగన్‌కు విద్యార్థులంతా తమ ఇళ్లలోని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు చెప్పి ఓట్లేయించాలని కోరారు. అనంతరం కొందరు విద్యార్థులకు ఆయన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మిగిలిన వారికి తర్వాత అందజేస్తారని చెప్పారు. కార్యక్రమానికి ముందుగా మహాత్మా గాంధీ, సరస్వతీదేవి చిత్ర పటాలకు నాయకులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో డీఈవో సుబ్బారావు, జడ్పీటీసీ సభ్యులు మారెడ్డి అరుణకుమారి, బెజవాడ వెంకటేశ్వర్లు, చినకండ్లగుంట సర్పంచ్ షేక్ వన్నూరు, వైసీపీ మండల అధ్యక్షుడు ఆరికట్ల కోట్లింగయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ గొట్టిపాటి మురళి, వైసీపీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ మునీర్ బాషా, ఎస్సీసెల్ మండల నాయకుడు గర్నెపూడి రమేష్ పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మంత్రి సురేష్

3,4 తేదీల్లో రాష్ట్ర మహాసభలు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 30 : అఖిల భారత రైతు-కూలీ సంఘం రాష్ట్ర పదో మహాసభలు వచ్చేనెల 3,4వ తేదీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా గురజాలలో జరుగుతాయని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఒంగోలులోని సీపీఐ(న్యూడెమోక్రసి) కార్యాలయంలో మంగళవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. రైతులు పండించిన పంటలకు దిట్టుబాటు ధరలు కల్పించాలని, రైతు కూలీల హక్కుల కోసం పోరాడుతున్న సంఘం తమదేనని ఆయన తెలిపారు. ఈ మహాసభలకు రైతులు, రైతు కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చొప్పర జాలన్న, వి.రామ్మోహన్‌రెడ్డి, కోడూరి హనుమంతరావు, సుబ్బయ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఫ్యాక్టరీలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గ్రానైట్ ఫ్యాక్టరీలో విజిలెన్స్ తనిఖీలు

బల్లికురవ, జనవరి 30: మండలంలోని వేమవరం వద్ద ఉన్న హరగాయత్రి గ్రానైట్ ఫ్యాక్టరీలో మంగళవారం మచిలీపట్నం నుంచి వచ్చిన మైనింగ్ విజిలెన్స్ ఏడీ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో తనఖీలు నిర్వహించారు. టీడీపీకి చెందిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అనుచరుని గ్రానైట్ ఫ్యాక్టరీ అయినందున తనిఖీలు చేసినట్లు తెలుస్తుంది. గ్రానైట్ ఫ్యాక్టరీలో స్టాకు నిల్వలు, కొలతలు తీసినట్లు తెలుస్తుంది. తనిఖీలు ఎందుకు చేస్తున్నరన్న విషయం వెల్లడించేందుకు అధికారులు నిరాకరించటం పలు అనుమానాలకు తావిస్తుంది. మరోమారు తనిఖీలకు వస్తామని చెప్పి వెనుతిరిగారు. విజిలెన్స్ అధికారుల తనిఖీలతో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులలో ఆందోళన నెలకొంది. టీడీపీ వర్గీయులను టార్గెట్‌గా విజిలెన్స్ అధికారుల చేత వైసీపీ నేతలు దాడులు చేయిస్తున్నారని పలువురు గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు ఆరోపిస్తున్నారు. అన్ని ఫ్యాక్టరీలను తనిఖీ చేయకుండా టీడీపీ సానుభూతిపరుల ఫ్యాక్టరీలనే టార్గెట్‌గా దాడులు చేయటం వెనుక వేధింపులకు గురిచేయటమేనని పలువురు ఆరోపిస్తున్నారు.

గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాలు

- ప్రారంభమైన రవాణా
- సీనరేజ్ తగ్గించినా భవన నిర్మాణదారులకు చేరేసరికి అదే ధర
- వైసీపీ నేతల తీరుపై పెదవి విరుపు



అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లు



గుండ్లకమ్మ నదిలో ఇసుకను ట్రాక్టర్‌కు లోడింగ్ చేస్తున్న కూలీలు

అద్దంకి, జనవరి 30: కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా వైసీపీ నేతల తీరు ఉందని పలువురు భవనాల నిర్మాణదారులు పెదవి విరుస్తున్నారు. అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది నుండి గత నాలుగు నెలలుగా ఇసుక రవాణా నిలిపివేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త కాంట్రాక్టర్ ఇసుక సీనరేజ్ వసూలు ప్రారంభించినప్పటి నుంచి గుండ్లకమ్మ నది నుంచి ఇసుక రవాణా నిలిపివేశారు. గతంలో సైతం అద్దంకి సమీపంలో గుండ్లకమ్మ నది నుంచి ఇసుక రవాణాకు అధికారిక రీచ్ లేకపోయినప్పటికీ ఇసుక తవ్వకాలు మాత్రం యథావిధిగా సాగాయి. అనంతరం కూడా అదే పంథాలో కొనసాగించేందుకు కొత్త కాంట్రాక్ట్ పొందిన కార్పొరేట్ సంస్థ ప్రయత్నాలు ప్రారంభించినప్పటికి ప్రజలలో ఇసుక సీనరేజ్ వసూలు పట్ల ఉన్న వ్యతిరేఖత ను పొగొట్టాలని స్థానిక వైసీపీ నేతలు సీనరేజ్ వసూలుకు ససేమిరా అన్నారు. దీంతో ఇసుక రవాణా పూర్తిగా నిలిచిపోయింది. కొత్తగా ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన హనిమిరెడ్డి సైతం ఖచ్చితంగా సీనరేజ్ లేకుండా ఇసుక రవాణాకు అనుమతులు ఇప్పిస్తానని స్థానిక వైసీపీ నేతలకు హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే, టెండర్ సంస్థ మాత్రం ససేమిరా అనటంతో పాటు తగ్గించేందుకు కూడా నిరాకరించినట్లు సమాచారం. ఈక్రమంలో ఇసుక కష్టాలు మరింత పెరిగాయి.

నిబంధనల మేరకు ట్రాక్టర్ ఇసుక లోడింగ్‌తో సహా రూ.1950 సీనరేజ్‌గా చెల్లించాల్సి ఉంది. అయితే, గుండ్లకమ్మ నదిలో ఇసుకను కూలీల ద్వారా జల్లెడ పట్టించి రవాణా చేస్తుంటారు. ఈక్రమంలో సీనరేజ్ సంస్థకు లోడింగ్‌తో పని ఉండదు. దానిప్రకారం రూ.1450 మాత్రమే తీసుకోవాలి. ఇసుక సీనరేజ్ వసూలు ప్రారంభించిన ప్రారంభంలో రెండువేల రూపాయలు ఉండగా, అనంతరం రూ.1800 సీనరేజ్ వసూలు చేశారు. మంగళవారం నుంచి ఇసుక రవాణా ప్రారంభం కాగా, రూ.1400 వసూలు చేసేలా చర్చలు సఫలమైనట్టు తెలుస్తుంది. రూ.1800 సీనరేజ్ వసూలు చేసినప్పుడు, ఇప్పుడు రూ.1400కు తగ్గించినా అద్దంకి పట్టణంలోకి ట్రాక్టర్ ఇసుక ధర మాత్రం రూ.3300 నుంచి రూ.3500గానే ఉండటం విశేషం. సీనరేజ్ రూ.400 తగ్గించామని వైసీపీ నేతలు చెప్పుకుంటుండగా, కొనుగోలు దారునికి గతంతో పోల్చితే మూడు వేల రూపాయలకే చేరాల్సి ఉంది.

అయినప్పటికీ మంగళవారం నుంచి ఇసుక రవాణా దారులు కూడా రూ.3500 చొప్పున వసూలు చేయటం మరింత విమర్శలకు తావిస్తుంది. నాలుగు నెలల పాటు ఇసుక రవాణా జరగకుండా నిలిపివేసి చివరకు ఒరిగింది శూన్యమన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

మార్టూరు ఘటనలో పరస్పర ఫిర్యాదులు

మార్టూరు, జనవరి 30: కృష్ణా జిల్లా విజిలెన్స్ ఏడీ ప్రతాప్ రెడ్డి ప్రయివేటు వ్యక్తులతో వచ్చి బెదిరిస్తూ గ్రానైట్ పరిశ్రమ యజమానులకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మంగళవారం రాత్రి మార్టూరు పోలీస్ స్టేషన్‌లో మార్టూరు గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్, అనంత గ్రానైట్ పరిశ్రమ యజమాని విడివిడిగా ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం నాగరాజుపల్లి రోడ్డులో ఉన్న అనంత గ్రానైట్‌లో నెల్లూరు విజిలెన్స్ ఏడీ బాలాజీ నాయక్ తనిఖీలు చేశారు. గ్రానైట్ పరిశ్రమలలో ఉన్న ఇబ్బందులను గ్రానైట్ పరిశ్రమ యజమాని కామినేని జనార్దన్‌తో పాటు, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్ వివరించారు. ఆసమయంలో కృష్ణా జిల్లా ఏడీ ప్రతాప్ రెడ్డి, వైజాగ్ ప్రాంతం వైసీపీకి చెందిన కె.శ్రీనివాసరావు ఉరఫ్ వాసుతో అక్కడికి ప్రయివేటు వాహనంలో వచ్చారు. గ్రానైట్ పరిశ్రమల యజమానులు లక్షల రూపాయలు ఇవ్వకపోతే కేసులు పెడతామని, తాను అధికార పార్టీకి చెందిన వాడినని కె.శ్రీనివాసరావు పరిశ్రమల యజమానులను డిమాండ్ చేశారు. ఈవిషయంపై యజమానులు సమాచారం అందించడంతో అక్కడికివచ్చిన టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఏడీ ప్రతాప్‌రెడ్డితో తనిఖీలకు అనుమతులు ఎవరిచ్చారనే విషయంపై ప్రశ్నించారు. ఈక్రమంలో కె.శ్రీనివాసరావు ఎమ్మెల్యేతో దురుసుగా మాట్లాడారు. మొదట తాను వైజాగ్ ఏడీనని, తరువాత ఏడీ కారు డ్రైవర్‌నని చెప్పారు. దీనిపై ఏడీని అడుగగా శ్రీనివాసరావు తన స్నేహితుడని చెప్పారు. ఈవిషయమై మార్టూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి కె.శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. అతను వచ్చిన కారును తనిఖీ చేయగా అందులో కర్రలు, కారం పొట్లాలు ఉన్నాయన్నారు. కారు నంబరు ప్లేటు కూడా లేకుండా కేవలం ఒక నంబరు స్టిక్కరు ఏర్పాటు చేశారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమను డబ్బుకోసం భయభ్రాంతులకు గురిచేసిన ఏడీ ప్రతాప్ రెడ్డి, వైసీపీకి చెందిన కె.శ్రీనివాసరావు నుంచి తమకు ఇబ్బంది లేకుండా చూడాలని, తమకు న్యాయం చేయాలని వారు తమ ఫిర్యాదు లో పేర్కొన్నారు. గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్‌తో పాటు పలువురు గ్రానైట్ పరిశ్రమ యజమానులు ఆయన ఇచ్చిన ఫిర్యాదులో మద్దతుగా తమ సంతకాలు పెట్టారు.

విధులకు ఆటంకం కలిగించారని విజిలెన్స్ ఏడీ ఫిర్యాదు

అనంత గ్రానైట్ పరిశ్రమలో తనిఖీలకు వచ్చిన తమ విధులకు ఆటంకం కలిగించారని నెల్లూరు విజిలెన్సు ఏడీ బాలాజీ నాయక్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, పరిశ్రమ యజమానితో పాటు మరో ఏడుగురు వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సుప్రీంకోర్టు తీర్పు వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టు

అద్దంకి, జనవరి 30: అధికార గర్వంతో జగన్‌రెడ్డి అండ్ కో పెట్టిన కేసులు తప్పుడివి అని సుప్రీంకోర్టు తీర్పుతో వెల్లడైందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈమేరకు మంగళవారం ఓప్రకటన విడుదలచేశారు. చంద్రబాబునాయుడు బెయిల్‌ను రద్దు చేయాలని ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్ళిందన్నారు. సుప్రీంకోర్టు ప్రభుత్వానికి చివాట్లు పెట్టిందన్నారు. ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి, జగన్ కు బుద్ధిరావాలన్నారు. ప్రతిపక్ష నాయకుల మీద తప్పుడు కేసులు పెడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర ప్రజలు చంద్రబాబునాయుడు వెంటే ఉన్నారని చెప్పారు. వందల కోట్లు ఖర్చు పెట్టి సుప్రీంకోర్టుకు వెళ్ళినా భంగపడ్డారన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను రా.. కదలిరా ద్వారా చంద్రబాబునాయుడు ఎత్తి చూపించారన్నారు. టీడీపీకి 5 కోట్ల ప్రజలే స్టార్ క్యాంపైనర్లు అని రవికుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువయ్యాయన్నారు. జగన్‌రెడ్డి తన ఓటమిని ఇప్పటికే ఒప్పుకున్నారన్నారు. ఒకప్పుడు వైనాట్ 175 అన్న వ్యక్తి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఓడిపోయినా తప్పులేదని అని వాస్తవాన్ని గ్రహించారన్నారు. జగన్ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. జగన్‌రెడ్డి చెత్త పరిపాలనతో రాష్ట్రం రూ.13 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయేది తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వమని, అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు.

అభివృద్ధిలో ముందుందాం



మాట్లాడుతున్న కరణం వెంకటేష్, పక్కన ఎమ్మెల్యే బలరాం తదితరులు

వేటపాలెం(చీరాల), జనవరి 29: అభివృద్ధిలో ముందుందాం.. సత్ఫలితాలు సాధిద్దామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో నూతనంగా రూ.5.60 కోట్లతో నిర్మించిన సచివాలయం 1,2, రైతు భరోసా కేంద్రం, ఆర్‌డబ్ల్యూఎస్, సీసీ రోడ్లను మంగళవారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోగలిగామన్నారు. ఇతర అవసరాలకు సంబంధించి ప్రాధాన్యతాక్రమంలో అన్నింటిని పరిష్కరిస్తామన్నారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 18 మంది లబ్ధిదారులకు నివేశనస్థలాల పట్టాలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌వర్ధన్, ఎంపీడీవో నేతాజీ, ఏవో కాశీవిశ్వనాధ్, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, సర్పంచ్ కె.రమణ, ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, లేళ్ల శ్రీధర్, బొడ్డు సుబ్బారావు, గవిని వెంకట్రావు, ఆతిన వెంకట్రావు, పులి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాయపడటం అభినందనీయం

చీరాల, జనవరి 29: విద్యార్థులు చదువుకునేందుకు ప్రోత్సాహకంగా స్కాలర్‌షిప్ రూపేణా ఆర్థికసాయం అందించటం అభినందనీయమని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో మంగళవారం చీరాల, పేరాల పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నాయీబ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ, నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, డాక్టర్ హైమా సుబ్బారావు, డాక్టర్ తాడివలస దేవరాజ్ తదితరులు సంఘసేవలను వివరించారు.

కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మాచవరపు వెంకటేశ్వర్లు, వల్లూరి వెంకటస్వామి, ఆతిన బోసుబాబు, కలవకూరి సుబ్బారావు, వల్లూరి శ్రీనివాస్, శ్రీను, బి.పున్నారావు, కలవకూరి బాలశంకర్, మేడిశెట్టి సత్యనారాయణ, కొరవడ సత్యనారాయణ, పట్నాల శివ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- బాధిత కుటుంబసభ్యులను ఓదార్చిన భువనేశ్వరి



సింగారావు భార్య పార్వతికి రూ.3లక్షల చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి. పక్కన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, విజయకుమార్

చిననందిపాడు(పర్చూరు), జనవరి 30: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి మంగళవారం పర్చూరు నియోజకవర్గంలో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను తట్టుకోలేక మృతి చెందిన పర్చూరు మండలం చిననందిపాడు గ్రామానికి చెందిన పార్టీ అభిమాని ముప్పా సింగారావు నివాసానికి వెళ్ళి కుటుంబసభ్యులను పరామర్శించారు. భువనేశ్వరి చూసి సింగారావు భార్య ముప్పా పార్వతి, తల్లి మస్తానమ్మ కన్నీటిపర్యంతమయ్యారు. పార్వతి కన్నీటిని తుడుస్తూ భువనేశ్వరి ఓదార్చారు. అధైర్యపడొద్దు.. పార్టీ అండగా ఉంటుందని కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. కుటుంబసభ్యుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీకి వీరాభిమానిగా ఉండేవారని, చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను తట్టుకోలేక తల్లడిల్లిపోయాడని భువనేశ్వరి వద్ద భర్త గోడును వివరించింది. తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని కాలినడకన తిరుపతి కూడా వెళ్ళాలని పలుమార్లు తనవద్ద ప్రస్తావించినట్టు చెప్పారు. మృతుని తల్లి మస్తానమ్మ ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకుని పరామర్శించారు. మృతుని కుమార్తెలు హిమబిందు, కళ్యాణిల కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతుని భార్యకు రూ.3లక్షల చెక్‌ను నారా భువనేశ్వరి మృతుని భార్య పార్వతికి అందజేశారు.



యద్దనపూడిలో మృతుని కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న భువనేశ్వరి

తదనంతరం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్దఎత్తున గ్రామానికి చేరుకున్న మహిళలు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిజం గెలవాలి.. నిజమే గెలవాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, ఎమ్మెల్సీ అనూరాధ, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఉషారాణి, సర్పంచ్ ముప్పా వెంకటశివరావు, మండలపార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పూరిమెట్ల జయమ్మ, రాయపాటి సంధ్య, జరుగుమల్లి సంధ్య, సరోజిని, యార్లగడ్డ లక్ష్మీ, పుల్లెల పద్మ, దూళిపల్లి వెంకటస్వామి, కోడూరి శేషబ్రహ్మాచారి, మానం హరిబాబు, మక్కెన శేఖర్, నాయకులు పోట్రు శోభన్, కొల్లా శ్రీనివాసరావు, పోపూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం యద్దనపూడి మండల కేంద్రంలో మృతిచెందిన టెక్కెం నాగేశ్వరరావు నివాసానికి వెళ్ళి మృతుని భార్య దేవునిదయ, కుమార్తెలు, హారిక, వెంకటరత్నంను భువనేశ్వరి పరామర్శించారు. కుటుంబ పరిస్థితులను ఆమె అడిగి తెలుసుకున్నారు. మృతుని పెద్ద కుమార్తెకు వివాహం కాగా, చిన్నకుమార్తె డిగ్రీ చదువుతుండగా తండ్రి మృతి చెందటంతో చదువును నిలిపి వేసినట్టు తెలిపారు. దీనిపై భువనేశ్వరి స్పందిస్తూ చదువుకు కావల్సిన సహకారాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మృతుని భార్యకు రూ.3లక్షల చెక్కును ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో భువనేశ్వరి అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నల్లపనేని రంగయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని ఆశయాలు అందరికీ ఆదర్శం

పంగులూరు, జనవరి 30: జాతిపిత మహాత్మా గాంధీ ఆచరించిన శాంతి, అహింస మార్గాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయని రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ప్రతినిధులు చిలుకూరి వీరరాఘవయ్య, కాలేషావలి అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పంగులూరులోని రోటరీక్లబ్ ప్రాంగణంలో మహాత్ముని విగ్రహానికి క్లబ్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఆర్వీ సుబ్బారావు, గుర్రం ఆంజనేయులు, జేకేసీ, పోలిశెట్టి సీతారామయ్య, ఎనికపాటి శ్రీను, గుడిపూడి రామారావు పాల్గొన్నారు.



పంగులూరులో మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రోటరీ ప్రతినిధులు

గాంధీజీ అహింసామార్గం అనుసరణీయం

చీరాల, జనవరి 29: జాతిపిత మహాత్మాగాంధీ సూచించిన అహింసామార్గం అందరికి అనుసరణీయమని పలు పార్టీలు, సంఘాల ప్రతినిధులు అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పలుచోట్ల గాంధీ విగ్రహాలకు, ఆయన చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. స్థానిక నల్లగాంధీ, తెల్లగాంధీ విగ్రహాలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య, ఇతర నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ గాంధీ ఆలోచనను ప్రతిఒక్కరూ అనుసరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేటపాలెం సచివాలయం ప్రాంగణంలో గాంధీ విగ్రహానికి పట్టభద్రుల సంఘం ప్రతినిధులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ వేటపాలెం వచ్చిననాటి సంఘటనను మననం చేశారు. స్థానిక సారస్వత నికేతనం గ్రంథాలయంలో గాంధీ చేతికర్రను నేటికి గుర్తుగా భద్రపరిచారన్నారు. కార్యక్రమంలో పట్టభద్రుల సంఘం ప్రతినిధులు ప్రత్తి వెంకటసుబ్బారావు, కోటిస్వామి గుప్తా, రావి మస్తాన్‌రెడ్డి, చుండూరు రవి, సచివాలయం-2 సెక్రటరీ శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో.. అద్దంకిటౌన్, జనవరి 30: మహత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం వాసవి క్లబ్, వాసవి క్లబ్ వనితా అద్దంకి ఆధ్వర్యంలో పాత గాంధీ బొమ్మ సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో వాసవి ఐఈసీ ఆఫీసర్ ఊ టుకూరి ఉమాఅన్నపూర్ణ, వాసవి క్లబ్ అధ్యక్షుడు వుడుత్తు వెంకట ఆదినారాయణ, కార్యదర్శి పాపరావు, అనిల్ కుమార్, వనితా క్లబ్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, సెక్రటరీ అంజలి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో.. చినగంజాం, జనవరి 30: మండలంలో మహాత్మాగాంధీ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి మందిరంలో మండల ఆర్యవైశ్య సంఘం, వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కోట శివరామకృష్ణ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.




చీరాలలో నల్లగాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు కొండయ్య, తదితరులు

కార్యక్రమంలో బయ్యా జ్యోతి, వలివేటి నాగజ్యోతి, మోటుమర్రి శేషకుమారి, అమరా సుబ్రమణ్యం, గెల్లి లక్ష్మీనారాయణ, పి.పవన్ కుమార్, అమరా శ్రీనివాసులు, వలివేటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మైనింగ్ మాఫియా

- కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొట్టారు
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, జనవరి 30: ఐదేళ్లుగా రాష్ట్రంలో మైనింగ్ మాఫియాను నడుపుతూ కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొట్టిన ఏపీ స్టేట్ డీఎంజీ డి.వెకటరెడ్డిపై కేసు నమోదు చేయాలని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు డిమాండు చేశారు. మంగళవారం ఉదయం మార్టూరులో తెలుగుదేశం పార్టీ నాయకుడు కామినేని జనార్దన్‌కు చెందిన అనంత గ్రానైట్ పరిశ్రమలో నెల్లూరు, కృష్ణాజిల్లా విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రానైట్ పరిశ్రమలో విజిలెన్స్ అధికారులతో మాట్లాడిన అనంతరం ఏలూరి సాంబశివరావు విలేకరులతో మాట్లాడారు. అధికారులను అడ్డం పెట్టుకొని, ప్రవేటు వ్యక్తులతో గ్రానైట్ పరిశ్ర మల యజమానులను ప్రత్యక్షంగా, పరోక్షంగా బెదిరించి మామూళ్లు వసూలు చేసిన డీఎంజీపై విచారణ చేపట్టాలన్నారు. మైనింగ్ విజిలెన్స్ అధికారులతో గ్రానైట్ పరిశ్రమలపై తనిఖీలు పేరుతో యజమానులను బ్లాక్ మెయిలింగ్‌చేసి కోట్లాది రూపాయలు వసూలు చేశారన్నారు.

మార్టూరు, బల్లికురవ, చీమకుర్తి, ప్రకాశం జిల్లాలో పేరుగాంచిన గ్రానైట్ పరిశ్రమను నిర్వీ ర్యం చేసి ఎంతోమందికి ఉపాధిని కల్పించిన గ్రానైట్ పరిశ్రమను అధికార పార్టనాయకులు తమ స్వార్థానికి ఉపయోగించుకొని కోట్లాది రూపాయలు వసూలు చేశారన్నారు. మార్టూరు ప్రాంతంలో పందిళ్లపల్లికి చెందిన 50 మంది యువకులు రోజూ గ్రానైట్ వసూళ్లు చేపడుతున్నారన్నారు. గ్రానైట్ పరిశ్రమను బతికించుకోవాలన్నారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, అధికారులు వైసీపీ నేతలకు తలొగ్గి తప్పుడు పనులు చేస్తే తగిన గుణపాఠం చెప్పే సమయం త్వరలోనే ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి హెచ్చరించారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



శనగ పంటను పరిశీలిస్తున్న డాట్ శాస్త్రవేత్త డాక్టర్ ఓబయ్య, తదితరులు

వేమదరవెంట్ల, జనవరి 30: మండలంలోని ధైవాలరావూరులో ఎండిపోతున్న శనగ పంటను వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, డాట్ శాస్త్రవేత ఎం. ఓబయ్య పరిశీలించారు. మంగళవారం ఎండిపోతున్న శనగను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కోలెట్రోట్రైకం అనే శిలింద్రం వల్ల పంట ఎండిపోతున్నట్లు ఓబయ్య తెలిపారు. భూమిలో కర్బన శాతం లోపించినప్పుడు ఈ తెగులు వస్తుందని చెప్పారు. సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల తెగుళ్లను నివారించవచ్చునని చెప్పారు. విత్తనశుద్ధిని తప్పనిసరిగా చేయాలన్నారు. పంట మార్పిడి చేసుకోవాలన్నారు. తొలకరిలో పచ్చిరొట్ట ఎరువులయిన జీలుగా, జనుము, పిల్లిపెసర వంటి పంటలను సాగుచేసి భూమిలో దున్నివేయడం వలన కర్బన శాతం పెరుగుతుందన్నారు. పంట వేసిన 40, 45 రోజులకు లీటర్ నీటికి బావిష్టన్2 గ్రాములు కలిసి పిచికారి చేయడం వలన తెగుళ్లను నివారించువచ్చునని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత డాక్టర్ జె.రాధకృష్ణ, వీఏఏ ప్రత్యూష, రై తులు పాల్గొన్నారు.

డీపీటీవో వైఖరిపై నిరసన

అద్దంకిటౌన్, జనవరి 30: అద్దంకి ఆర్టీసీ డిపోలో మంగళవారం ఎస్ఎంయూఏ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మికుల పట్ల విశాఖపట్నం డీపీటీవో తన వైఖరి మార్చుకోవాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని డిపో సెక్రటరీ అనపర్తి వందనంబాబు హెచ్చరించారు. డిపో అభివృద్ధిలో భాగమైన కార్మికుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం డిపోకే నష్టమని అన్నారు. కార్యక్రమంలో డీఎంఎస్ మన్యం, కె.భానుప్రకాష్, ఎం.అంజి, ఎన్‌కే రావు, తదితరులు పాల్గొన్నారు.

ఖజానా కార్యాలయం తనిఖీ

అద్దంకిటౌన్, జనవరి 30: అద్దంకి ఉప ఖజానా కార్యాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం జిల్లా ఉపఖజానాధికారిణి శివకామేశ్వరి తనిఖీ చేశారు. ఈసందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి పలుసూచనలు చేశారు. ఈసందర్భంగా శివకామేశ్వరిని అద్దంకి తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు గద్దల కిరణ్‌కుమార్, కార్యదర్శి తాళ్ళూరి రమేష్‌బాబు, జి. ఏడుకొండలు, కె. రవికుమార్, కార్యవర్గ సభ్యులు కలిసి అభినందించారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

చీరాలటౌన్, జనవరి 30: మండల పరిధిలోని కొత్తపాలెం పంచాయతీ శ్రీనివాస కాలనీ పరిధిలోని ఎస్టీ కాలనీలో సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఎం నాయకుడు వసంతరావు డిమాండ్ చేశారు. గ్రామంలో ఓ వ్యక్తి సెల్ టవర్ నిర్మాణానికి పూనుకోవడంతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి ప్రదర్శనగా వచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు ఇప్పటికే పలు అనారోగాల బారినపడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. ఈక్రమంలో సెల్‌టవర్ రేడియేషన్ ప్రభావంతో మరింత ఇబ్బందులు చోటుచేసుకుంటాయన్నారు. ఈ కారణంగా నిర్మాణాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రభాకరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు వబ్బాని, దుర్గా ప్రసాద్, ఈగా వెంకటేశ్వరమ్మ, లక్ష్మీ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించకుంటే చర్యలు

చీరాలటౌన్, జనవరి 30: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు సహకరించకుంటే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆటోడ్రైవర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో వ్యాపార సముదాయాలు అధికంగా ఉండటంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉన్నట్లు వివరించారు. దీనికితోడు ఆటో డ్రైవర్‌లు నిర్దేశించిన ప్రదేశాల్లో కాకుండా ఇష్టారీతిగా ఆటోలు పార్కింగ్‌లు చేస్తున్నట్లు చెప్పారు. ఈక్రమంలో ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ జరగాలంటే ఆటోడ్రైవర్‌లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై గోపి, ఏఎస్సై శ్రీనివాసరావు, కానిస్టేబుల్ స్టీఫెన్, ఆటో డ్రైవర్‌లు పాల్గొన్నారు.

మండల పరిషత్ నిధులు కేటాయించరా!

మార్టూరు, జనవరి 30: మండల పరిషత్ నిధులు తమ గ్రామాల అభివృద్ధికి కేటాయించాలని పలువురు ఎంపీటీసీలు పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీశారు. సమావేశానికి ఎంపీపీ భుక్యా శాంతి బాబు అధ్యక్షత వహించారు. గ్రామాలను అభివృద్ధి చేయడానికి మండల పరిషత్ నిధులు తమకు కేటాయించడం లేదని, దాంతో గెలిపించిన ప్రజానీకానికి ఏం సమాధానం చెప్పాలని పలువురు ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు.

ఈవిషయమై మరోసారి ప్రత్యేకంగా ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేస్తామని ఎంపీడీవో నితిన్ చెప్పారు. నాగరాజుపల్లి బీసీ కాలనీలో రెండు వీధుల్లో మురుగు కాల్వల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ దాసరి నరేంద్రబాబు కోరారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి, ఎంఈవో వస్రాం నాయక్, విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు, వ్యవసాయ ఏవో వీరగంధం అశోక్‌కుమార్, ఉద్యాన అధికారి హనుమంత నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సంతమాగులూరు, జనవరి 30: మండలంలోని ఏల్చూరు పంచాయతీ రామిరెడ్డిపాలెం గ్రామంలో అక్రమంగా విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మద్యం బాటిళ్లను సంతమాగులూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత కొంతకాలంగా రామిరెడ్డిపాలెంలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న అక్రమ మద్యంపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. మంగళవారం తనికీలు నిర్వహించి అక్రమంగా విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న 248 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ

అద్దంకి, జనవరి 30: అద్దంకిలో తాళం వేసిఉన్న ఇంట్లో చోరి జరిగి సుమారు రూ.3.50 లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ కు గురయింది. పోలీసుల కథనం మేరకు .. అద్దంకి పట్టణంలోని విశ్వభారతి కళాశాల రోడ్డులో సెల్ టవర్ సమీపంలో దేసు శివ నాగరమేష్ కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం ఒడిస్సాలోని పూరి జగన్నాథస్వామి దైవదర్శనంకు వెళ్ళారు. మంగళవారం ఉదయం తీర్థయాత్రలు ముగించుకొని ఇంటికి రాగా, మెయిన్ ద్వారం తాళం పగులగొట్టి ఉంది. బీరువా తాళాలు అక్కడే ఉండటంతో దొంగలకు చోరీ సులువైంది. బీరువాలో ఉన్న రూ.70 వేల నగదుతో పాటు 14 సవర్ల బంగారం ఆభర ణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. సంఘటనాస్థలాన్ని సీఐ కృష్ణయ్య, ఎస్సై వెంకటేశ్వర్లు పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, ఫింగర్ ప్రింట్స్ బృందం పరిశీలించారు.

373 మందికి వైద్య పరీక్షలు

పంగలూరు, జనవరి 30: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు చేపట్టినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శివచెన్నయ్య, డాక్టర్ రాజరాజేశ్వరి అన్నారు. మండలంలోని తూర్పుకొప్పెరపాడు గ్రామంలో మంగళవారం ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 373 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కృష్ణకుమార్, సూపర్‌వైజర్ మదర్‌షా, హరిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాతి మండపం పునర్నిర్మాణ పనుల పరిశీలన

అద్దంకి, జనవరి 30: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం పునర్నిర్మాణ పనులను రాష్ట్ర దేవాదాయ స్థపతి పరమేశ్వరప్ప మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనులు పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈవో సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు సంఘీభావం తెలిపిన వైసీపీ నేత

అద్దంకి, జనవరి 30: శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ డైరెక్టర్, అద్దంకి పంచాయతీ మాజీ వార్డు మెంబర్, వైసీపీ నేత ఆకుల కోటేశ్వరరావు మంగళవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను కలిశారు. జొన్నతాళిలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి సంఘీభావం తెలిపారు.

రామనామ సంకీర్తనతో మనస్సు ప్రశాంతం

పర్చూరు, జనవరి 30: రామనామ సంకీర్తనతో మనస్సు ప్రశాంతత పొందుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ అన్నారు. పర్చూరులోని వైజంక్షన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన 92 అడుగుల అభయాంజనేయస్వామివారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. గర్వం తొలగించే హనుమంతుడు అనే అంశంపై వివరణాత్మక సందేశం ఇచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- ఎన్నికల సీజన్ కోసం నాయకుల పాకులాట
- ధరల పెరుగుదలతో బయటి మద్యంవైపే మొగ్గు
- ఇప్పటికీ జిల్లావాసులను భయపెడుతున్న గోవా మందు
- నాటి ఘటనలతో అనేక కుటుంబాలు చిన్నాభిన్నం
- ఇప్పుడూ అదే పరిస్థితి వస్తుందేమోనని దిగులు

పొరుగు మద్యం పెరుగుతోంది!



నెల్లూరు (క్రైం), జనవరి 30 : రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల హడావుడి మొదలైంది. ప్రధాన పార్టీలన్నీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోగా, ప్రజలను ఆకర్షించేం దుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగా ప్రధానంగా కొంతమంది నాయకులు మద్యంపైనే దృష్టి సారించారని తెలుస్తోంది. కోడ్ రాకముందే పొరుగు మద్యంను జిల్లా కు దిగుమతి చేసుకుని రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే జరిగితే 2014 నాటి ఘటనలే పునరావృతం అవుతాయనే భయం జిల్లావాసుల్లో నెలకొంది.

● అప్పుడేం జరిగిందంటే..

2014, ఎన్నికల సమయంలో జిల్లాలో ఎక్స్‌కవేటర్లతో భూమిలో తవ్వేకొద్దీ ఇతర రాష్ట్రాల మద్యం సీసాలు బయట పడ్డాయి. ఆ మద్యం సేవించి ప్రాణాలు కోల్పోయిన వారు, అప్పటి నాయకులపై కేసుల నమోదు, విచారణ బాధ్యతను సీబీడీకి అప్పగించడం వంటి సంఘటనలు జరిగాయి.

● రెండేళ్ల కిందట గోవా మద్యం నిల్వలు

2022, మార్చి నెలలో గోవాకు చెందిన వేల క్వార్టర్ మద్యం సీసాలను సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. గోవాకు చెందిన చీప్ మద్యంను జిల్లాకు దిగుమతి చేసుకొని ఆ సీసాలపై ప్రభుత్వ మద్యం సీసాల లేబుళ్లను అతికించి ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనే విక్రయిం చారు. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గోవా మద్యం సీసాలను అధికారులు స్వాధీనం చేసుకొని పలువురిని అరెస్ట్ చేశారు. రాజకీయ నాయకుల అండదండలతో ఇదంతా చేశారన్న ప్రచారం అప్పట్లో గుప్పుమంది. రెండేళ్ల కిందటే వేల మద్యం సీసాలను గోవా నుంచి జిల్లాకు దిగుమతి చేసిన ఘనులు ప్రస్తుత ఎన్నికల సీజనులో చీప్ మద్యాన్ని జిల్లాకు తీసుకురావడం పెద్ద పనేమీ కాదని అందరూ చర్చించుకుంటున్నారు.

● కోడ్ అమల్లోకి వస్తే..

సహజంగా ఎన్నికల కోడ్ వస్తే ఎక్సైజ్ అధికారులు దుకాణాలు, బార్లలో మద్యం విక్రయాలపై నిబంధనలు అమల్లోకి తెస్తా రు. గతేడాది ఇదే సీజనులో ఆయా దుకా ణాలు, బార్లలో ఎంతమద్యం కొనుగోలు చేశారో లెక్కలు చూసుకొని ఆ ప్రకారమే డిపో నుంచి మద్యం అందిస్తారు. దీంతో పలువురు నాయకులు ఇప్పటి నుంచే మద్యం కొనుగోలు చేసి నిల్వలు చేస్తున్నారని తెలుస్తోంది.

● కమీషన్ లేక, ధరలు పెరగడం

గతంలో ప్రైవేటు వైన్స్, బార్లు ఉన్న సమయంలో మద్యం అమ్మకాలపై యజమానులకు 11 శాతం వరకు కమీషన్ ఉండేది. అంటే డిపో నుంచి ఇక లక్ష రూపాయలకు మద్యం కొనుగోలు చేస్తే రూ.11 వేలు కమీషన్ ఉండేది. ఎన్నికల సీజనులో పలు పార్టీలకు చెందిన నాయ కులు ప్రైవేటు వైన్ షాపులు, బార్ల యాజ మాన్యంతో ఉన్న పరిచయాలతో డిపో నుంచి మద్యంను కొనుగోలు చేయించి ఎన్నికల కోసం వినియోగించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పడటం, బార్ల యజమానులకు కమీషన్ పూర్తిగా ఎత్తేయ డంతో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసే అవకాశం నాయకులకు లేకుండా పోయింది. మరోవైపు గత ఎన్నికల సమయంలో క్వార్టర్ బాటిల్ రూ.80 ఉంటే ప్రస్తుతం రూ.200లకు పైగా ఉంది. ఇతర రాష్ట్రాల్లో మద్యం ధరలు తక్కు వగా ఉండటంతో అక్కడి నుం చే వివిధ మార్గాల ద్వారా మద్యం తెచ్చుకునేందుకు విఫలయత్నం చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రభుత్వ మద్య దుకాణల్లో విధులు నిర్వహించే సిబ్బంది నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ప్రతి దుకాణంపై ప్రత్యేక నిఘా ఉంచాము. ఎవరు తప్పు చేసినా శిక్ష తప్పదు. కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత గతేడాది ఆ నెలలో జరిగిన సేల్స్ ఆధారంగా దుకాణాలకు, బార్లకు స్టాక్ ఇవ్వడం జరుగుతుంది.

- కె నాగమల్లేశ్వరరెడ్డి, ఎక్సైజ్ ఈఎస్



మహాత్ముడికి ఘన నివాళి

జాతిపిత మహాత్మా గాంధీకి కలెక్టర్ హరినారాయణన్ ఘన నివాళి అర్పించారు. మంగళవారం గాంధీ వర్ధంతి సందర్భంగా నగరంలోని కలెక్టరేట్‌లో ఆయన ఫొటోకు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

- నెల్లూరు (హరనాథపురం)

నేటి నుంచి నారా భువనేశ్వరి పర్యటన

- 'నిజం గెలవాలి' నినాదంతో ప్రజల ముందుకు..
- చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన వారి కుటుంబాలకు ఓదార్పు



నెల్లూరు, జనవరి 30 (ఆంధ్రప్రదేశ్) : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును సహించలేక మనోవేదనతో తనువు చాలించిన అభిమానుల కుటుంబాలను ఓదార్చేందుకు నందమూరి తారక రామారావు కుమార్తె, చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం సాయంత్రం జిల్లాకు రానున్నారు. మూడు రోజులపాటు జిల్లాలోనే ఆమె పర్యటిస్తూ బాధితుల కుటుంబాలకు తామున్నామంటూ భరోసా ఇవ్వనున్నారు. ఓ వైపు బాధిత కుటుంబాలను పరామర్శించడంతోపాటు రాష్ట్ర రాజకీయాలు, పరిపాలనలో జరుగుతున్న అక్రమాలను ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో వారిని సత్యం వైపు నిలిచేలా, నిజమైన ప్రజా సేవకులు గెలిచేలా 'నిజం గెలవాలి' పేరిట చైతన్య పరచనున్నారు.

● బుధవారం సాయంత్రం 5.35 గంటలకు ఉలవపాడు మండలం టెంకాయచెట్లపాలెం గ్రామంలో వయ్యాల సుధాకర్ రావు కుటుంబాన్ని, 6.30 గంటలకు ఉలవపాడు మండలం ఆత్మకూరులో యండ్లూరి చిన్నకోటయ్య కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శిస్తారు. ఆ రాత్రి ఆళ్వారి కల్యాణ మండంలో రాత్రి బస చేస్తారు.

● 1వ తేది ఉదయం 9.40 గంటలకు గుడ్లూరులో కర్పూరపు సుబ్రహ్మణ్యం, 10.45 గంటలకు దార్కనిపాడు గ్రామంలో దగ్గుమాటి వెంకటేశ్వర్లు కుటుంబాలను పరామర్శిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కొండాపురం మండలం కొమ్మి గ్రామంలో తాటిపర్తి సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించి నెల్లూరుకు చేరుకుంటారు. సాయంత్రం 3.35 గంటలకు 29వ డివిజన్‌కు చెంన రేగల వెంకయ్య, 41వ డివిజన్ మూలాపేట పోల సుబ్బారావు కుటుంబాలను పరామర్శిస్తారు. అనంతరం 4.50 గంటలకు జొన్నవాడ కామాక్షితాయి ఆలయాన్ని సందర్శిస్తారు. 2వ తేది ఉదయం 10.20 గంటలకు ఆత్మకూరు మండలం అల్లీపురంలో కముజుల ఆంజనేయరెడ్డి, 11.55 గంటలకు కలువాయిలో బొల్లిగార్ల చిన్నయ్య, మధ్యాహ్నం 2 గంటలకు రాపూరు మండలం సనయపాలెంలో సన్నిబోయిన కృష్ణయ్య కుటుంబాలను భువనేశ్వరి పరామర్శిస్తారు. ఆ తర్వాత 3.50 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు.



ఆందోళన చేస్తున్న బీటీఏ నేతలు

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

● కలెక్టరేట్ ఎదుట బీటీఏ ఆందోళన


నెల్లూరు (విద్య), జనవరి 30 : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీటీఏ నేతలు డిమాండ్ చేశారు. మంగళ వారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్య క్షుడు పల్లం వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ విధానాలను అవలంబిస్తూ ఉపాధ్యాయుల ప్రయోజనాలను గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం బీటీఏ చేపట్టిన మూడుదశల పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 5న విజయవాడలో జరిగే మహాధర్నాకు తరలిరావా లని కోరారు. కార్యక్రమంలో బీటీఏ వ్యవస్థాపకుడు నూకలపాటి రమ ణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీ లక్ష్మయ్య, కార్యదర్శులు బ్రహ్మయ్య, రఘు, తిరుపతయ్య, జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు, కార్యదర్శి మాసా ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి యూటీఎఫ్ రిలే నిరాహార దీక్షలు

ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నుంచి ఫిబ్రవరి 3వతేదీ వరకు కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు వీవీ శేషులు, జీవీ చలపతి శర్మ ఓ ప్రకట నలో పేర్కొన్నారు. యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కందుకూరు వైసీపీ అభ్యర్థిత్వంపై
అధిష్ఠానం మల్లగుల్లాలు

- జీసీ అభ్యర్థివైపే మొగ్గు?
- కందుకూరుపై మనసు మార్చుకున్న బుర్రా?
- టికెట్‌పై ధీమాగా ఎమ్మెల్యే మహీధరరెడ్డి
- కావలి, కందుకూరు పార్టీ బాధ్యతలు 'చెవిరెడ్డి'కి



కందుకూరు, జనవరి 30: కందుకూరు వైసీపీ అభ్యర్థిత్వంపై అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతోంది. సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి స్థానంలో బీసీ అభ్యర్థిని బరిలోకి దించాలన్న ఆలోచనతో పలువురు అభ్యర్థుల పేర్లను అధిష్ఠానం పరిశీలించిన విషయం తెలిసిందే. అయితే, వారెవరూ ఆర్థిక, అంగబలం కలవారు కాదన్న నిర్ధారణకు వచ్చిన అధిష్ఠానం కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను కందుకూరులో పోటీకి సిద్ధపడాలని సూచించిన విషయం తెలిసిందే. అయితే మొదట్లో కనిగిరి ఇస్తే పోటీ చేస్తా లేకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టంగా చెప్పిన బుర్రా ఆ తర్వాత మనసు మార్చుకున్నట్లు తెలిసింది. 4, 5 రోజులుగా విజయవాడలో మకాం వేసి కనిగిరి అభ్యర్థిత్వం కోసం తుదిప్రయత్నాలు చేసుకుంటూ కందుకూరు ఆప్షన్‌ను కూడా పరిగణలోకి తీసుకుంటున్నట్లు తెలిసింది. అంతేగాక 2, 3 రోజులుగా కందుకూరు నియోజకవర్గంలో తన బంధువులు, సన్నిహితులతో కందుకూరు నుంచి పోటీ చేస్తే ఎలా ఉంటుందని ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం జరిగిన కీలక పరిణామాలు కందుకూరులో అభ్యర్థిని మార్చాలన్న అధిష్ఠానం ఆలోచనలో ఎలాంటి మార్పురాలేదన్న సంకేతాలు వెలువడ్డాయి. నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలను చూస్తున్న రీజనల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని తప్పించి ఆ బాధ్యతలను చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి జగన్ అప్పగించినట్లు తెలిసింది. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డిని ఖరారు చేసిన జగన్ ఆ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు కందుకూరు, కావలి నియోజకవర్గాల పార్టీ బాధ్యతలను కూడా చెవిరెడ్డికి అప్పగించినట్లు తెలిసింది. కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డి విషయంలో జగన్ ఆలోచనలకు అనుగుణంగా వ్యవహరించకుండా విజయసాయి పని చేస్తుండటమే ఈ మార్పునకు కారణంగా భావిస్తున్నారు. పార్టీ పరిశీలకునే మార్చటానికి జగన్ సిద్ధపడినందున ఆయన బీసీ అభ్యర్థిత్వం విషయంలో ధృఢమైన నిర్ణయంతో ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. అయితే మహీధరరెడ్డి మాత్రం కందుకూరు టికెట్ విషయంలో ధీమాగా ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అయితే వైసీపీ అధిష్ఠానం వేగంగా పావులు కదుపుతున్న నేపథ్యంలో రానున్న రెండు రోజుల్లో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.

గ్రేడ్-1 వీఆర్వోలకు ఉద్యోగోన్నతి

● తాత్కాలిక ఎస్ఏలుగా నియామకం



వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డితో పదోన్నతి పొందిన వీఆర్వోలు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 30 : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 13 మంది గ్రేడ్-1 వీఆర్వోలకు తాత్కాలిక సీనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కలెక్టర్ హరినారాయణన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చేవూరు అమరావతి, ఆత్మకూరు ప్రసాద్, నిజమాల తిరుపతయ్య, కుల్లూరు జనార్దన్‌రావు, దాసరి హనుమంతయ్య, కర్రా రామయ్య, సీహెచ్ వెంకటేశ్వర శర్మ, కే పుల్లయ్య, పీ రవిబాబు, షేక్ రహంతుల్లా, గునుపాటి మురళీకృష్ణ, మడపర్తి శ్రీనివాసులు, ఏవీవీ ప్రసాదరావు తదితరులు ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఉన్నారు. వీరు వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు పంట అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

- డిమాండ్ల సాధన కోసం ఉద్యమం
- వచ్చే నెల 5న విజయవాడలో ఆమరణ దీక్ష

సర్పంచుల సమర శంఖం

నెల్లూరు (హరనాథపురం), జనవరి 30 : తమ డిమాండ్ల సాధన కోసం వచ్చే నెల 5వ తేదీన విజయవాడలో ఆమరణ దీక్షకు సర్పంచులు సిద్ధమవుతున్నారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించినా, సర్పంచులకు ప్రజాప్రతినిధులన్న కనీస గౌరవం ఈ ప్రభుత్వంలో లేకుండా పోయింది. జగన్ ప్రభుత్వం ఎన్నో విధాలుగా సర్పంచులను ఇబ్బందులకు గురిచేసినా, ఉత్సవ విగ్రహాలుగా మార్చే సినా భరిస్తూ వచ్చారు. ఇదిచాలదన్నట్లు పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి నిధులు ఇవ్వకపోగా 14, 15 ఆర్థిక సంఘాల నుంచి వచ్చే నగదునూ జగన్ ప్రభుత్వం లాగేసుకుంది. ఇప్పటివరకు రూ.3వేలకోట్లకు పైబడి దారి మళ్లిందని సర్పంచులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు లేక ప్రజల ముందు తలెత్తుకోలేక తీవ్ర అవమాన భారాన్ని మోశారు. గ్రామ సచివాలయాల ఏర్పాటు తరువాత వారికి కనీస విలువ లేకుండా పోయింది. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పెత్తనం కూడా వీరిపై ఎక్కువయ్యింది. ఇలా అనేక అవమాన భారంతో రగిలిపోతున్న సర్పంచులు ప్రభుత్వంపై సమరశంఖం పూరించారు.

డిమాండ్లు ఇవే :



● 2018 నుంచి 2020-22 వరకు కేంద్ర ప్రభుత్వం పంపిన రూ.8,629 కోట్ల 14, 15 ఆర్థిక సంఘం నిధులను తక్షణమే పంచాయతీల ఖాతాలకు జమచేయలి. అలాగే 2022-23 ఆర్థిక సంవత్సరానికి 2024 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రావాల్సిన రూ.2031 కోట్ల కేంద్ర ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేయాలి.

● గ్రామ సచివాలయాలను, వలంటీర్లను గ్రామ పంచాయతీలలో విలీనం చేసి సర్పంచుల ఆధ్వర్యంలోనే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరపాలి.

● సర్పంచులు, ఎమ్పీటీసీ సభ్యుల గౌరవ వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.15వేలకు పెంచాలి.

● జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను పంచాయతీలకు ఇచ్చి గ్రామసభల తీర్మానం ద్వారా సర్పంచుల ఆధ్వర్యంలో పనులు చేయించాలి.

● కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్‌జీవన్ మిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను కేటాయించి వెంటనే ఆ పథకం పనులను గ్రామాల్లో ప్రారంభించాలి.

● మైనర్ పంచాయతీలకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలి.

● 2019 నుంచి 2023 వరకు మైనింగ్ సెస్, ఇసుకలో వాటా నిధులు, రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రొఫెషనల్ టాక్సు ఎంటర్‌టైన్‌మెంటు టాక్సు, నీటి తీరువా తదితరాల నిధులను పంచాయతీలకు విడుదల చేయాలి.

● పంచాయతీల సొంత నిధులు, ఆర్థిక సంఘం నిధుల నుంచి విద్యుత్ బకాయిలు వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోను రద్దు చేయాలి.

● పంచాయతీల సొంత నిధులపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఫ్రీజింగ్ ఆంక్షలు ఎత్తివేయాలి.

● 5వ ఆర్థిక సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి దాని సిఫార్సుల మేరకు గ్రామ పంచాయతీలకు తక్షణమే నిధులు విడుదల చేయాలి.

● ఒక్కో సచివాలయ పరిధిలో అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలకు కేటాయిస్తున్న రూ.20 లక్షలను పంచాయతీలకు ఇచ్చి, పంచాయతీల తీర్మా నం ప్రకారం పనులు చేయించాలి.

● కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్ర ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన అన్ని రకాల నిధులను బకాయిలతో సహా సర్పంచుల పీఎఫ్ఎంఎఫ్ ఖాతాల్లో జమచేయాలి. తదితర డిమాండ్ల సాధన కోసం సర్పంచులు ఉద్యమం చేపడుతున్నారు.

మా డిమాండ్లు నెరవేర్చాలి



ఇప్పటికే పలు రకాలు గా నిరసన కార్యక్రమాలు చేపట్టాం. మంగళవారం నెల్లూరులోని గాంధీ బొమ్మ వద్ద నిరసన దీక్ష చేపట్టాం. ప్రభుత్వం మా డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి. లేకుంటే 5వ తేదీన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో ఆమరణ దీక్షకు పూనుకుంటాం.

- కందమూడి శివకుమార్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం

మా నిధులు మాకివ్వండి!

● గాంధీబొమ్మ వద్ద సర్పంచుల నిరసన దీక్ష



సర్పంచుల దీక్షకు మద్దతు తెలిపిన టీడీపీ నేతలు అజీజ్, చేజర్ల తదితరులు

నెల్లూరు (జడ్పీ), జనవరి 30: పంచాయతీలకు చట్టబద్ధంగా రావాల్సిన నిధులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర సర్పంచుల సంఘం, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద సర్పంచులు నిరసనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేవిరెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని మండిపడ్డారు. గ్రామ స్వరాజ్యంపై గాంధీజీ కన్నకలలు నిజం చేయడం కోసం నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీలకు ప్రత్యేకాధికారాలు కల్పించారన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు 14-15 ఆర్థిక సంఘాల ద్వారా విడుదలైన రూ.8,600 కోట్లను దారి మళ్లించి, తమ అవసరాలకు వాడుకున్నదని మండిపడ్డారు. ప్రజల నుంచి ఎన్నుకున్న సర్పంచులు నిధుల కొరతతో చిన్న పనులు కూడా చేయలేని పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దొంగలింగచిన పంచాయతీ సొమ్మును తిరిగి ఇప్పించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నేరుగా పంచాయతల ఖాతాలకే నిధులు జమచేస్తామని కేంద్రం చెప్పిందని, అయితే ఈ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం బేఖాతరు ఆదేశాలు జారీ చేయడం మంచిదికాదన్నారు.

● టీడీపీ, జనసేనల మద్దతు

సర్పంచుల ఆందోళనకు టీడీపీ, జనసేన నాయకులు మద్దతు తెలిపి, దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ నామమాత్రంగా గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసిన సీఎం జగన్ సర్పంచ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని అపహాస్యం చేస్తూ సర్పంచుల అధికారాలను, విధులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. దీక్షలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, సర్పంచులు కవిత, పద్మయ్య, మురళీ కృష్ణారెడ్డి, పావని, టీకే శ్రీనివాస్, వెంకట్మేర్లు నాయుడు, వెంకటేశ్వ ర్లురాజు, గోపిరెడ్డివెంకట్, కలవకోలు మునేష్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సంగం మండల సమావేశం

సంగం, జనవరి 30: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గత సమావేశంలో వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ వంటి పలు శాఖలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వివరించారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతుండగా జెండాదిబ్బ సర్పంచు పద్మావతి కల్పించుకుని గత సమావేవంలో సభ దృష్టికి తెచ్చిన విద్యుత్ స్తంభాల సమస్యను ఇంత వరకు పరిష్కరించలేదని అన్నారు. సమస్యలు పరిష్కరించని సభలు, సమీక్షలు ఎందుకని నిలదీశారు. అన్ని శాఖల గురించి చర్చిస్తున్నారు, కానీ మండల పరిషత్ నిధుల వినియోగంపై సమీక్ష చేయడం లేదని వెంగారెడ్డిపాళెం సర్పంచు ఆనం ప్రసాద్‌రెడ్డి ఎంపీడీవో గోపీని ప్రశ్నించారు. దీంతో ఆయన మండల పరిషత్ నిధులతో చేపట్టిన పనులను గ్రామాల వారీగా వివరించారు. సుమారు రూ. 34 లక్షలతో సీసీ డ్రైన్‌లు చేపట్టినట్లు వివరించారు. అనంతరం తహసీల్దారు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ నిధుల వినియోగంపై ప్రశ్నిస్తున్న సర్పంచు ఆనం ప్రసాద్‌రెడ్డి

జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు : బొల్లినేని

ఉదయగిరి రూరల్, జనవరి 30: ఇన్నర్‌రింగ్ రోడ్డు కేసులో సుప్రీంకోర్టు తీర్పు సీఎం జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ సీఎం చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒక్కటైన ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. జగన్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర ప్రజలు చంద్రబాబు వెంటే ఉన్నారని ఆయన తెలిపారు.

జైభారత్ నేషనల్ పార్టీకి ఓ అవకాశం ఇవ్వండి

సీతారామపురం, జనవరి 30 : జై భారత్ నేషనల్ పార్టీకి ప్రజలు ఒక అవకాశం ఇవ్వాలని ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పాళ్ల శ్రీరామరాజు తెనిపారు. మంగళవారం సీతారామపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్నీ పార్టీలకు అవకాశం ఇచ్చేనట్టే తమకు అవకాశం ఇవ్వాలన్నారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో పార్టీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ళ రామరాజు, కొండమూరి శ్రీనివాస్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తికి వినతి

ఉదయగిరి రూరల్, జనవరి 30: అసంపూర్తిగా ఉన్న ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని మంగళవారం సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, కొండకిందపల్లి గ్రామాల ప్రజలతో కలిసి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అటవీ అనుమతులు లేక దశాబ్దాలుగా నిలిచిన ఘాట్‌రోడ్డు నిర్మాణం వల్ల 16 గ్రామాల్లోని వేలాదిమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. స్పందించిన ఆయన త్వరలో రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

దివ్యాంగులకు బస్సు పాస్‌ల పంపిణీ

కావలి, జనవరి 30: సక్షం సంస్థ ఆధ్వర్యంలో కావలి ఆర్టీసీ డిపోలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు దివ్యాంగులు వారి సహాయకులకు రాయితీ బస్సుపాస్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ (ట్రాఫిక్) మేనేజరు కేవీఆర్ బాబు, రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, సక్షం సంస్థ కావలి ప్రతినిధులు నాగమణి, తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆమనిచిరువెళ్లలో వైద్యశిబిరం

అనంతసాగరం, జనవరి 30: మండలంలోని ఆమనిచిరువెళ్లలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి ఆధ్వర్యంలో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం స్పర్శకుష్టు వ్యాధిపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రావు, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

ఉదయగిరి రూరల్, జనవరి 30: మండలంలోని అప్పసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాలకు మంగళవారం ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి రూ.10 వేలు విరాళం అందజేశారు. పాఠశాల పురోభివృద్ధికి ఈ నగదును హెచ్‌ఎం. టీ.విజయకుమార్‌కు అందజేశారు.

పాఠశాలలో బోరు ఏర్పాటు

వింజమూరు, జనవరి 30: పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీ పాఠశాలలో మంగళవారం బోరు ఏర్పాటు చేశారు. ఎంపీపీ ఐ.మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచి ఎన్.సుజన, వీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ బోరును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కల్పన, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.వరప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, నాయకులు బీ జయంత్‌రెడ్డి, జూపల్లి రాజారావు, భోజనపు గోపి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

కావలి-కడప బస్సు కొనసాగించాలి

ఉదయగిరి : ఉదయగిరి మీదుగా నడుస్తున్న కావలి-కడప బస్సును కొనసాగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. కొన్నేళ్లుగా కావలి డిపోకు చెందిన కడప బస్సు వయా ఉదయగిరి మీదుగా ఉండేది. ఇటీవల కావలి డిపోవారు ఆ సర్వీసును దుత్తలూరు, నందిపాడు మీదుగా కడపకు నడుపుతున్నారు. బస్సును అర్ధంతరంగా రద్దు చేయడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం

ఆత్మకూరు, జనవరి 30 : నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన వైఎస్‌ఆర్ ఆసరా సంబరాల్లో ఆయన గ్రూప్-2 ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న యువతకు సొంత నిధులతో మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నిరుద్యోగులు ఎంతమంది ఉన్నారనేది వలంటీర్ల సహకారంతో వివరాలు సేకరించామన్నారు. గుంటూరు టార్గెట్ ఐఏఎస్ అకాడమీ సహకారంతో గ్రూప్-2కు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ముందుగా ఆయన గాంధీజీ చిత్రపటానికి పూలవేసి నివాళులు అర్పించారు. అనంతరం పొదుపు మహిళలకు ఆసరా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జివెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, కమిషనర్ బీ నాగేశ్వరరావు, జేఏసీ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ట్రైనీ కలెక్టర్ సచివాలయాల సందర్శన

సంగం, జనవరి 30: మండలంలోని పడమటిపాళెం, సంగం సచివాలయాలను ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా మంగళవారం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌పై వీఆర్వోలతో చర్చించారు. సర్వర్ పనిచేయడంలేదని డిజిటల్ అసిస్టెంట్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లలో పేదలకు ఇచ్చిన జగనన్న కాలనీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా రిజిస్ట్రేషన్ల పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. కానీ సర్వర్ పనిచేయడంలేదని తెలిపారు. ఆమె వెంట తహసీల్దారు నాగరాజు, డీటీ ప్రవీణ్ కుమార్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



సంగం సచివాలయంలో పనిచేయని సర్వర్‌ను పరిశీలిస్తున్న సంజనా సిన్హా

ఎరువుల దుకాణాలు తనిఖీ

ఉదయగిరి రూరల్, జనవరి 30: పట్టణంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్ నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాకు రిజిస్టర్, బిల్లుల పుస్తకాలు, ఎరువుల నిల్వలు, తూకాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్టాకు నిల్వల్లో తేడాలుంటే దుకాణాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయాధికారులు ఆంజనేయులనాయక్, వెంకటసుబ్బారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్రవాడలో ధర్మప్రచార వారోత్సవాలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 30: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా మంగళవారం వెంగన్నపాళెం రామాలయంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఉషశ్రీ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు బీ పెద్దభద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంపై ఎంఈవో-2 విచారణ

ఉదయగిరి రూరల్, జనవరి 30: స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంపై మంగళవారం ఎంఈవో-2 టీ.శ్రీనివాసులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ప్రమాద ఘటనపై చర్చించారు. ప్రమాదానికి గురైన స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరో ఆకతాయిలు స్టోర్‌రూమ్ ముందు నిప్పు వెలిగించి లోపలి వేసి ఉంటారని, అందువల్లే మంటలు చెలరేగి గదిలో ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములు, ఇతరత్రా వస్తువులు దగ్ధమయ్యాయన్నారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీ ఇనయితుల్లా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం

ఆత్మకూరు, జనవరి 30 : స్థానిక ఎస్‌వీ జూనియర్ కాలేజీలో మంగళవారం అపస్మా ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో 10వ తరగతి విద్యార్థులకు మనోహర్‌రెడ్డి మెమోరియల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో ఏఎస్‌పేట ఠాగూర్ పాఠశాల విద్యార్థి కె మోహన్ నరేంద్ర ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. సంగం వికాస్ స్కూల్ విద్యార్థి సీహెచ్ వంశీ ద్వితీయ స్థానాన్ని, చేజర్ల లుంబినీ పాఠశాల విద్యార్థి కె కృష్ణకౌశిక్ తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు.. అనంతరం అపస్మా నియోజకవర్గ అధ్యక్షుడు గోలి ప్రభాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీఐ వేణు, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాములు, ఎంఈవోలు నజీర్‌బాషా, చలపతి, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ విజేతలకు నగదు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో అపస్మా నేతలు ఈగ భాస్కర్‌రెడ్డి, సీహెచ్‌వీ రమణారెడ్డి, ఎస్ రామ్మోహన్‌రెడ్డి, రమేష్, కె కోటేశ్వరరెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే ధ్యేయం : మేకపాటి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 30: మహిళాభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం వైఎస్‌ఆర్ చేయూత, సున్నా వడ్డీ, అమ్మఒడి, ఆసరా తదితర పథకాలను అమలు చేస్తుందని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వైఎస్‌ఆర్ ఆసరా నాలుగో విడత కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, పొదుపు మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా పోటీల్లో మండలస్థాయిలో నిలిచిన క్రీడా జట్లకు మేకపాటి సొంత నిధులతో నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, జడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతం, ఏఎంసీ మాజీ చైర్మన్ అలీఅహ్మద్, నందిపాడు సొసైటీ అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎల్‌పీ మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆసరా సంబరాలు

వింజమూరు : వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలను మంగళవారం ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. తదుపరి మేకపాటిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సాల్మన్‌రోజ్, ఏపీడీ శేషారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, రేవునూరి శ్రీనివాసులురెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, సర్పంచి నల్లగొండ సుజనా, సొసైటీ చైర్మన్ మలిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడినరవలో ఆరోగ్య సురక్ష

ఉదయగిరి రూరల్, జనవరి 30: మండలంలోని తిరుమలాపురం సచివాలయ పరిధి గుడినరవలో మంగళవారం రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైద్యాధికారిణి శివకల్పన, సీహెచ్‌వో శివకుమారి, నాయకులు సుబ్బారెడ్డి, మహ్మద్‌ఖాజా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్‌కు ఆర్థిక సాయం

వింజమూరు : పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీకి చెందిన బైక్ మెకానిక్ మహమ్మద్ రఫీ ఇటీ వల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన చికిత్స నిమిత్తం మంగళవారం తోటి మెకానిక్‌లు షేక్ రసూల్, షేక్ బుడ్డా తదితరులు రూ.30వేలను రఫీకి అందజేశారు.



కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

గాంధీకి ఘన నివాళి

కందుకూరు, జనవరి 30: గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే మహీధరరెడ్డి కందుకూరులోని తన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, మోదడుగు వెంకటేశ్వర్లు, రఫి, ముచ్చు శ్రీను, వడ్డెళ్ల రవిచంద్ర, సలాం తదితరులు పాల్గొన్నారు. వాసవీక్లబ్ లెజెండ్స్, వనితాక్లబ్, మండల ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామశివార్లలోని పేద కుటుంబాల చిన్నారులకు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు, కేశవ, ఇన్నమూరి శ్రీనివాసులు, కొత్తూరి నటరాజకుమారి, నారాయణసుకన్య, లలిత, మంజుల కుమారి తదితరులు పాల్గొన్నారు.

కావలిటౌన్ : కావలి ట్రంకురోడ్డులోని గాంధీజీ విగ్రహం వద్ద విగ్రహ వ్యవస్థాపక కమిటీ బాధ్యులు తిరివీధి ప్రసాద్ పర్యవేక్షణలో పలువురు ఘన నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నేతలు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మామిడి రామకృష్ణ, కనమర్లపూడి నారాయణయణ, అమరా వేదగిరి, సువర్ణ శ్రీనివాసులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే పీఎస్సార్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అనుచరులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పసుపులేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో నేతలు గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోతుగంటి శ్రీకాంత్, జ్యోతి బాబురావు, బీ శ్రీహరినాయుడు, కటకం రాము తదితరులు పాల్గొన్నారు. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు భరత్‌కుమార్, బ్రహ్మానందం, సీవీసీ సత్యం, కామినేని ఉదయలక్ష్మి, మందా కిరణ్ తదితరులు పాల్గొన్నారు. జనసేన ఆధ్వర్యంలో నేతలు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీ సాయి, తోట శేషయ్య, ఆలా శ్రీనాథ్, బాబురావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం : చిలకలమర్రి ఉన్నత పాఠశాల, అనంతసాగరం ఎస్సీ ప్రాథమిక పాఠశాలల్లో గాంధీకి విద్యార్థులు ఘన నివాళులు సమర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, వెంకటేశ్వర్లు, గ్రంథ పాలకుడు నారాయణరావు పాల్గొన్నారు.

చేజర్ల : గాంధీ వర్ధంతిని చేజర్లలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండు సముదాయంలో ఉన్న గాంధీ విగ్రహానికి ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పువ్వాడ సుబ్బారావు, దేవతి సుబ్బారావు, జనార్దన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కందుకూరు : గాంధీకి నివాళులర్పిస్తున్న నాగేశ్వరరావు, నేతలు



కావలి : నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



అనంతసాగరం : నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అంబేడ్కర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ఉలవపాడు : ఉలవపాడు అంబేడ్కర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడుగా దాసరి ఆదిత్యరామన్‌కుమార్, కార్యదర్శిగా తాళ్లూరి సునీల్, కోశాధికారిగా దాసరి రాహుల్, ఉపాధ్యక్షుడిగా దాసరి ప్రవీణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా దారా కళ్యాణ్, సాంస్కృతిక కార్యదర్శిగా దాసరి వసంత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

మహాత్మా.. మన్నించు !

వరికుంటపాడు : ప్రస్తుత రాజకీయ నాయకులు తమ పార్టీ నేతల జయంతి, వర్ధంతిని అంగరంగ వైభవంగా జరుపుకుంటుంటారు. అయితే మంగళవారం గాంధీజీ వర్ధంతిని అటు రాజకీయ నాయకులుకానీ, ఇటు అధికారులుకానీ జరపకపోవడం గమనార్హం. ఈ సంఘటన మండలంలోని జడదేవిలో చోటు చేసుకుంది. ఆ విగ్రహాన్ని చూసిన ఊరి జనం మహాత్మా.. మన్నించు ! అనుకుంటూ వెళ్లిపోయారు.



చేసిన పనులకు బిల్లులు చెల్లించండి

● జలదంకి మండల సమావేశంలో సభ్యుల గగ్గోలు

జలదంకి, జనవరి 30: త్వరలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రానుండడంతో అధికార వైసీపీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీల్లో భయం పట్టుకుంది. నాలుగేళ్ల క్రితం జగనన్న ఇళ్ల స్థలాల చదునుకు సంబంధించిన పనులకు రూ.1.21 కోట్ల ఉపాధిహామీ బిల్లులు ఇంకా చెల్లించలేదు. ఈ క్రమం లో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు ఈ బిల్లులపై గగ్గోలు పెట్టారు. గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులకు సంబంధించి ఏఈ ప్రసాద్ వివరించారు. వైసీపీకి చెందిన చామదల బిట్-1 ఎంపీటీసీ పసుపులేటి అమరావతి మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం చేసిన పనులకు బిల్లులు ఎప్పుడుచెల్లిస్తారని ప్రశ్నించారు. దీనికి ఎంపీడీవో సింగయ్య, ఏపీవో శ్యామల మేము చేయాల్సిన పనులు పూర్తి చేశామని, ఉన్నతాధికారులు మీ బ్యాంకుఖాతాల్లో నగదు జమచేస్తారన్నారు. ఈ సమావేశానికి జలదంకి పీహెచ్‌సీ వైద్యుడు, పలువురు అధికారులు డుమ్మాకొట్టడంతో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, వైస్ ఎంపీపీలు పాలవల్లి మాలకొండారెడ్డి, మేకల ధనమ్మ, సొసైటీ అధ్యక్షుడు కేతిరెడ్డి రవిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

వివాదాలు వీడి సమన్వయం పాటించాలి

చిట్రగుంట, జనవరి 30: సాగునీటి విషయంలో రైతులు వివాదాలు విడిచిపెట్టి సమన్వయం పాటిస్తూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఇరిగేషన్ ఏఈ జితేంద్ర రెడ్డి అన్నారు. బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతల సచివాలయంలో స్థానిక రైతులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారకంగా 150 ఎకరాల ఆయకట్టు ఉండగా దళిత, గిరిజన, బీసీ పేదలు 60 ఎకరాలు సాగుచేస్తున్నారన్నారు. రైతులు గొడవలు వీడి పంట నష్టపోకుండా సర్దుకుపోవాలన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి కడనూతల చెరువుకు అదనపు నీరు అందిచేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గడ్డం వెంకయ్య, శెట్టిపల్లి రమణయ్య, దాసరి శ్రీనివాసులు, ఎం.వెంకయ్య, రాధాకృష్ణారెడ్డి, చంద్ర, రవి, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

కావలి, జనవరి 30 : పట్టణంలోని వివిధ సచివాలయాలలో మంగళవారం స్పర్శ కుష్టు వ్యాధిలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆశాలు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ఫిబ్రవరి 13వ తేదీ వరకు కొనసాగుతోందన్నారు. కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వెంగళరావునగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారిణి రమ్య, కావలి డివిజన్ డీపీఎంవోలు నరసారెడ్డి, వెంకటేశ్వరరావు. అర్బన్‌హెల్త్ సెంటర్ సిబ్బంది, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత సురేంద్రకు సన్మానం

చిట్రగుంట, జనవరి 30: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధక శాఖ తరుపున ఢిల్లీ రిపబ్లిక్ డేలో పాల్గొని అవార్డు అందుకున్న బోగోలు మండలం జక్కేపల్లి గూడూరు ఆర్‌బీకే వెటర్నరీ ఏహెచ్‌ఏ పందిటి సురేంద్రను మంగళవారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు శ్రావణ్‌కుమార్, మహేశ్వరయ్య, మన్ననం రాజు, గౌతమ్‌లు పాల్గొన్నారు.

త్యాగరాజస్వామి జయంత్యుత్సవాలు

కందుకూరు, జనవరి 30: పట్టణంలోని పామూరురోడ్డులో ఉన్న త్యాగరాజస్వామి ఆలయంలో మంగళవారం స్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీహార్ మాజీముఖ్యమంత్రి కర్పూర ఠాకూర్‌కు కేంద్రప్రభుత్వం భారతరత్న ఇవ్వటం పట్ల నాయీబ్రాహ్మణసంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు వల్లూరి కోటేశ్వరరావు, బీవీ రమణ, కరేటి వెంకటేశ్వర్లు, రాంబాబు, శ్రీహరి, యలమందరావు, సుబ్బారావు, పాల్గొన్నారు.

'నిజం గెలవాలి' విజయవంతం చేయాలి

ఉలవపాడు, జనవరి 30 : నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా బుధవారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి మండలంలో పర్యటించనున్నట్లు టీడీపీ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టారని మనస్తాపంతో మృతి చెందిన కరేడు పంచాయతీలోని టెంకాయచెట్ల పాలెం మత్స్యకారుడు వాయిల సుందరరావు, మన్నేటికోటకు చెందిన ఎండ్లూరి చినకోటయ్య కుటుంబాలను సాయంత్రం 5 గంటలకు పరామర్శిస్తారని చెప్పారు.

విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యం : ఆర్టీవో

కావలి రూరల్, జనవరి 30: స్కూల్ బస్‌ల్లో విద్యార్థుల భద్రతకు రవాణాశాఖ అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఆర్టీవో వై.సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి పట్టణం శాంతినగర్‌లోని శ్రీ చైతన్య సీబీఎస్‌ఈ క్యాంపస్‌లో మంగళవారం పాఠశాలలు, కళాశాలల బస్ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నిర్దేశించిన వేగంతోనే బస్‌లు నడపాలని, తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలన్నారు. మద్యం సేవించి స్కూల్ బస్‌లు నడుపుతూ పట్టుబడితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల నిర్వాహకులు బస్‌లు ఎప్పుడూ ఫిట్‌నెస్‌తో ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుంధరరావు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, శ్రీ చైతన్య ప్రిన్సిపాళ్లు శైలేష్ కుమార్, శివకుమార్, డ్రైవర్లు పాల్గొన్నారు.



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కందుకూరు : ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి (ఎంవీఐ) షేక్ మహమ్మద్ రఫీ సూచించారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక నక్షత్ర కాలేజీలో ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు, హెల్పర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నక్షత్ర కాలేజీ డైరెక్టర్ పోకా శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ ఒంగోలు జార్జ్, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో జాగ్రత్తలు పాటించాలి

● జిల్లా ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర రెడ్డి

కావలి రూరల్, జనవరి 30: మద్యం దుకాణాల నిర్వహణలో జాగ్రత్తలు వహించాలని ఏవైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సెబ్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ప్రభుత్వ మద్యం షాపుల సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దుకాణాల వద్ద ఎలాంటి అవకతవకలు లేకుండా జాగ్రత్తగా ఉద్యోగాలు చేసుకోవాలని హెచ్చరించారు. అనంతరం మద్యం షాపులు, బార్‌ల నిర్వహణపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

అపస్మా ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్ష

అల్లూరు, జనవరి 30 : నియోజకవర్గ స్థాయిలో చేపట్టిన మనోహర్‌రెడ్డి మెమోరియల్ టాలెంట్ పరీక్షను మండలం నార్తుమోపూరు శ్రీచైతన్య విద్యాసంస్థల్లో మంగళవారం నిర్వహించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల కరస్పాండెంట్ కె.శివకుమార్ మాట్లాడుతూ అపస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలోక 33 మంది విద్యార్థులు పాల్గొనగా కావలి నలంద హైస్కూల్ విద్యార్థి జి.ధనుష్క ప్రథమ, ద్వితీయ స్థానంలో నార్తుమోపూరు శ్రీచైత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి పి.నేహ, తృతీయ స్థానంలో జయఉష హైస్కూల్‌కు చెందిన ఆర్.లక్ష్మీసుహితలు నిలిచారన్నారు. వీరికి ప్రోత్సాహక బహుమతులను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపస్మా సెక్రటరీ గోపాల్‌రెడ్డి, ట్రెజరర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీతోనే మహిళల అభివృద్ధి : బీద

అల్లూరు, జనవరి 30 : వైసీపీ ప్రభుత్వంలో మహిళలు అభివృద్ధి చెందారని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మంగళవారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన భవన గదులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం పొదుపు మహిళలకు చెక్కును అందజేశారు. బీద మస్తాన్‌రావు అవినీతి రహిత పాలన అంటూ మాట్లాడుతుండగా అక్కడే ఉన్న ఓ రైతు అనేక పనుల్లో రూ.కోట్లు దోచుకున్నారని, ఇదంతా అవినీతి కాదా అని ప్రశ్నించగా అతడిని పోలీసులు అక్కడి నుంచి దూరంగా తీసుకెళ్లిపోయారు. దీనిపై స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, జడ్పీటీసీ వేణమ్మ, నాయకులు నీలం సాయి కుమార్, దండా కృష్ణారెడ్డి, మేడా రామకృష్ణారెడ్డి, ఉస్మాన్ షరీఫ్ అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ

లింగసముద్రం, జనవరి 30 : మహిళల ఆర్థికాభివృద్ధే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో జరిగిన 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 784 పొదుపు గ్రూపులకు ఈ పథకం కింద 4వ విడతలో రూ.8.47 కోట్లు మంజూరైందని చెప్పారు. అనంతరం చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, సర్పంచ్ పులి రాఘవులు, తహసీల్దారు టీ ప్రసాద్, ఎంపీడీఓ యు శేషుబాబు, ఏపీఎం కె సింహాద్రిరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జేరి రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్వాక్రా మహిళలకు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పానుగోటి మౌనిక, జడ్పీటీసీ ఇంటూరి బారతి, ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్, తహసీల్దార్ సుందరమ్మ, ఏపియం చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాలకొండలో దుకాణాలకు 2న వేలం

వలేటివారిపాలెం, జనవరి 30 : మండలంలోని మాలకొండలో దుకాణాలు ఏర్పాటు, తలనీలాలుకు లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలోని కల్యాణ మండపంలో ఫిబ్రవరి 2వ తేది ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో 20 మందికి కొలువులు

కందుకూరు, జనవరి 30: టీవీఎస్ సుందరం కంపెనీ ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 20 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించి ఆఫర్‌లెటర్లు అందుకున్నారని కాలేజీ టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్ బ్రాంచి విద్యార్థులే లక్ష్యంగా ఈ డ్రైవ్ నిర్వహించగా 2.5 లక్షల ప్యాకేజీతో చెన్నై లోకేషన్‌లో ఉద్యోగాలు ఇచ్చేందుకు కంపెనీ ఆఫర్లు లెటర్లు ఇచ్చిందని ఆయన తెలిపారు. కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, ప్రిన్సిపాల్ డాక్టరు సిహెచ్ రవికుమార్, వైస్‌ప్రిన్సిపాల్ హరిబాబు, మెకానికల్ హెచ్‌ఓడీ డాక్టరు పున్నారావు విద్యార్థులను అభినందించారు.